అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

ఆదివారం 30-4-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 | సంచిక : 119 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 12 పేజీలు +(సోపతి పోబోలో) | వెల : 8.00





జేఈఈ మెయిన్‌లో శ్రీచైతన్య సంచలన రికార్డు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జేఈఈ మెయిన్-2023 ఫలితాల్లో శ్రీచైతన్య విద్యాసంస్థ సంచలన రికార్డు సృష్టించింది. శనివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ మాట్లాడుతూ ఓపెన్ కేటగిరీలో 300కు 300 మార్కులతో ఆలిండియా ప్రథమ ర్యాంక్‌ను తమ విద్యార్థి వెంకట కౌండిన్య పొందారని చెప్పారు. కె సాయినాథ్ శ్రీమంత్ టాప్ 10 ర్యాంక్‌లో నిలిచారని వివరించారు. అఖిల భారత స్థాయిలో టాప్ టెన్‌లో రెండు, టాప్ 100లో 23 ర్యాంక్‌లు తమ విద్యాసంస్థకు చెందిన విద్యార్థులు పొందారని అన్నారు. అన్ని కేటగిరీల్లో కలిపి టాప్ వందలో 91 మంది ర్యాంకులు సాధించారని చెప్పారు. ఓపెన్ కేటగిరీలో టాప్ వెయ్యిలోపు 146 ర్యాంక్‌లు సాధించామన్నారు. టాప్ వంద ర్యాంకులు పొందిన వారిలో శ్రీచైతన్య టెక్నో స్కూల్ విద్యార్థులు 18 మంది ఉన్నారని వివరించారు. వంద పర్సెంటైల్ పొందిన వారిలో 15 మంది విద్యార్థులున్నారని చెప్పారు. నిరంతరం శ్రమించే తమ అధ్యాపక బృందం వల్లే ఇది సాధ్యమయ్యిందన్నారు. మెరుగైన ఫలితాలు సాధిస్తున్నందునే దేశ వ్యాప్తంగా ఐఐటీ, ఎన్ఐటీ ప్రవేశాల కోసం విద్యార్థులు శ్రీచైతన్యను ఎంచుకుంటున్నారని అన్నారు. ఘనవిజయం సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బందిని శ్రీచైతన్య విద్యాసంస్థల అధినేత బీఎస్ రావు అభినందించారు.

నారాయణ విద్యార్థుల విజయదుందుభి

జేఈఈ మెయిన్ ఫలితాల్లో నారాయణ విద్యాసంస్థ రికార్డు ర్యాంకులను సొంతం చేసుకుంది. ఈ మేరకు నారాయణ గ్రూప్ డైరెక్టర్లు పి సింధూర నారాయణ, శరణి నారాయణ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఓపెన్ కేటగిరీలో అఖిల భారత స్థాయిలో రెండు, ఐదు, ఆరు ర్యాంకులను తమ విద్యార్థులు సాధించారని తెలిపారు. టాప్ 100లో తమ విద్యార్థులు 25 ర్యాంకులను కైవసం చేసుకున్నారని పేర్కొన్నారు. లోహిత్ ఆదిత్య సాయి రెండో ర్యాంకు, కౌషల్ విజయ్ వార్గేయ ఐదో ర్యాంకు, సాయి దుర్గారెడ్డి ఆరో ర్యాంక్‌లను పొందారని వెల్లడించారు.

రికార్డు స్థాయిలో
43 మందికి వంద ఎన్టీఏ స్కోర్

- జేఈఈ మెయిన్‌లో తెలుగు విద్యార్థుల సత్తా
- తెలంగాణకు చెందిన సింగరాజు వెంకట కౌండిన్య టాపర్
- టాప్ టెన్‌లో నలుగురు మన విద్యార్థులే
- మహిళల్లో కర్నాటకకు చెందిన మహేశ్వరి ప్రథమం
- నేటినుంచి జేఈఈ అడ్వాన్స్‌డ్ రిజిస్ట్రేషన్లు షురూ



వెంకట కౌండిన్య | సాయినాథ్ శ్రీమంత్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశంలో ఎన్ఐటీల్లో ప్రవేశం, ఐఐటీల్లో ప్రవేశాలకు నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు ఎంపిక కోసం నిర్వహించే జేఈఈ మెయిన్ ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) శనివారం విడుదల చేసింది. దేశవ్యాప్తంగా రికార్డు స్థాయిలో 43 మంది విద్యార్థులు వంద ఎన్టీఏ స్కోర్ సాధించారు. ఇందులో తెలంగాణ వారు 11 మంది, ఏపీ వారు ఐదు మంది కలిపి మొత్తం 16 మంది విద్యార్థులున్నారు. టాప్‌టెన్‌లో నలుగురు తెలుగు విద్యార్థులే ఉండడం గమనార్హం. తెలంగాణకు చెందిన సింగరాజు వెంకట కౌండిన్య 300కు 300 మార్కులు సాధించి జాతీయస్థాయిలో టాపర్‌గా నిలిచారు. ఏపీకి చెందిన కల్లకూరి సాయినాథ్ శ్రీమంత్ రెండో ర్యాంకు, తెలంగాణకు చెందిన నందిపాటి సాయి దుర్గారెడ్డి ఆరో ర్యాంకు, ఏపీకి చెందిన పునుమల్లి లోహిత్ ఆదిత్య పదో ర్యాంకు సాధించారు. మహిళల కేటగిరీలో కర్నాటకకు చెందిన రిధి కమలేష్ కుమార్ మహేశ్వరి టాపర్‌గా నిలిచారు. ఓబీసీ కేటగిరీలో అల్లం సుజయ్, ఎస్సీ కేటగిరీలో దేశాంక్ ప్రతాప్‌సింగ్, ఎస్టీ కేటగిరీలో ధీరావత్ తనుజ, వికలాంగుల కేటగిరీలో దీపెన్ సోజిత్ర ప్రథమ స్థానంలో ఉన్నారు. జేఈఈ మెయిన్ మొదటి విడత పరీక్షలు జనవరి 24, 25, 29, 30, 31తోపాటు ఫిబ్రవరి ఒకటో తేదీన నిర్వహించారు. రెండో విడత పరీక్షలు ఏప్రిల్ ఆరు నుంచి 15వ తేదీ వరకు జరిగాయి. దేశవ్యాప్తంగా 11,62,398 మంది దరఖాస్తు చేస్తే, 11,13,325 మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. ఇందులో పేపర్-1 రాతపరీక్షలకు 9,31,510 మంది అభ్యర్థులు దరఖాస్తు చేస్తే, వారిలో 8,83,372 (94.83 శాతం) మంది హాజరయ్యారు. జేఈఈ మెయిన్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 2.50 లక్షల మంది విద్యార్థులను అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధిస్తారు. ఈ ఏడాది జనరల్‌లో 98,612 మంది, వికలాంగులు 2,685 మంది, ఈడబ్ల్యూఎస్‌లో 25,057 మంది, ఓబీసీల్లో 67,613 మంది, ఎస్సీల్లో 37,536 మంది, ఎస్టీల్లో 18,752 మంది కలిపి మొత్తం 2,50,255 మంది అభ్యర్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించారు. జేఈఈ అడ్వాన్స్‌డ్ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ఆన్‌లైన్‌లో ఆదివారం నుంచి ప్రారంభమవుతుంది. రిజిస్ట్రేషన్లకు తుది గడువు వచ్చేనెల ఏడో తేదీ వరకు ఉన్నది. వచ్చేనెల ఎనిమిదో తేదీ వరకు ఫీజు చెల్లింపునకు గడువున్నది. జేఈఈ అడ్వాన్స్‌డ్ రాతపరీక్ష జూన్ నాలుగో తేదీన నిర్వహించనున్నట్టు ఎన్టీఏ ప్రకటించింది. తెలంగాణలో ఆదిలాబాద్, హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, కోదాడ, కొత్తగూడెం, మహబూబ్‌నగర్, నల్లగొండ, నిజామాబాద్, సత్తుపల్లి, సిద్దిపేట, సూర్యాపేట, వరంగల్‌తో మొత్తం 13 ప్రాంతాల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఏపీలో 22 ప్రాంతాల్లో పరీక్షా కేంద్రాలున్నాయి.

బాంబే ఐఐటీలో చేరతా : కౌండిన్య, టాపర్

'నాకు జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకు రావడం ఆనందంగా ఉంది. అధ్యాపకుల కృషి, తల్లిదండ్రుల సహకారం వల్లే ఈ విజయాన్ని సాధించాను. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లోనూ మంచి ర్యాంకు వస్తుందన్న నమ్మకముంది. బాంబే ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ (సీఎస్ఈ) కోర్సులో చేరతాను.'అని జేఈఈ మెయిన్ టాపర్ సింగరాజు వెంకట కౌండిన్య చెప్పారు.

జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మెకు సీఐటీయూ మద్దతు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేస్తున్న సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్టు సీఐటీయూ ప్రకటించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్కరాములు, పాలడుగు భాస్కర్ ఒక ప్రకటన విడుదల చేశారు. న్యాయమైన డిమాండ్ల కోసం సమ్మె చేస్తున్న పంచాయతీ కార్యదర్శుల ఫెడరేషన్ నాయకులతో చర్చలు జరపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వారి విధులను ఫీల్డ్ అసిస్టెంట్లు, వీఆర్ఏలు, కారోబార్, బిల్ కలెక్టర్లకు అప్పగించడం సరైంది కాదని పేర్కొన్నారు. ఈ సమ్మెకు ఇతర శాఖల్లోని ఉద్యోగులు సహకరించాలని కోరారు. మూడేండ్ల ప్రొబేషనరీ కాలం అని మొదట్లో చెప్పి దాన్ని నాలుగేండ్లకు పెంచారనీ, ఆ గడువు పూర్తయినా వారిని పర్మినెంట్ చేయకపోవడం దారుణమని పేర్కొన్నారు. మరణించిన జూనియర్ పంచాయతీ కార్యదర్శుల స్థానంలో కారుణ్య నియామకాలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అర్హులైన సీనియర్ పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతులు కల్పించాలని విన్నవించారు.

తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ మద్దతు

జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేస్తున్న సమ్మెకు తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ కూడా మద్దతు ప్రకటించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.పాండు, సీహెచ్.వెంకటయ్య, ఉపాధ్యక్షులు పి.సుధాకర్ ఒక ప్రకటన విడుదల చేశారు. క్రమబద్ధీకరణ కోసం జరుగుతున్న సమ్మె న్యాయ సమ్మతమైనదని తెలిపారు.

డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీపై కేటీఆర్ తొలి సంతకం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

హైదరాబాద్ నగరంలో లక్ష మందికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ మార్గదర్శకాల ఫైలుపై నూతన సచివాలయంలో తొలి సంతకాన్ని మంత్రి కల్వకుంట్ల తారకరామారావు చేయనున్నారు. డాక్టర్ బీఆర్. అంబేద్కర్ నూతన సచివాలయ భవనంలో తనకు కేటాయించిన కార్యాలయంలోకి మంత్రి కేటీఆర్ ఆదివారం నాడు అడుగుపెట్టబోతున్నారు. నూతన సచివాలయంలోని మూడో అంతస్తులో గల తన కార్యాలయం నుంచి తన విధులను నిర్వర్తించనున్నారు.

ఓఆర్ఆర్ లీజు అతిపెద్ద స్కామ్

- రూ.1000 కోట్లు చేతులు మారాయి
- రూ. 30వేల కోట్లు వచ్చేదాన్ని కేవలం రూ.7380 కోట్లకే కట్టబెట్టారు
- అన్ని విచారణ సంస్థలకు ఫిర్యాదు చేస్తాం : టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్)ను లీజుకివ్వడం వెనుక దేశంలోనే అతిపెద్ద స్కామ్ అని టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్ రెడ్డి ఆరోపించారు. లీజు వ్యవహారంలో రూ.1000 కోట్లు చేతులు మారా యని విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఏటా కనీసం 10 శాతం పెరుగుతున్నదని అంచనా వేసినా కనీసం రూ. 30వేల కోట్లు ఆదాయం వచ్చే ఓఆర్ఆర్‌ను రూ.7380 కోట్లకే ముంబాయి కంపెనీకి తాకట్టు పెట్టారని చెప్పారు. మొదట్లో లీజు ద్వారా రూ. 10వేల కోట్ల ఆదాయం వస్తుందని చెప్పారు. ముందుగా రూ.8 లేదా9వేల కోట్లు అని చెప్పారనీ, ఇప్పుడు రూ.7380 కోట్లు వచ్చాయని తెలిపారు. ఈ వ్యవహారంలో దాగి ఉన్న మతలబు ఏంటని ఆయన ప్రశ్నించారు. ఓఆర్ఆర్ లీజుకు సంబంధించిన మొత్తం వ్యవహారం సోమేష్‌కుమార్ కనుసన్నుల్లో జరిగిందన్నారు. అర్వింద్‌కుమార్ సంతకం పెట్టారని తెలిపారు. ప్రభుత్వం దిగిపోయే ఆరు నెలల ముందు తీసుకున్నా ఏ నిర్ణయాలైనా వచ్చే ప్రభుత్వం సమీక్షిస్తుందని గుర్తు చేశారు. కేటీఆర్, అధికారులు సోమేష్‌కుమార్, అర్వింద్‌కుమార్ ఈ వ్యవహారంలో దోపిడికి పాల్పడ్డారని ఆరోపించారు. 2018 నుంచి ఓఆర్ఆర్ టోల్‌ను ఏయే సంస్థలు వసూలు చేశాయో, వాటికి టెండర్ రూపంలో లేదా నామినేషన్ రూపంలో కట్టబెట్టారో అనే విషయాన్ని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. గత నాలుగేండ్ల నుంచి ఓఆర్ఆర్ టోల్‌ను ఈగల్ ఇన్‌ఫ్రాకు కట్టబెట్టారని చెప్పారు. ఓఆర్ఆర్ రోజుకు రూ. 2 కోట్ల టోల్ వసూలు అవుతుందన్నారు. టెండర్ అవసరం లేకుండానే ఏడాదికి ఏడాది పొడిగించు కుంటూ కేటీఆర్ ఇందులో పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారని చెప్పారు. ఔటర్ రింగ్ రోడ్‌ను ఆదాయ వనరుగా కేటీఆర్ మిత్రబృందం ఉపయోగిం చుకుందన్నారు. ఇందుకు మాజీ సీఎస్ సోమేష్ కుమార్, హెచ్ఎండీఏ కమిషనర్ అర్వింద్‌కుమార్, జయేష్ రంజన్ సహకరిం చారనీ, ఈ ఆదాయాన్ని శాశ్వతంగా ఉపయో గించు కునేందుకు కేటీఆర్ కుటుంబం ఆలోచించిందని చెప్పారు. తమ కుటుంబానికి లాభం ఉండదని గ్రహించి టోల్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్ (టీవోటీ) విధానంలో 30 ఏండ్ల ప్రయివేటు సంస్థకు కట్టబెట్టాలనే నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. ఔటర్ రింగ్ రోడ్డును కేటీఆర్ ప్రయివేటు కంపెనీకి తాకట్టు పెట్టారని విమర్శించారు. ఈ లెక్క ప్రకారం వేల కోట్ల ఆదాయం వచ్చే రింగ్‌రోడ్‌ను ప్రయివేటుకు అమ్మేశారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న ఇటువంటి నిర్ణయాలపై బీజేపీ ఎందుకు మౌనంగా ఉంటుందని ప్రశ్నించారు. ప్రజల ఆస్తులను సీఎం కేసీఆర్ అమ్ముతుంటే, బీజేపీ నాయకులు బండి సంజయ్, కిషన్‌రెడ్డి ఎందుకు స్పందించడం లేదని పేర్కొన్నారు. ఈ అంశంపై బీజేపీ నేతలు కూడా స్పందించాలని డిమాండ్ చేశారు. 2004లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మించిందని గుర్తు చేశారు.

హైదరాబాద్ మహా నగరానికి మణిహారంగా ఔటర్ రింగ్ రోడ్‌ను నిర్మించేందుకు గత కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 6696 కోట్లు ఖర్చు చేసిందని పేర్కొన్నారు. హైదరాబాద్‌కు వచ్చే ప్రతి వాహనం ఓఆర్ఆర్‌ను టచ్ చేయాల్సిందేనన్నారు. ఓఆర్ఆర్‌ను లీజుకు ఇవ్వాలన్న నిర్ణయంతో ప్రజలు ఔటర్ రింగ్ రోడ్‌ను వినియోగిం చుకోలేని పరిస్థితులొచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. టోల్‌ఛార్జీలు పెంచుకునే వెసులు బాటుకు కూడా టోల్ సంస్థకు కట్టబెట్టారని విమర్శించారు. పెట్టుబడులు అంటే మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. కానీ ఉన్నవాటిని అమ్మేసి దాన్ని పెట్టుబడిగా ప్రభుత్వం పెద్దఎత్తున ప్రచారానికి దిగుతున్నదని విమర్శించారు. టెండర్ విధానాలపై ఈడీ, సీబీఐ, సెంట్రల్ విజిలెన్స్‌సహా విచారణ సంస్థలన్నింటికి ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యుడిగా విక్రమ్ సింగ్

- అత్యున్నత కమిటీలో అతి పిన్న వయస్కుడు



న్యూఢిల్లీ : సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యుడిగా అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐఏడబ్ల్యూయూ) సహాయ కార్యదర్శి విక్రమ్ సింగ్ ఎన్నిక అయ్యారు. దీంతో సీపీఐ(ఎం) అత్యున్నత కమిటీలో అతి పిన్న వయస్కుడిగా ఆయన నిలిచారు. ఢిల్లీలోని హరి కిషన్ సింగ్ సుర్జీత్ భవన్‌లో మూడు రోజుల పాటు జరిగిన సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సమావే శాలు శనివారం ముగిశాయి. ఈ సమావేశాల్లో కేంద్ర కమిటీ సభ్యులంతా విక్రమ్ సింగ్‌ను కేంద్ర కమిటీ సభ్యునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 43 ఏళ్ల విక్రమ్ సింగ్ 1980 అక్టోబర్ 1న హిమాచల్ ప్రదేశ్‌లోని కంగ్రా జిల్లా, ఇండోరా మండలం, భాపు గ్రామంలో జన్మించారు. తండ్రి హన్స్ రాజ్ వ్యవసాయ కార్మికుడు. ఆయన ఇండియన్ ఆర్మీలో కూడా సేవలందించారు. తల్లి రామ్‌ప్యారీ కుటుంబ బాధ్యతలు నిర్వహి స్తున్నారు. 2000లో విక్రమ్ సింగ్ బీఎస్‌సి చదువుతున్నప్పుడు ఎస్ఎఫ్ఐలో చేరారు. ఆ ఏడాదే సీపీఐ(ఎం) సభ్యత్వం తీసుకున్నారు. 2003లో హిమాచల్ యూనివర్సిటీలో ఎంఎస్‌సీ జూవాలజీలో చేరారు. 2004లో యూనివర్శిటీ కమిటీ కార్యదర్శి గా ఎన్నికయ్యారు. 2005లో హిమాచల్ ప్రదేశ్ యూనివర్శిటీ విద్యార్థి సంఘం (హెచ్‌పీయూఎస్‌యూ) ఎన్నికల్లో అధ్యక్షునిగా ఘన విజయం సాధించారు. 2009లో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టారు. 2011లో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శిగా, 2013లో జాతీయ సహాయ కార్యదర్శిగా, 2016లో ఎస్ఎఫ్ఐ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. హెచ్‌పీయూలో ఎంఎస్‌సీ పూర్తి చేసిన తరువాత, జూవాలజీలో ఎంఫిల్, పీహెచ్‌డీ పూర్తి చేశారు. 2016లో యుజిసి అందించిన అత్యున్నత ఫెలోషిప్ పీడీఎఫ్‌ను సొంతం చేసుకున్నారు. 2018లో ఎస్ఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి బాధ్యతల నుంచి రిలీవ్ అయ్యి, వ్యవసాయ కార్మిక సంఘంలో పని చేశారు. 2019లో ఏఐఏడబ్ల్యూయూ వర్కింగ్ కమిటీ సభ్యుడిగా, ఆ తరువాత 2020లో ఏఐఏడబ్ల్యూయూ సహాయ కార్యదర్శిగా ఎన్నికయ్యారు.



టీఐడీసీలో నాలుగోసారి సీఐటీయూ జయకేతనం

- ఎమ్మెల్యే రఘునందన్‌రావుపై సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు విజయం

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

సంగారెడ్డి జిల్లాలోని ఖాజీపల్లి పారిశ్రామిక వాడలో గల టీఐడీసీ పరిశ్రమలో శనివారం జరిగిన కార్మిక సంఘాల ఎన్నికల్లో వరుసగా నాలుగోసారి సీఐటీయూ జయకేతనం ఎగురవేసింది. బీఎంఎస్ తరఫున ఎమ్మెల్యే రఘునందన్‌రావు, సీఐటీయూ తరఫున ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు పోటీపడ్డారు. పరిశ్రమలో మొత్తం 173 ఓట్లు ఉండగా.. రెండు ఓట్లు పోలు కాలేదు. మిగిలిన వాటిలో రఘునందన్ రావు కు 84 ఓట్లు రాగా.. చుక్క రాములుకు 87 ఓట్లు పోలయ్యాయి. మూడు ఓట్ల మెజార్టీతో రఘునందన్‌రావుపై చుక్క రాములు విజయం సాధించారు. ఈ సందర్భంగా పరిశ్రమ వద్ద జరిగిన ఊరేగింపు ప్రదర్శన అనంతరం చుక్కా రాములు మాట్లాడుతూ.. కార్మికులకు సీఐటీయూతోనే న్యాయం జరుగుతుందన్నారు. కార్మికులందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. హామీలన్నీ అమలుకు కృషి చేస్తామన్నారు. కార్మికులు మంచి విజయాన్ని అందించారని, ప్రత్యర్థి వాళ్ళు డబ్బులు పంచినా, మందు తాగించినా.. చివరికి సీఐటీయూనే గెలిపించారన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బి.మల్లేశం, ఉపాధ్యక్షులు కే.రాజయ్య, టీఐడీసీ నాయకులు భాస్కర్ రెడ్డి, శ్రీకాంత్, చంద్రశేఖర్, వేణుగోపాల్, ప్రభాకర్, వెంకటేశ్వర్లు, యాదయ్య, ఇతర నాయకులు వి.ఎస్ రాజు, మధుసూదన్ రెడ్డి, శ్రీధర్‌రావు, సంతోష్ గౌడ్, సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, టీఐడీసీ పరిశ్రమలో విజయాన్ని పురస్కరించుకుని సీఐటీయూ సంగారెడ్డి జిల్లా కార్యాలయం వద్ద స్వీట్లు పంచుకుని కార్మికులు సంబురాలు జరుపుకున్నారు.

నేడే కొత్త సెక్రటేరియేట్ ప్రారంభం



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రానికే తలమానికంగా నిర్మితమైన కొత్త సచివాలయం ఆదివారం ప్రారంభోత్సవం జరుపుకోనుంది. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు మధ్యాహ్నం ఒంటి గంటకు రాష్ట్ర ప్రజలకు అంకితం చేయనున్నారు. దాదాపు రెండు సంవత్సరాల అనంతరం సెక్రటేరియేట్ అందుబాటులోకి వస్తున్నది. దాదాపు రూ. 1000 కోట్ల వ్యయంతో హైదరాబాద్ నడిబొడ్డున కొలువుదీరనుంది. కోట్లాది మంది భవితవ్యానికి చిరునామా కానుంది. సీఎం కేసీఆర్ మాటల ప్రకారం సకుల జనుల సంక్షేమ పాలన కోసమే కొత్త సచివాలయానికి పునాది పడింది. దేశంలోనే తొలి గ్రీన్ సెక్రటేరియేట్ ఇప్పటికే ఖ్యాతిగాంచింది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, ప్లగ్ అండ్ ప్లే విధానంతో నిర్మాణం పూర్తి చేసుకుంది. సకల పరిపాలన సౌకర్యాలతో ప్రజలకు అందుబాటులోకి వస్తున్నది. ప్రారంభం రోజు నుంచే సచివాలయం ప్రజలకు అందుబాటులోకి రానుంది. ఈమేరకు ప్రభుత్వం కచ్చితమైన చర్యలు తీసుకుంది. ప్రభుత్వ శాఖల తరలింపు ఇప్పటికే పూర్తయిన నేపథ్యంలో మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, కార్యదర్శులు సైతం తమ చాంభర్లను ఇప్పటికే చేరకున్నారు. సీఎం నిర్దేశనం ప్రకారం లాంఛనంగా ఆదివారం తమ, తమ కుర్చీల్లో ఆసీనులవుతారు.

నిర్మాణ ప్రత్యేకతలు : మహాద్వారం

29 అడుగుల వెడల్పు, 24 అడుగుల ఎత్తున నాలుగు తలుపులతో బాహుబలి మహాద్వారాన్ని ఏర్పాటు చేశారు. ఆదిలాబాదు అడవుల్లోని టేకు కలపతో నాగపూర్ లో ఈ మహాద్వారం తయారుచేయబడింది. కలపపై ఇత్తడి పోతతో నగిషీలు చెక్కించారు. మొత్తం సచివాలయ ప్రాంగణంలో తలుపులన్నింటినీ టేకుతోనే తయారు చేశారు.

జాతీయ చిహ్నం

ప్రధానమైన రెండు గుమ్మటాలపై 18 అడుగుల ఎత్తులో జాతీయ చిహ్నమైన 4 సింహాల చిహ్నాలను ఏర్పాటుచేశారు. 5 అడుగుల ఎత్తు, 2.5 టన్నుల బరువుండే జాతీయ చిహ్నాలను ఢిల్లీలో తయారు చేయించి తీసుకువచ్చి అమర్చారు.

మినీ రిజర్వాయర్

నీటిని పొదుపు చేసే ఉద్దేశంతో సచివాలయ భవనం భూగర్భంలో రెండున్నర లక్షల లీటర్ల సామర్థ్యంతో మినీ రిజర్వాయర్ నిర్మించబడింది. భవనం నలువైపుల నుంచి వాన నీటిని రిజర్వాయర్ లోకి తరలించేందుకు ప్రత్యేక పైప్ లైన్ వ్యవస్థ ఏర్పాటు చేయబడింది. సచివాలయం ప్రాంగణంలో ఏర్పాటుచేసిన 9 ఎకరాల పచ్చిక బయళ్ళ నిర్వహణకు ఈ రిజర్వాయర్ లోని నీటినే వినియోగిస్తారు.

ప్రార్థనా మందిరాలు

సచివాలయంలో మునుపటి మాదిరిగానే హిందూ, ముస్లిం, క్రైస్తవ ప్రార్థన మందిరాలను ప్రభుత్వం నిర్మించింది. గతం కంటే విశాలంగా, సుందరంగా వీటిని తీర్చిదిద్దారు. ఆయా మత పెద్దల ఆకాంక్షల మేరకు నిర్మా ణాలు చేయించుకునే వెసులు బాటును ప్రభుత్వం కల్పించింది. దేవాలయం, మసీదు, చర్చి కోసం సుమారు తొమ్మిది వేల చదరపు అడుగులను కేటాయించారు.

భద్రత ఏర్పాట్లు

సచివాలయ భద్రతకు ప్రభుత్వం అత్యాధునిక వ్యవస్థను ఏర్పాటు చేసింది. సందర్శకుల వివరాలన్నీ భద్రతాధికారుల కంప్యూటర్ తెరపై క్షణాల్లో ప్రత్యక్షమవుతాయి. ఆ భద్రతా వలయాన్ని దాటిన తరువాతే ఎవరైనా సచివాలయంలోనికి ప్రవేశించ గలరు. నిత్యం సుమారు 650 మందికి పైగా భద్రతా సిబ్బంది పహారా కాయనున్నారు. రాత్రీ పగలూ నిరంతరాయంగా పని చేసే పటిష్టమైన సీసీటీవీల కెమెరా వ్యవస్థను ఇక్కడ ఏర్పాటు చేశారు. సందర్శకులు ముఖ గుర్తింపు (ఫేస్ రికగ్నిషన్) ద్వారా వారి సమాచారం ఆధార్ డేటాతో అనుసంధానమవుతుంది. పోలీసు కమాండ్ కంట్రోల్ కేంద్రంలో నిక్షిప్తమై ఉండే డేటా ద్వారా సందర్శకుని పూర్తి వివరాలు అప్పటికప్పుడే కంప్యూటర్ తెరపై కనిపిస్తాయి.

ట్యాంక్‌బండ్ పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు

సచివాలయం ప్రారంభోత్సవం నేపథ్యంలో ట్రాఫిక్ రద్దీ ఏర్పడే అవకాశం ఉండటంతో హుస్సేన్‌సాగర్ పరిసరాల్లో ఉదయం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్టు నగర ట్రాఫిక్ అదనపు సీపీ సుధీర్‌బాబు తెలిపారు. వీవీ విగ్రహం, నెక్లెస్ రోటరీ, ఎన్టీఆర్ మార్గ్, తెలుగు తల్లి జంక్షన్ వరకు ఇరువైపుల అప్పటి పరిస్థితులను బట్టి ట్రాఫిక్‌ను నిలిపివేస్తారు. ఆదివారం ఎన్టీఆర్ గార్డెన్, ఎన్టీఆర్ ఘాట్, నెక్లెస్ రోడ్డు, లుంబినీ పార్కులు మూసివేయనున్నట్టు అదనపు సీపీ వెల్లడించారు. హెచ్ఎండీఏ సైతం ఈ విషయాన్ని ధృవీకరించింది. ఆహ్వానితుల కోసం పార్కింగ్ స్థలాలు కేటాయించామనీ, సచివాలయానికి వచ్చే ఆహ్వానితులు తమ పాస్‌లను కార్ డోర్లకు అతికించుకోవాలని సూచించారు.

ద్వారాలు-ప్రవేశం

- సచివాలయం నాలుగు దిక్కుల్లో ప్రధాన ద్వారాలు ఉన్నాయి. వాటిల్లో నార్త్‌వెస్ట్ (వాయువ్య) ద్వారాన్ని అవసరం వచ్చినపుడు మాత్రమే తెరుస్తారు.
- నార్త్‌ఈస్ట్ (ఈశాన్య) ద్వారం గుండా సచివాలయ సిబ్బంది, కార్యదర్శులు, అధికారుల రాకపోకలు కొనసాగుతాయి. సౌత్‌ఈస్ట్ (ఆగ్నేయం) ద్వారం విజిటర్స్ కోసం వినియోగిస్తారు.
- సచివాలయ సందర్శన సమయం మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు ఉంటుంది.
- తూర్పుగేట్ (మెయిన్‌గేట్) ముఖ్యమంత్రి, సీఎస్, డీజీపీ, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, చైర్మన్లు ఇంకా ముఖ్యమైన ఆహ్వానితులు, దేశ, విదేశీ అతిథుల కోసం మాత్రమే వినియోగిస్తారు.
- దివ్యాంగులు, వద్ధుల కోసం ఎలక్ట్రిక్ వాహనాలు ఏర్పాటు చేశారు.

సీఎం కేసీఆర్‌కు అభినందనలు బౌద్ధ ఉపాసక్ మహాసభ

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా నిర్మించిన సచివాలయానికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరును నామకరణం చేయడంతో పాటు 125 అడుగులు అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించినందుకు గానూ ది ప్రాక్టీసింగ్ బుద్దిస్ట్ సొసైటీ (బౌద్ధ ఉపాసక్ మహాసభ) సంస్థ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అభినందనలు తెలియజేసింది. ఈ మేరకు లక్నో నుంచి సొసైటీ ప్రధాన కార్యదర్శి కేఆర్ రావత్ సీఎం కేసీఆర్‌కు ఒక లేఖను రాశారు.

ప్రారంభ వేడుకల షెడ్యూల్

- ఏప్రిల్ 30వ తేదీ సూర్యోదయం ఆరు గంటల తరువాత సచివాలయంలో సుదర్శన యాగం ప్రారంభం.
- మధ్యాహ్నం ఒంటి గంటా 20 నిమిషాల నుంచి ఒంటి గంటా 30 నిమిషాల మధ్య యాగం పూర్ణాహుతి.
- తరువాత సమీకృత కొత్త సచివాలయం రిబ్బన్ కటింగ్.
- ఆ వెంటనే ఆరవ అంతస్తులోని తన ఛాంబర్‌లో కొలువుదీరనున్న సీఎం కేసీఆర్
- మధ్యాహ్నం ఒంటి గంటా 58 నిమిషాల నుంచి రెండు గంటల నాలుగు నిమిషాల మధ్యకాలంలో తమతమ ఛాంబర్లల్లో కొలువుదీరనున్న ఆయా శాఖల మంత్రులు. మధ్యాహ్నం రెండు గంటల 15 నిమిషాలకు కొత్త సచివాలయం ప్రాంగణంలో గ్యాదరింగ్
- గ్యాదరింగ్‌ను ఉద్దేశించి ప్రసంగించనున్న సీఎం కేసీఆర్!
- ఆ తరువాత తమతమ స్థానాల్లో కొలువుదీరనున్న అధికారగణం, ఇతర ప్రభుత్వ యంత్రాంగం.
- ఏప్రిల్ 30వ తేదీ నుంచి పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానున్న సమీకత కొత్త పరిపాలనా సౌధం
- ఆనాటి నుంచి అక్కడే పూర్తిస్థాయి విధులు నిర్వర్తించనున్న సీఎం, సీఎంఓ అధికార యంత్రాంగం, మంత్రులు, సచివులు, ఇతర అధికారగణం, సెక్షన్, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్లు.

మళ్లింపు ఇలా..

- ఆఫ్జల్‌గంజ్ నుంచి సికింద్రాబాద్‌కు ట్యాంక్‌బండ్‌పై నుంచి వెళ్లే ఆర్టీసీ బస్సులు తెలుగుతల్లి ఫ్లైఓవర్ నుంచి కట్టమైసమ్మ ఆలయం లోయర్ ట్యాంక్‌బండ్, డీబీఆర్ మిల్స్, కవాడిగూడ వైపునకు వెళ్లాలి.
- ఖైరతాబాద్, పంజాగుట్ట, సోమాజిగూడ వైపు నుంచి నెక్లెస్ రోటరీవైపు అనుమతి లేదు. ఈ వాహనాలను వీవీ విగ్రహం చౌరస్తా నుంచి సాదన్ కాలేజీ, నిరంహంకారి వైపు మళ్లిస్తారు. నిరంహంకారి చింతలబస్తీ వైపు నుంచి నెక్లెస్ రోటరీ వైపు వెళ్లే వాహనాలకు ఖైరతాబాద్ ఫ్లై ఓవర్ మీదుగా వెళ్లేందుకు వీలు ఉండదు.
- లిబర్టీ వైపు నుంచి తెలుగు తల్లి, అంబేద్కర్ విగ్రహం, తెలుగుతల్లి జంక్షన్ వైపు అనుమతి లేదు. ఈ వాహనాలు నేరుగా ఫ్లై ఓవర్ మీదకు వెళ్లి అక్కడి నుంచి లోయర్ ట్యాంక్‌బండ్ వెళ్లాలి.
- ట్యాంక్‌బండ్, తెలుగుతల్లి జంక్షన్ నుంచి ఎన్టీఆర్‌మార్గ్ వైపు వాహనాలకు అనుమతి లేదు. ఈ వాహనాలను తెలుగుతల్లి జంక్షన్ నుంచి ఇక్బాల్ మినార్ జంక్షన్‌వైపు మళ్లిస్తారు.
- బీఆర్‌కే భవన్ వైపు నుంచి ఎన్టీఆర్‌మార్గ్‌కు వెళ్లే వాహనాలను తెలుగుతల్లి జంక్షన్ నుంచి ఇక్బాల్ మినార్ జంక్షన్ వైపు మళ్లిస్తారు.
- బడా గణేశ్ నుంచి నెక్లెస్ రోడ్డు రోటరీ వైపు వచ్చే వాహనాలను బడా గణేశ్ నుంచి రాజ్‌దూత్ హోటల్ లైన్‌కు మళ్లిస్తారు.

జేఈఈ మెయిన్‌లో బీసీ గురుకుల విద్యార్థుల హవా

జేఈఈ మెయిన్-2023 ఫలితాల్లో బీసీ గురుకుల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి సత్తా చాటారు. 92 మంది బాలురు, 65 మంది బాలికలు కలిపి మొత్తం 157 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఈ మేరకు బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్, ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, బీసీ గురుకులాల కార్యదర్శి మల్లయ్య బట్టు శనివారం ప్రకటన విడుదల చేశారు.

అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

ఆదివారం 30-4-2023 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 119 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 12 పేజీలు +(సోపతి వోచీలో) | వెల : 8.00

సంపాదకీయం

సిగ్గు సిగ్గు!

"నిగ్గదీసి అడుగు ఈ సిగ్గులేని పాలకులను, అగ్గి తోటి కడుగు కల్మషాల మనస్సులను" అని పాడుకోవటమే కాదు, నిగ్గదీయాల్సిన సమయం ఆసన్నమయింది. ఇంకా ఎంతకాలం చూస్తాం! ఇది ఫాసిస్టు శక్తులు నెరపుతున్న ప్రభుత్వమే కాదు, రేపిస్టు ప్రభుత్వం కూడా అని పేర్కొన్న భార్గవ వ్యాఖ్యానం అక్షరాలా వాస్తవం. అప్పుడు ఆసిఫా ఘటనలో చూశాం, హత్రాస్, ఉన్నావో, బిల్కిస్ బానో ఘటనల్లోనూ చూశాం. హత్యలూ, లైంగిక దాడులు చేసిన వారిని విడుదల చేయటం, సత్కారాలు చేయటం, రేపిస్టులకండగా నిలవడం, శిక్షలు తగ్గించడం, మంత్రులుగా నియమించడం, ఎంపీలను, ఎమ్మెల్యేలను చేయటం, ఎన్నికల్లో టిక్కెట్లివ్వడం కళ్లారా చూస్తూనే ఉన్నాం. ఇంకేం సిగ్గు వాళ్లకి! బ్రిజ్ భూషణ్‌శరణ్‌లు, కుల్దీప్ సెంగార్‌లు, స్వామి చిన్మయానందలు... ఎందరెందరో ఈ దేశపు నాయకులు. అసెంబ్లీలలో, చట్టసభలలో నీలిచిత్రాలు తిలకిస్తూ సంస్కృతీ జపం చేసే తన్మయులు, యడ్యూరప్పలు, బసప్పలు ఈ దేశానికి పట్టిన దుర్గతి తిప్పలు!

> భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉష మాత్రం ఇలా రోడ్లమీదకు రావడం మర్యాదకాదన్నది. కమిటీ నివేదిక వచ్చే వరకూ వేచిచూడమన్నది. వారు చేస్తున్నది ఆటకూ దేశానికి మంచిది కాదని వాక్రుచ్చారు. నిజమే దేశానికీ, ఆటకే కాదు, వాళ్లకూ ఈ వేధింపులు అస్సలు మంచివికావు. ఉషకు మహిళగా మర్యాద గురించి ఎవరికి చెప్పాలో తెలియదా? రాజ్యసభ సభ్యత్వం, పదవులూ మాటలిలా పలికిస్తాయి మరి! సుప్రీం కోర్టు పోలీసులను చివాట్లు పెట్టేదాకా ఎఫ్ఐఆర్ బుక్ చేయలేదంటే, ఎంత మందంగా మారిందీ పాలనకు!

ప్రపంచ వేదికలపై జాతీయ జెండాను రెపరెపలాడించి, దేశాన్ని గర్వపడేలా చేసిన భారత మల్లయుద్ధయోధులు మళ్లీ న్యాయం కోసం రోడ్లమీదకొచ్చారు. 'బేటీ బచావో' నినాదమిచ్చిన నాయకుడు నిజంగానే ఆడపిల్లల వేదనను అర్థం చేసుకుంటాడను కున్నారు. కుస్తీ పోటీలో యోధులై పోరాడిన వాళ్లు నిస్సహాయంగా కన్నీళ్లు కారుస్తుంటే, గుండె కరుగుతుందేమో అనుకున్నారు. కానీ అది ఫొటోషూట్ జీవమని, కరగని శిలా హృదయమని భావించలేదు వారు. ఐదునెలల క్రితం నిరసన తెలిపితే, మీకు జరిగిన అన్యాయంపై విచారణ చేపడతామని చెప్పి పంపిన ప్రభుత్వం, ఇంతవరకూ స్పందించకపోవడంతో తిరిగి రోడ్డెక్కారు భారత రెజ్లింగ్ మహిళలు. భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ లైంగికంగా వేధిస్తున్నాడని ఏడుగురు రెజ్లర్స్ సాక్ష్యాలతో సహా నిరూపిస్తామని ఫిర్యాదు చేసినా, ఇన్ని నెలలు గడిచినా ఒక్క కేసూ నమోదు చేయలేదు ప్రభుత్వం. ఆ ఏడుగురిలో ఒక మైనరు అమ్మాయీ ఉంది. ఢిల్లీ జంతర్ మంతర్ దగ్గర రాత్రింబవళ్లు రోడ్లమీదనే ఉంటూ, మాకు న్యాయం చేయండీ అని ఘోషిస్తున్నా, సున్నిత మనస్కుడు అయిన మన నాయకుడు ప్రతిస్పందించ డమే లేదు. ఎందుకనంటే సదరు బ్రిజ్ భూషణుడు ఉత్తర ప్రదేశ్‌లో బీజేపీ ఎంపీగా ఉన్నాడు. పదవులను అడ్డం పెట్టుకుని ఆ రాష్ట్రంలో యాభై విద్యా సంస్థలకు పైగా కలిగివుండి, కోట్లాది ధనార్జనతోనే కాక ముప్పయిదాకా క్రిమినల్ కేసులూ, మర్డర్ కేసులూ ఉన్నవాడిపై చర్యలు తీసుకోవడం అతిక్ అహ్మద్‌ను ఎన్‌కౌంటర్ చేసినంత తేలికనా యేమి! కానేకాదు!



భారతదేశ గౌరవాన్ని పెంచిన ఈ రెజ్లర్ల కంటే బ్రిజ్ భూషణుడే వారికి ఎక్కువ. మనం అర్థం చేసుకోలేక పోతున్నాం కానీ వాళ్లేపని చేయాలో అదే చేస్తున్నారు. అది వారి సహజ లక్షణం. రేపిస్టుల వైపే నిలుస్తారు. మాటలకు మాత్రం తేనెను పూస్తారు అంతే! ఇక స్మృతి ఇరానీ, ప్రజ్ఞాఠాకూర్, సాధ్వీరితంభర మొదలైన మనువాదీ మహిళా మణులు ఒక్కపలుకు పలికినా మర్యాదలు మంటకలుస్తాయి! సాటి స్త్రీల వెతలు వీరి చెవి సోకవు.

అందుకే బాధిత రెజ్లర్లు వినేష్ పోగట్, సాక్షి మాలిక్, బజరంగ్ పూనియాలు వాళ్లను మాట్లాడమని ఏమీ కోరలేదు. కానీ తోటి క్రీడాకారులను ప్రశ్నించారు. క్రికెట్ క్రీడాకారులను దేశం అభిమానిస్తది కదా! వాళ్లెందుకు తోటి క్రీడాకారుల గురించి మాట్లాడరు? అమెరికాలో బ్లాక్ లైవ్స్ మ్యాటర్‌పై మాట్లాడిన వారు, దేశంలోపల అన్యాయం గురించీ మాట్లాడాలికదా! ఒకే ఒక్క కపిల్‌దేవ్ మాట్లాడాడు. అభినవ బింద్రా మాట్లాడిండు. నీరజ్ చోప్రా, సానియా మీర్జా, వీరేంద్ర సెహ్వాగ్, నటుడు సోనూసూద్ గొంతులు విప్పారు. అన్యాయానికి వ్యతిరేకంగా జరిగే కుస్తీ పోటీలో కచ్చితంగా విజయం సాధిస్తారని నైతిక మద్దతు ప్రకటించారు. అంతే కాదు బృందాకరత్, ప్రియాంకగాంధీ, ఐద్వా జాతీయ నాయకులు మరియం ధావలే, కె.కె. శైలజ, పి.కె శ్రీమతి పోరాటానికి మద్దతు తెలిపారు. మన మంత్రి కేటీఆరూ న్యాయం జరగాలన్నారు. కానీ భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉష మాత్రం ఇలా రోడ్లమీదకు రావడం మర్యాదకాదన్నది. కమిటీ నివేదిక వచ్చే వరకూ వేచిచూడమన్నది. వారు చేస్తున్నది ఆటకూ దేశానికి మంచిది కాదని వాక్రుచ్చారు. నిజమే దేశానికీ, ఆటకే కాదు, వాళ్లకూ ఈ వేధింపులు అస్సలు మంచివికావు. ఉషకు మహిళగా మర్యాద గురించి ఎవరికి చెప్పాలో తెలియదా? రాజ్యసభ సభ్యత్వం, పదవులూ మాటలిలా పలికిస్తాయి మరి! సుప్రీం కోర్టు పోలీసులను చివాట్లు పెట్టేదాకా ఎఫ్ఐఆర్ బుక్ చేయలేదంటే, ఎంత మందంగా మారిందీ పాలనకు! దేశ గౌరవం కోసం, పతకాల కోసం నాడు కుస్తీలు పడితే, నేడు తాము గౌరవంగా బతకటం కోసం నిజమైన కుస్తీ పడుతున్నారు. రెజ్లర్ల పోరాటానికి జేజేలు! ప్రభుత్వమా! సిగ్గు సిగ్గు!

'మేడే' అగ్నిజ్వాలలు ఇంకా రగులుతూనే ఉన్నాయి...

మేడే అనగానే మనకు గుర్తొచ్చేది.. ఎనిమిది గంటల పనిదినం.. కష్టజీవుల రక్తంతో తడిసిన ఎర్రపతాకం.. చికాగో అమరవీరుల త్యాగఫలితం.. పోరాడి సాధించుకున్న హక్కుల దినం.. సంపదకు మూలం శ్రామిక స్వేదం.. బానిసత్వాన్ని ఎదిరించిన వీరత్వం.. రణ, గణ గొంతుకలై ధ్వనించిన ధీరత్వం.. ఉవ్వెత్తున ఎగిసే అగ్నికణికలు.. పాలకవర్గాలను పడగొట్టే ఉక్కు పిడికిళ్ళు..

మేడే అనేది ప్రపంచ కార్మిక దినోత్సవం. దీని సుదీర్ఘ పోరాట చరిత్ర ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతీ కుటుంబం చర్చించుకోవడం అనివార్యం. ఎందుకంటే ఉదయం లేవగానే ఫ్యాక్టరీకి వెళ్లే కార్మికుడు, చేతిలో బ్యాగు పట్టుకుని ఆఫీస్‌కు వెళ్లే ఉద్యోగి వరకు అందరూ ఏదో ఒక రంగంలో పనిచేస్తున్నవారే. అలాంటి శ్రమజీవులందరికీ ఈ రోజు 8 గంటల పనిదినం వారి హక్కుగా పరిణమించింటే దానికి కారణం ఆనాటి చికాగో కార్మికుల త్యాగఫలం. తమ ప్రాణాలను ఫణంగా పెట్టి హక్కులు సాధించుకున్న రోజును మనం మేడేను ఒక దీక్షాదినంగా, అమరవీరుల సంస్మరణలో, స్ఫూర్తిదాయకంగా జరుపుతున్నాం. ఇది ఏ మాత్రం సహించని కేంద్రంలో అధికారం చెలాయిస్తున్న పాలకవర్గం మేడే చరిత్రను చెరిపేయాలని చూస్తోంది. కార్మిక చట్టాల అమలు పేరుతో పెట్టుబడిదారులకు అను కూలమైన లేబర్‌కోడ్‌లు తెచ్చింది. అధిక పని గంటలు పెంచి శ్రమదోపిడీ చేస్తోంది.పాలకవర్గాల నియం తృత్వంతో అధిక పని గంటలను నిరసిస్తూ నాడు అమెరికాలో సాగిన మహోజ్వలిత పోరాట అగ్నిజ్వాలలు నేడు ఇండియాలో ఇంకా రగులుతూనే ఉన్నాయి.ఇది మోడీ నిరంకుశత్వానికి పరాకాష్ట.



పాలడుగు భాస్కర్

ప్రపంచ దిక్సూచిగా చికాగో పోరాటం

పదిగంటల పని దినం నిర్ణయించాలన్న డిమాండ్‌పై 19వ శతాబ్దం ప్రారంభంలో అమెరికాలో ప్రతి పారిశ్రామిక కేంద్రంలోనూ సమ్మెలు చెలరేగాయి. ఫిలడెల్ఫియాలోని మెకానిక్స్ యూనియన్ చేసిన 10గంటల పనిదినం పోరా టాన్ని తట్టుకోలేక అమెరికన్ ప్రభుత్వం 1837లో 10 గంటల పనిదినం నిర్ణయిస్తూ శాసనం చేసింది. తర్వాత ఈ 10గంటల పనిదినం ఉద్యమం అట్లాంటిక్ మహాసముద్రం దాటి యూరప్ ఖండంలో ప్రవేశించి అక్కడి కార్మికవర్గాన్ని ఉత్తేజపరిచింది. యూరప్ ఖండంలో కార్మికులు జరిపిన పోరాటాల ఫలితంగా అనేక దేశాలు 10గంటలు పని దినం అంగీకరిస్తూ చట్టాలు చేశాయి.1870 నాటికే పారిశ్రామిక, వాణిజ్య, బ్యాంకింగ్ రంగాల్లో గుత్తాధిపత్యం రూపుదాల్చి బలపడింది. పెట్టుబడిదారీ వర్గం అధిక లాభాలు పోగు చేసుకోవడానికి ఆ వర్గానికి మంచి అవకాశాలు ఏర్పడ్డాయి. కానీ కార్మికవర్గం జీవితాల్లో అభివృద్ధి మాత్రం దిగజారాయి. దానితో కార్మికవర్గం పనిగంటల తగ్గింపు కోసం ఉద్య మించింది. 1881 చికాగో నగరంలో వివిధ కార్మిక సంఘాలు కలిసి ఒక సమాఖ్యను నూతనంగా ఏర్పాటు చేసు కున్నాయి. దానికి "అమెరికన్ ఫెడరేషన్ ఆఫ్ లేబర్" అని పేరు పెట్టారు.1884 అక్టోబర్ 7న ఈ సమాఖ్య 4వ సమావేశంలో 8గంటల పని దినం కోసం చారిత్రాత్మకమైన తీర్మానం చేయబడింది.1886మే మొదటి తేదీన దేశ మంతటా కార్మికవర్గం ఈ హక్కును సాధించుట కోసం సమ్మె పోరాటాలను నిర్వహించాలని కూడా నిర్ణయించాయి. చికాగోలోని హే మార్కెట్‌లో జరిగిన కార్మికుల ప్రదర్శన ఈ మేడే పుట్టుకకు నాంది పలికింది. 8గంటల పనిదినం గురించి నినదిస్తూ 1886, మే 1న వేలాది మంది కార్మికులు పోరాటం ప్రారంభించారు. దీనికి మద్దతుగా నాలుగు రోజుల తరువాత నగరంలో భారీ ప్రదర్శన జరిపారు. ఆనాటి పాలకవర్గం ఆదేశాలతో పోలీసులు ప్రదర్శన కారులపై విచక్షణా రహితంగా జరిపిన కాల్పులలో ఆ ప్రాంతమంతా రక్తసిక్తమైంది. ఒక పోలీసును హత్య చేశారనే నిరాధార అభియోగంతో కార్మిక నాయకులను ఉరితీశారు. అయినా పని గంటల కుదింపు అగ్నిజ్వాలలు అంతరించలేదు. ఆ పోరాటంలో చికాగో అమరులు నినదించిన 'ప్రపంచ కార్మికులారా! ఏకంకండి' అనే నినాదం విశ్వవ్యాప్తమై మారు మోగింది. శ్రామికవర్గంలో చైతన్యాన్ని రగిలించింది.ఈ శ్రామికవర్గ విజయానికి చిహ్నంగా 8గంటల పని దినం చట్టబద్ధం చేయబడింది. అదే అంతర్జాతీయ కార్మిక దినోత్సవానికి అంకురార్పణ అయ్యింది.

1890 మే 1న అమెరికా కార్మిక సంస్థ (ఎ.ఎఫ్.ఎల్) ప్రతి యేటా మే 1న అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని జరపాలని పిలుపునిచ్చింది. 1900 నుండి 1920 వరకూ యూరప్‌లో ప్రభుత్వ, ధనిక వ్యాపారుల దోపిడీని ఎండ గడుతూ సోషలిస్టు పార్టీల ఆధ్వర్యంలో మే 1న నిరసన ప్రదర్శనలు జరిగేవి. మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో మేడే సందర్భంగా యుద్ధ వ్యతిరేక ప్రదర్శనలు చేపట్టేవారు. తరువాతి దశకంలో మే 1న నాజీల వ్యతిరేక దినోత్స వంగా జరిపేవారు. హిట్లర్ పాలనలో ఆ రోజుని జాతీయ కార్మికుల దినోత్సవంగా కూడా జరుపుకున్నారు. భారత దేశంలో మొట్టమొదటిసారిగా మద్రాసు కేంద్రంగా 1923 మే 1న కమ్యూనిస్టు నాయకుడు సింగారవేలు నాయ కత్వంలో లేబర్ కిసాన్ పార్టీ ఆఫ్ హిందూస్థాన్ మేడేని నిర్వహించింది. 1920లో కార్మిక సంఘం ఏర్పడడంతో మేడే అప్రతిహతంగా కొనసాగుతున్నది. చికాగోలోని కార్మిక యోధులు చేసిన రక్తతర్పణం. ఆ అమరుల త్యాగం కేవలం తమ దేశంలో కార్మికవర్గానికే కాకుండా ప్రపంచానికంతటికీ కొత్త వెలుగులను ప్రసాదించింది. తమ శ్రమను పెట్టుబడి దారులు రోజుల తరబడి దోచుకున్న సమయంలో మేమూ మనుషులమే, మా శక్తికి కూడా పరిమితులుం టాయని శ్రామిక వర్గం గొంతెత్తింది. ఈ చాకిరీ మేం చేయలేమని పనిముట్లు కింద పడేసి 8గంటల పనిదినం కోసం నినదిం చింది. చివరకు ప్రాణాలను సైతం

> పేదరికం, పెరుగుతున్న ద్రవ్యోల్బణం, ప్రభుత్వాలు అదుపు చేయలేని అధిక ధరలు, నిరుద్యోగం, ఉద్యోగాల తొలగింపులు, పెన్షన్, ఆరోగ్య సంరక్షణ, శ్రామిక మహిళల హక్కులు, ధనిక, పేద అంతరాలు 2023 మేడే సంద ర్భంలో సాక్షాత్కరిస్తున్న ప్రధానమైన సమస్యలు. వీటిని పరిష్కరించుకోకుండా శ్రామికులను, పేద ప్రజల జీవితాలకు విముక్తిరాదు. దోపిడీ రహిత సమ సమాజం నిర్మితమైతేనే మౌలిక సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది. ఈ లక్ష్య సాధనకు శ్రామికవర్గ ఐక్యత కీలకం. అనేక దేశాల్లో, మన దేశంలోని కేంద్ర ప్రభుత్వంతో సహా కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను ఓడించడం, ప్రత్యామ్నాయ, విధానాల కోసం కార్మికవర్గ పోరాటాలను ఉధృతం చేయడమే కర్తవ్యాలు, కర్తవ్య సాధన కోసం కార్మికవర్గం కార్యోన్ముఖులై మేడే స్ఫూర్తితో పోరాటాలను ఉధృతం చేద్దాం.



తృణప్రాయంగా త్యజించి పోరాటం చేయడం వల్ల 24గంటల్లో 8గంటల పని, 8 గంటల విశ్రాంతి, ఇంకా 8 గంటల వినోదం కోసం ఈ పోరాటం ద్వారా సాధించుకున్నారు. ఇది పారిశ్రామిక యుగం ఏర్పడిన తర్వాత జరిగిన పెద్ద మార్పు.

కార్మిక సంక్షేమాన్ని విస్మరించిన మోడీ

నేటి కార్మిక దుస్థితిని, కేంద్ర బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్, మతోన్మాదులతో చేసే చెలిమి, నియంతృత్వ పోకడలను గమనిసే మళ్ళీ మేడే ఆవిర్భావానికి పూర్వం ఉన్న పరిస్థితులు పునరావృతమవుతున్నాయా అని అనిపిస్తుంది. మోడీ పాలనలో గత 8ఏండ్లుగా స్వదేశీ, విదేశీ పారిశ్రామికవేత్తల ఆర్థిక ప్రయోజనాల కోసం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, 4 లేబర్ కోడ్‌లను తెచ్చారు. 8 గంటల పనిదినాన్ని 12గంటలకు పొడిగించేందుకు, పని భారం పెంచేందుకు శ్రీకారం చుట్టారు. యూనియన్లు పెట్టుకునే హక్కును నిరాకరిస్తున్నారు. కనీస వేతనాలు, సమాన పనికి సమాన వేతనాలివ్వాలన్న చట్టబద్ధ ఆదేశాలను, న్యాయస్థానాల తీర్పులను బుట్టదాఖలు చేస్తున్నారు. కార్మిక సంక్షేమం, సాం ఘిక భద్రత, ఉపాధి, ఉద్యోగ రక్షణ లేకుండా పోతున్నాయి. భారతదేశంలో కార్మికులు రోజుకి 521నిమిషాలు, వారానికి 60గంటల 47నిమిషాల పాటు ఉత్పత్తి ప్రక్రియలో పనిచేస్తున్నారు. చైనాలో వారానికి 46గంటలు, యునైటెడ్ కింగ్‌డమ్‌లో వారానికి 36గంటలు, యునైటెడ్ స్టేట్స్‌లో 37గంటలు, జర్మనీలో 37గంటలు మాత్రమే పని చేస్తున్నారు. పారిశ్రామిక రంగంలో పెట్టుబడిదారుని వాటా 15.7శాతం నుండి 53.8శాతానికి పెరిగితే, వేతనాల్లో కార్మికుడి వాటా 51.5శాతం నుండి 14.8శాతానికి పడిపోయింది.2019లో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన లేబర్ కోడ్‌లో గత ఫ్యాక్టరీ చట్టంలో నిర్దేశించినట్లు పని గంటలు గురించి స్పష్టంగా ఎటువంటి నిబంధనలు పేర్కొనలేదు. 8 గంటల పనిదినాన్ని పొడిగించుకునే అధికారాన్ని ఆయా ప్రభుత్వాలకు అధికారాన్ని కట్టబెట్టారు. ఫ్యాక్టరీ చట్టంలో ఉన్న పదిన్నర గంటల స్ప్రెడ్ - ఓవర్ సమయాన్ని ఇప్పుడు దాన్ని 12 గంటలకు పెంచారు. ఇప్పటికే బీజేపీ అధి కారంలో ఉన్న రాష్ట్రాలతో పాటు కర్నాటక, తమిళనాడు ప్రభుత్వాలు 8 గంటల పని దినాన్ని 12 గంటలకు పెం చుతూ తమ అసెంబ్లీలో తీర్మానాలు చేశాయి. శ్రామిక శక్తిపై ఉత్పాదకత పేరుతో హద్దులేని దాడి చేస్తున్నారు. రోబో టిక్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పేరుతో అత్యంత ఆధునిక మానవ యంత్రంపై పని తీవ్రతను తీవ్ర స్థాయికి పెంచారు.ఈ యంత్రాలు ఎప్పుడు ఆగవు. అనేక యంత్రాలపై పనిచేసే కార్మికులు ఊపిరి కూడా ఆడటం లేదు. ఆధు నాతన యంత్రాలతో తక్కువ సమయంలో ఎక్కువ విలువను సృష్టిస్తున్నారు.ఐటి, అనుబంధ రంగాల్లో వర్క్ ఫ్రమ్ హోమ్ పద్ధతిని ప్రవేశపెట్టి పరోక్షంగా 24గంటల పని దినాన్ని ఆచరణాత్మకంగా విస్తరించారు. ఇవన్నీ మేడే స్ఫూర్తికి విఘాతం కలిగించే అంశాలే.

దేశ సంపదను లూటీ చే(యి)స్తున్న బీజేపీ

మోడీ ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను వాటాల విక్రయంతో పాటు ఆ సంస్థల మిగులు భూములను అమ్మడానికి పూనుకున్నది. ఉద్యోగుల భవిష్యనిధి (పీ.ఎఫ్)పై వడ్డీ తగ్గించాలనే ప్రతిపాదనలు చేసింది. పీ.ఎఫ్ నిధులతో సహాఇన్సూరెన్స్, బ్యాంకింగ్‌లలో వాటాలను షేర్ మార్కెట్‌లో పెట్టి ఆదానీ లాంటి కార్పొరేట్స్‌కు లబ్ధి చేకూ'ేలా నిర్ణయించింది. విలువైన జాతీయ రహదారులు, రైల్వే స్టేషన్లు, రైళ్ళు, పవర్‌గ్రిడ్స్, స్టేషన్లు, గ్యాస్ పైప్‌లైన్లు తన అనుయాయులకు కట్టబెడుతూ దేశ సంపదను లూటీ చేస్తున్నది. కేంద్ర బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు ప్రతి ఏటా లక్షల కోట్ల రాయితీలు కట్టబెడుతూ, ప్రజలపై భారాలు వేస్తున్నది. దేశం అంటే అంబానీ - ఆదానీల సొత్తుగా మార్చుతున్నది. గ్యాస్, పెట్రోల్, డీజిల్‌తో సహా అన్ని రకాల వస్తువుల ధరలు పెంచుతున్నది. సంవత్సరానికి 2కోట్ల ఉద్యోగాలు, రూ.15లక్షలు పేదల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని, ధరలు తగ్గిస్తామని తదితర హామీలు అమలు చేయకుండా ప్రజల్ని మోసం చేసింది. తినే తిండిపైనా, కట్టే బట్టపైనా, ప్రతి వస్తువుపైన జీఎస్టీ విధించింది. ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడిచింది. బడ్జెట్‌లో కోతలు పెట్టింది. కేంద్ర స్కీంలకు నిధులను తగ్గించింది. అత్యంత ప్రమాదకరమైన విద్యుత్ చట్టాన్ని అమలు చేయాలని రాష్ట్రాలపై మోడీ ప్రభుత్వం ఒత్తిడి చేస్తున్నది.ఈ పరిస్థితుల్లో కార్మికవర్గం తమ ఉద్యోగాలు, వేతనాలు, పని పరిస్థితులు, పోరాడి త్యాగాలతో సాధించుకున్న హక్కులను కాపాడు కునేందుకు ప్రపంచ వ్యాప్తంగా పోరాడుతున్నది. సామ్రాజ్యవాదానికి, పెట్టుబడిదారి దోపిడీకి వ్యతిరేకంగా వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ (డబ్ల్యుఎఫ్‌టియు) నికరంగా పోరాడుతున్నది. అమెరికా, ఫ్రాన్స్, గ్రీస్, ఇటలీ, యూకే, జర్మనీ తదితర దేశాల్లో కార్మికవర్గం భారీ సమ్మెలు, ప్రదర్శనలతో సహా పోరుబాటలో పయనిస్తున్నాయి. పదవీ విరమణ వయస్సును వ్యతిరేకిస్తూ ఫ్రెంచ్ కార్మికవర్గం సార్వత్రిక సమ్మె చేశారు. ధరల పెరుగుదల, దిగజారు తున్న జీవన ప్రమాణాలు, పని పరిస్థితులు, సామాజిక భద్రత లోపం, పని ప్రదేశాల్లో ట్రేడ్ యూనియన్ కార్య కలాపాల కుదింపు, పెరుగుతున్న నిరుద్యోగం, ప్రజా సంపదను కొల్లగొట్టడం వంటి చర్యలను నిరసిస్తూ ఇజ్రాయిల్ కార్మికవర్గం సమ్మెలోకి దిగడానికి సిద్ధమైంది.అమెరికన్ సామ్రాజ్యవాదం క్రూరమైన దిగ్బంధం, ఆంక్షలను ప్రతిఘటిస్తూ సోషలిస్ట్ క్యూబా ప్రజలు వీరోచితంగా పోరాడుతున్నారు. తమ మాతృభూమి హక్కుల కోసం పాలస్తీనా చైతన్యయుతంగా పోరాడుతున్నది.

పేదరికం, పెరుగుతున్న ద్రవ్యోల్బణం, ప్రభుత్వాలు అదుపు చేయలేని అధిక ధరలు, నిరుద్యోగం, ఉద్యోగాల తొలగింపులు, పెన్షన్, ఆరోగ్య సంరక్షణ, శ్రామిక మహిళల హక్కులు, ధనిక, పేద అంతరాలు 2023 మేడే సంద ర్భంలో సాక్షాత్కరిస్తున్న ప్రధానమైన సమస్యలు. వీటిని పరిష్కరించుకోకుండా శ్రామికులను, పేద ప్రజల జీవితాలకు విముక్తిరాదు. దోపిడీ రహిత సమ సమాజం నిర్మితమైతేనే మౌలిక సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది. ఈ లక్ష్య సాధనకు శ్రామికవర్గ ఐక్యత కీలకం. అనేక దేశాల్లో, మన దేశంలోని కేంద్ర ప్రభుత్వంతో సహా కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను ఓడించడం, ప్రత్యామ్నాయ, విధానాల కోసం కార్మికవర్గ పోరాటాలను ఉధృతం చేయడమే కర్తవ్యాలు, కర్తవ్య సాధన కోసం కార్మికవర్గం కార్యోన్ముఖులై మేడే స్ఫూర్తితో పోరాటాలను ఉధృతం చేద్దాం.

మౌనమేలనోయి!

ప్రధాని కార్యాలయం, అంతే హడావుడిగా ఉంది. ఈసారి పెద్దాయన తన మనసులోని మాట చెప్పటానికి ఒక కొత్త అంశం కావాలని ఆలోచిస్తున్నారని అంతరంగికులకు తెలిసింది. ఇంతలో మరోవార్త వచ్చింది. తన మనసులోని మాట ఏమై ఉంటుందో ఊహించి ఫేస్‌బుక్, ట్విట్టర్ మొదలైన సోషల్ మీడియా వేదికల్లో చర్చలకు పెట్టాలని పెద్దాయన ఆలోచిస్తున్నారట.

ఇంకేం! సోషల్ మీడియాకన్నా ముందే ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలు నిద్రలేచాయి. వేడి వేడి డిస్కషన్లు, చర్చావేదిక లైవ్ ప్రోగ్రాములు ఎలక్ట్రానిక్‌మీడియాలో హోరెత్తాయి. ఇక ప్రింట్ మీడియా తక్కువ తింటుందా! అక్షయ్‌కుమార్, సచిన్, ఇళయరాజా లాంటి సెలబ్రిటీలతో పేజీల కొద్దీ ఇంటర్వ్యూలతో స్పెషల్ టాబ్లాయిడ్లు ముద్రించి వాకిళ్ళలో గుమ్మరించేశాయి. అన్నింటిపైనా పెద్దాయన ముఖచిత్రం షరా మామూలే కదా!

ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియాలో వస్తున్న కథనాల సారాంశమంతా ఒకటే! గత 60ఏండ్లలో సాధించని అభివృద్ధి పెద్దాయన అధికారంలోకి వచ్చిన పదేండ్లలోనే జరిగిందని, మరో ఐదేండ్లలో ట్రిలియన్ డాలర్ల స్థాయికి దేశ ఆర్థిక వ్యవస్థ చేరేందుకు పెద్దాయన మనసులో ఏముందో చెప్పాలని రెండు మీడియాలు వేయి విధాలుగా తాపత్రయపడుతున్నాయి. సోషల్ మీడియాలో కూడా "పెద్దాయన మనసులోని మాట కోసం దేశమే కాదు! ప్రపంచం కూడా ఎదురుచూస్తోందని" ఊరూ పేరూ లేని పోస్టులు పుంఖాను పుంఖాలుగా వెల్లువెత్తుతున్నాయి!

మొత్తానికి ఆ రోజు రానే వచ్చింది! అది పెద్దాయన మనసులోని మాట బయటపెట్టే రోజు. ఇంతకుముందు కూడా పెద్దాయన మనసులోని మాటలు చాలా చెప్పారు. కాని ఈసారి మాత్రం ఎందుకో చర్చ ఎక్కువగా జరుగుతున్నది. లేబాన్ కళ్ళద్దాలు, ఇటలీ సూటు ధరించిన పెద్దాయన టీవీల్లో కనబడగానే పెద్దాయన భక్త బృందం ఆనందం, ఆవేశంగా మారింది.

"చూశారా! భగవంతుని అవతారం! ఆయన్ని చూడటం కన్నా ఈ కళ్ళకి సంతోషకరమైన విషయం ఏముంటుంది!" అన్నాడు ఒక భక్తాగ్రేసరుడు భక్తి పారవశ్యంతో.

"ముందు నువ్వు నోరు మూసుకో!" అన్నాడు ఒకాయన విసుగ్గా!

"మిత్రోఁ" అన్నాడు పెద్దాయన.

టీవీలు చూస్తున్నవారు, రేడియోలో వింటున్నవారు ఒక్కసారి నిశ్శబ్దమైపోయారు.

"మిత్రోఁ" అన్నాడు మళ్ళీ పెద్దాయన.

"ఆగు పెద్దాయనా!" అంటూ శబ్దం వచ్చింది. చూస్తున్న వారూ, వింటున్న వారూ ఆశ్చర్యపోయారు.

పెద్దాయన ముందు ఆశ్చర్యపడ్డాడు. ఆ తర్వాత ఆగ్రహానికి లోనయ్యాడు.తన ఉపన్యాసానికి అడ్డు తగలటమా! ఎంత ధైర్యం? ఎంత సాహసం? ఈ మనసులోని మాట వినటానికి మొత్తం ప్రపంచమే ఎదురు చూస్తుంటే.. ఆగ మన్న అల్పజీవి ఎవరా అని అటూ ఇటూ చూశాడు! ఎవరూ కనబడలేదు. ఆగు అని విన్నది తన భ్రమ కావచ్చునని అనుకున్నాడు. మళ్ళీ ప్రారంభించబోయాడు.

"మిత్రోఁ!" అంటుండగానే మళ్ళీ ఆగమంటూ శబ్దం వచ్చింది. అటూ, ఇటూ చూడబోయాడు.

"అటూ, ఇటూ చూడొద్దు! ఆగమంటున్నది నేనే" పెద్దాయన మాట్లాడుతున్న మైకు నుండే శబ్దం వచ్చింది.

గత పది సంవత్సరాలుగా నీ మనసులోని మాటలు వింటూ ఉన్నాను. ప్రతిసారీ ఒక కొత్త సమస్యను ప్రస్తావించి, దానికి సమానమో వివరణో ఇస్తున్నారు. ఈసారి చిన్న మార్పు చేసుకుందాం! నా మనసులోని మాటలు మీకు చెబుతాను. ఆ మాటలకు మీ స్పందన ఏమిటోచెప్పండి" అన్నది మైకు.



పెద్దాయనకు తన వాక్ ప్రవాహం మీదా, తన విజ్ఞానం మీదా తిరుగులేని నమ్మకం. అందుకే కానివ్వమంటూ ఎడమ చేయి ఊపాడు. అప్పు ప్రారంభోత్సవానికి జెండా ఊపినట్లే ఊపాడు.

"అయితే ఒక షరతు! నేనడిగే ప్రతి మాటకు మీ మనసులో ఉన్నది ఉన్నట్టు బయటకు చెప్పాలి! మీరు అబద్ధం చెప్పినా, నిజం బయటకు చెప్పకపోయినా మీరు శిలగా మారిపోతారు!" అన్నది మైకు.

పెద్దాయన ఒక్కక్షణం ఆలోచించాడు. తర్వాత సరేనన్నా తన శక్తి సామర్థ్యాల మీద అంత నమ్మకం మరి!

త"దేశంలోని సహజవనరులను, ఓడ రేవులను, విమానాశ్రయాలను, గోడౌన్లను ఆదానికి కట్టబెట్టడానికి మీ అధికారాన్ని వినియోగిస్తున్నారు! ఆదానికోసం నిబంధనలు మార్చు కున్నారు. అవసరమైతే చట్టాలు కూడా మార్చుతున్నారు. ఇటీవల ఆయనకు జీఎస్‌టీ నుండి మినహాయింపు కూడా ఇచ్చారు! ఇదంతా దేనికోసం చేస్తున్నారు? అడిగింది మైకు.

పెద్దాయన తనకు అలవాటైన రీతిలో మైనంగా ఉండిపోయాడు! అయిదు నిమిషాలు తడిచాయి. చూస్తుండగానే పెద్దాయన తొడల వరకూ శిలగా మారిపోయాడు.

మైకు మళ్ళీ ప్రారంభమైంది.

"దేశ రక్షకులు సైనికులు తమ ప్రాణాలు పణంగా పెడతారు. గత ప్రభుత్వాలు,సైనికులను పట్టించుకోలేదని మీరు పలుమార్లు విమర్శించారు! కాని పుల్వామాలో సైనికుల ప్రయాణానికి మీ ప్రభుత్వాన్ని హెలికాప్టర్లు కోరితే నిరాకరించారు! దాంతో అత్యంత ప్రమాదకరమైన రోడ్డు మార్గంలో ప్రయాణించి, పాకిస్తాన్ కుట్రకు బలై 39మంది వీరసైనికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ విషయమంతా మీకు తెలిసే జరిగిందని, మీ గవర్నర్ స్వయంగా ప్రకటిస్తే, ఆయనపై సీబీఐ ఎంక్వైరీ పెట్టారు! పుల్వామా దుర్ఘటన గురించి మీ మనసులోని మాట బయటకు చెప్పండి!" అడిగింది మైకు.

మైకు అడిగింది విననట్లు చూశాడు పెద్దాయన. మైకు నుండి చిన్న నవ్వు వినిపించింది." మీకు వినిపించింది! కాని మాకు కావల్సింది మీ మనసులోని మాట!

పెద్దాయన ఆలోచిస్తున్నాడు. సమయం గడుస్తోంది! ఇంకా ఆలోచిస్తూనే ఉన్నాడు. ఐదు నిమిషాలు గడిచాయి. పెద్దాయన 56అంగుళాల ఛాతీవరకు శిలగా మారిపోయింది!

"ఇక చివరి ప్రశ్న! దేశం తరపున ఎక్కడైనా ప్రాతినిధ్యం వహించి, పతకాలు, అవార్డులు సాధిస్తే మీరు వెంటనే వారికి అభినందనలు తెలుపుతారు! వారితో ఫొటోలు దిగుతారు! వారి విజయానికి మీ ప్రభుత్వం చేసిన కృషిని వివరిస్తారు! మంచిదే కాని గత కొంత కాలంగా దేశానికి బంగారు పతకాలు సాధించిన మహిళా రెజ్లర్లు, తమను ఒక ఎంపీ వేధిస్తున్నాడని నిరసన దీక్షలు చేస్తుంటే మీరు వారిని పిలిపించి మాట్లాడలేదు! కనీసం వారికి మద్దతుగా ఒక్క మాటైనా మాట్లాడలేదు! దేశానికి పతకాలు సాధించిన రెజ్లర్లు అయిన మహిళలు ఈ దేశంలో అవమానాలే జరుగుతాయా? దేశానికి గర్వకారణమైన మహిళా రెజ్లర్ల గురించి, మీ మనసులోని మాటను ఈ కార్యక్రమంలో తెలియచేయాలి!" కోరింది మైకు.

పెద్దాయన తల అటూ ఇటూ ఆడిస్తున్నాడు. మాట్లాడాలని ప్రయత్నిస్తున్నాడో లేదో తెలియదు! మౌనం మాత్రం వీడలేదు. సమయం ముగిసింది. పెద్దాయన పూర్తి శిలగా మారిపోయాడు!

- ఉషాకిరణ్

నజర్

రిపోర్టర్స్ డైరీ

మొహం చూసి బొట్టు పెట్టినట్టు..

మొహం చూసి బొట్టు పెట్టినట్టు...వడ్డించేటోడు మనోడైతే కడబంతిలో కూసున్నా మూల్గబొక్క పడ్డట్టు బంగారు తెలంగాణ సర్కారు తీరుంది. కాళ్లేతులు విరగ్గొట్టుకుని, కెమెరాలు కింద పడి పగిలినా వెనకడుగు వేయకుండా తెలంగాణ ఉద్యమాన్ని సమాజానికి కండ్లకు కట్టినట్టు చూపెట్టడంలో ఫొటో జర్నలిస్టులు, వీడియో జర్నలిస్టుల పాత్ర మరువలేనిది. తెలంగాణ రాష్ట్రం సిద్ధించడంలో వారి శ్రమను ఎవ్వరూ కాదనలేరు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని సర్కార్లూ వారి పట్ల గౌరవంగానే ఉండేవి. సీఎంలు సైతం పేర్లు పెట్టి పిలిచేటంతటి చనువు ఉండేది. పెద్దపెద్ద ప్రోగామ్స్‌లలో సైతం వేదికలెక్కి ఫొటోలు తీసేవారు. రాష్ట్రానికి బిల్‌క్లింటన్, యాసర్ అరాఫత్, ప్రిన్స్ చార్లెస్, కోఫీ అన్నన్, జార్జ్‌బుష్ వంటి అంతర్జాతీయ ప్రముఖులు వచ్చినప్పుడు కూడా వారిపై ఆంక్షలు లేవు. ఇదంతా గత చరిత్ర. బంగారు తెలంగాణలో ఫొటోజర్నలిస్టులపై రాష్ట్ర సర్కారు అడుగడుగునా వివక్ష చూపుతున్నది. ఏ ప్రోగ్రామ్‌కి కూడా వారిని అనుమతించడం లేదు. చివరకు పరిస్థితి ఎంతకు దిగజారిదంటే రాష్ట్ర ప్రభుత్వం గొప్పగా చెప్పుకుంటున్న అంబేద్కర్ భారీ విగ్రహావిష్కరణకు, సచివాలయ ప్రారంభానికి కూడా ఆహ్వానం అందలేదు. దీనిపై ఫొటో, వీడియో జర్నలిస్టులంతా గుర్రుగా ఉన్నారు. ఇదే కాదండోయ్...టీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగానూ పిలిచి బొట్టు పెట్టినట్టుగా 'చిన్నసార్' కొన్ని పత్రికలకే ఇంటర్వ్యూలు ఇవ్వడంపైనా సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారముందీ, యాజమాన్యాలు చేతుల్లో ఉన్నాయని పాలకవర్గాలు భ్రమల్లో మునిగి... జర్నలిస్టులపై చిన్నచూపు చూపితే పుట్టి మునగడం ఖాయం సుమా!

- కె.ఎన్.హరి

బండీ ఎందుకీ తొండీ

బూర్జువా పార్టీలు యాడ సభలు పెట్టినా మాటలతో మాయబుచ్చి, బీరూబిర్యానీ ఇచ్చి పోరగాండ్లను పట్టుకొస్తున్నదన్నది జగమెరిగిన సత్యం. ఎన్నికల్లో పైసలిచ్చి గెలుస్తున్నరనే విషయాన్నీ ఎవ్వరూ కాదనలేరు. కమ్యూనిస్టులు ఎన్నికల్లో ఎందుకు ఓడిపోతున్నారంటే...'వారు ఎన్నికల్లో ఇతర పార్టీల లెక్క పైసలు పంచరు...మీటింగ్‌లకు బీరూబిర్యానీ ఇచ్చి తీసుకపోరు. మీటింగ్‌లకు కార్యకర్తలు ఎవ్వరి సద్ది వారే కట్టుకుపోతారు. పార్టీ గెలుపు కోసం శాయశక్తులా పనిచేస్తరు' అనే విషయాన్ని రాజకీయాల మీద కొంచెం అవగాహన ఉన్న ఏ వ్యక్తిని అడిగినా ఇదే చెబుతాడు. ఇదీ చారిత్రక సత్యం. బండి సార్‌కు గీ కూసింత అవగాహన లేనట్టున్నది. తొండి మాటలు మాట్లాడు తూనే ఉన్నడు. అడ్డంగా బుక్కయిపోతున్నడు. కర్నాటక రాష్ట్రంలోని బాగేపల్లిలో సీపీఐ(ఎం) బలంగా ఉంటుంది. గతంలో పలుమార్లు ఆ పార్టీ తరవున ఎమ్మెల్యేలుగా కూడా గెలుపొందారు. గత ఎన్నికల్లో ద్వితీయ స్థానంలో నిలిచారు. బీజేపీకి డిపాజిట్ కూడా దక్కలేదు. అట్లాంటి చోట బీజేపీ అభ్యర్థి తరపున ప్ర చారం చేయడానికి వెళ్లి ఇష్టమొచ్చినట్టు మాట్లాడాడు. 'కమ్యూనిస్టులను గెలిపిస్తే ఈ ప్రాంతంలో బార్, బీర్ తప్ప ఏం అభి వృద్ధి జరగలేదు' అని కూసిండు. ఇది బీజేపీకి మరింత నష్టదాయకంగా మారింది. 'మా ప్రాంతానికొచ్చి మమ్ముల్ని తాగుబోతులు' అంటవా? అని ఆ ప్రాంత ప్రజలు గుస్సా అవుతున్నరు. సీపీఐ(ఎం) అభ్యర్థిగా పోటీచేస్తున్న డాక్టర్ అనిల్ కుమార్ నిత్యం ప్రజల్లో ఉంటూ సేవా కార్యక్రమాలు చేసి ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకున్నారు. ప్రజా పోరాటాల్లోనూ బాగేపల్లికి ఓ చరిత్ర ఉంది. అలాంటి చోటికెళ్లి కమ్యూనిస్టులపై నిందలేయడమంటే సూర్యుడిపై ఉమ్మేసినట్టే.

-అచ్చిన ప్రశాంత్

అదంతే... ఇదింతే...

నరంలేని నాలుక ఎన్నైయినా మాట్లాడుతుంది అనేది నానుడి. అబద్ధాలు మాట్లాడటం, చాడీలు చెప్పడం, ఉన్నది లేది కలగాపులకం చేసి మాట్లాడిన సందర్భంలో ఇలాంటి సామెతను ఉపయోగిస్తారు. కాంగ్రెస్‌లో అతివీర భయంకరుడిలా మన జగ్గన్న కూడా ఎప్పుడు ఏం మాట్లాడుతాడో చెప్పడం కొంచెం కష్టమే. తాజా గాంధీభవన్‌లో ఫ్రెండ్లీ పాలిటిక్స్ లేవు అంటూ సొంత పార్టీపై విమర్శలు గుప్పించారు. ఇలా ఎన్నోసార్లు దెప్పిపొడించే మాటలు మాట్లాడం ఆయన నైజం. ముఖ్యంగా రేవంత్‌రెడ్డికి పోటీ ఎవరూ లేరు. నేనే ఆయనకు పోటీ. నాకేం తక్కువ అంటూ మాట్లాడి అందరినీ ఆశ్చర్యపరుస్తారు. ఇద్దరు ఎదురుపడగానే కడుపులో తలకాయ పెట్టి నవ్వుకుంటారు. వీరి నటనా చాతుర్యం ప్రదర్శిస్తారు. ఒకరిపై ఒకరికి ఎంతో విశ్వాసం ఉన్నట్టు నవరసాలు పండిస్తారు. అక్కడుచ్చి కొంచెం జరిగారో లేదో...కత్తులు నూరుతారు. ఇదేమీ రాజకీయమో అర్థం కాదు. ఇలా మాట్లాడి నిత్యం వార్తల్లో ఉండటం ఆయనకు సరదా. ఆయన నటనకు మీడియా ప్రతినిధులు సైతం ఫిదా అవుతారు. ఆ రోజంతా స్క్రోలింగులు, వన్ టూ వన్లు ఒక్కటే గోల. ఆయన వచ్చాడంటే చాలు ఏదో ఒక న్యూస్. తాజాగా పాదయాత్ర చేస్తానంటూ ప్రకటిం చారు. ఇక్కడ విశేషమేంటే, రేవంత్‌రెడ్డి రెండో దఫా తిరిగే ప్రాంతాల్లో తాను పాదయాత్ర చేస్తానంటూ ప్రకటించి మరో ఒక చర్చకు తెరతీశారు. పాదయాత్రకు అనుమతి ఇవ్వకపోతే ఏంటి అని ప్రశ్నిస్తే... నాకేందుకు రాదు.... కచ్చితంగా అనుమతి ఇస్తారని చెబుతారు. అప్పుడు అలా మాట్లాడారు. ఇప్పుడు ఇలా మాట్లాడుతున్నారంటే, అదంతే...ఇదింతే...అని నవ్వుతారు.

-గుడిగ రఘు

అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదివారం 30-4-2023

సంపుటి : 9 సంచిక : 119 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 12 పేజీలు + సోపతి (వెబ్‌లో) వెల : 8.00

ప్రమాదంలో దేశం

మనువాదాన్ని మళ్లీ తెచ్చే కుట్ర

- అదే జరిగితే....మనమంతా మళ్లీ బానిసత్వలోకే
- ఒక్కటవుదాం....ఐక్యంగా పోరాడుదాం
- పూలే, అంబేద్కర్ జన జాతరలో వక్తల పిలుపు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మతోన్మాద ఆర్ఎస్ఎస్, బీజేపీ శక్తులు దేశంలో మళ్లీ మనువాదాన్ని అమలు చేసేందుకు కుట్రలు పన్నుతున్నాయని పలువురు వక్తలు హెచ్చరించారు. శనివారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఎదుట కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్), తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం, గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం, తెలంగాణ రజక వృత్తిదార్ల సంఘం, తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం, తెలంగాణ గిరిజన సంఘం, మత్యకారులు, మత్స్యకార్మిక సంఘం, కల్లుగీత కార్మిక సంఘం, ఆవాజ్, ప్రజానాట్య మండలి సంయుక్తాధ్వర్యంలో పూలే, అంబేద్కర్ జన జాతర కార్యక్రమాన్ని నిర్వహించారు. కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ ఏ బానిసత్వం, అంటరానితనం, మనువాదం పోవాలంటూ మహనీయులు పూలే, అంబేద్కర్ తమ జీవితాలను అంకితం చేశారో, వాటిని తిరిగి తెచ్చేందుకు కేంద్రంలోని బీజేపీ సర్కార్ రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేస్తున్నదని విమర్శించారు. ప్రజలు అప్రమత్తంగా లేకపోతే తిరిగి శాశ్వత బానిసత్వంలోకి తీసుకెళ్లే ప్రమాదముందని హెచ్చరించారు.రిటైర్డ్ ఐఏఎస్ అధికారి గోపాల్ రావు మాట్లాడుతూ భారతదేశపు మొట్టమొదటి సాంఘిక విప్లవకారులు పూలే, అంబేద్కర్‌లని కొనియాడారు. అందరికి సమాన హక్కులు, అవకాశాలు ...7లో

ఇది తెలంగాణకు గర్వకారణం...

ఆత్మగౌరవం ఇనుమడించేలా కొత్త సచివాలయం



- సకల జనుల సంక్షేమ పాలనే లక్ష్యం : కేసీఆర్

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

అనేక త్యాగాలు, శాంతియుత పార్లమెంటరీ పంథాతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం, అనతి కాలంలోనే దేశానికే ఆదర్శంగా నిలిచిందని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రతిష్ట మహోన్నతంగా వెలుగులీనేలా, ప్రజల ఆత్మగౌరవం మరింత ఇనుమడించేలా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, వినూత్నరీతిలో అత్యద్భుతంగా తెలంగాణ సచివాలయాన్ని నిర్మించుకున్నామని చెప్పారు. ఇది యావత్ తెలంగాణ సమాజం గర్వించదగ్గ గొప్ప సందర్భమని వ్యాఖ్యానించారు. "డా. బీఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయం" ప్రారంభోత్సవ శుభ సందర్భంలో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అనేక అపోహలు సష్టించిన విమర్శలు అడ్డంకులను దాటుకుంటూ ధఢ సంకల్పంతో ప్రారంభమైన నూతన సచివాలయ నిర్మాణం, అనతి కాలంలోనే దేశానికే వన్నె తెచ్చేలా పూర్తయి, ప్రజలకు అందుబాటులోకి రావడం పట్ల సీఎం హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తు తరాల పరిపాలన అవసరాలను దష్టిలో ఉంచుకుని అత్యంత గొప్ప సాంకేతిక విలువలతో కూడిన నిర్మాణ కౌశలంతో సెక్రటేరియట్ పూర్తయిందన్నారు. అన్ని రకాల ప్రమాణాలను పాటిస్తూ, అనేక విశిష్టతలను సొంతం చేసుకున్న ఈ సౌధం, దేశంలోనే తొలి పర్యావరణ అనుకూల మహాద్భుత కట్టడమని సీఎం వ్యాఖ్యానించారు. ప్రశాంతతను ప్రసాదించే దేవాలయం మాదిరి, చూస్తేనే కడుపు నిండే విధంగా.. అత్యంత ...7లో

నేడే కొత్త సెక్రటేరియేట్ ప్రారంభం

భారీగా ఏర్పాట్లు

వివరాలు 2లో



వడ్లు ఎత్తట్లేదు...!

కాంటాలు వేసినా..రవాణా కావట్లేదు

రోజుల తరబడి ఎదురుచూసినా లారీలు రావట్లేదు..!

మందకొడిగా ధాన్యం కొనుగోళ్లు • అకాల వర్షాలతో అన్నదాత ఆందోళన



ధాన్యం కొనుగోలు కేంద్రాల విషయంలో అన్నదాతల్లో ఆందోళన నెలకొంది. రాష్ట్ర వ్యాప్తంగా కేంద్రాలు ప్రారంభించి పక్షం రోజులవుతున్నా కొనుగోళ్లు మాత్రం ఊపందుకోవడం లేదు. ఓవైపు అకాల వర్షాలు వెంటాడుతుండటంతో రైతుల్లో ఆందోళన అలుముకుంటోంది. రాశుల కొద్దీ ధాన్యం కేంద్రాల్లో ఉన్నా కొనుగోళ్లు మాత్రం మందకొడిగా సాగుతున్నాయి. కొనుగోలు చేసిన వడ్లను సైతం వెంటనే తరలించే పరిస్థితి లేదు. ధాన్యం కేంద్రానికి తెచ్చినప్పటి నుంచి మిల్లులకు చేర్చే వరకు రైతులదే బాధ్యత అనే నిబంధన ఉంది. ఈ ప్రక్రియలో ఏ కొద్ది జాప్యం జరిగినా ఆరుగాలం కష్టం వర్షం పాలయ్యే అవకాశం ఉండటంతో రైతులు భయాందోళనకు గురవుతున్నారు.

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

కాంటాలు వేసిన ధాన్యాన్ని సైతం లారీలు లేక తరలించడం లేదు. ఈ క్రమంలో చాలా చోట్ల ధాన్యం రాశులు తడిసి వడ్లు నీటిలో కొట్టుకు పోవడంతో అన్నదాతలు ఆందోళన చేస్తున్నారు.

మందకొడిగా కొనుగోళ్లు.. రవాణా

రాష్ట్రవ్యాప్తంగా 7,100 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇప్పటికే మిల్లుల్లో భారీగా నిల్వలు ఉండటంతో మిల్లర్లు సకాలంలో దిగుమతికి సహకరించట్లేదు. ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, కరీంనగర్ జిల్లాలు ఇలా అన్నిచోట్లా ఇదే పరిస్థితి. ఓవైపు అదనపు కలెక్టర్లు ట్రేడర్లు, మిల్లర్లు, అధికారులతో సమావేశాలు నిర్వహిస్తున్నా ఎలాంటి పురోగతీ కనిపించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఖమ్మం జిల్లాలో 234 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటి వరకు 200 కేంద్రాలు ప్రారంభించారు. వీటిలో సుమారు 1100 మంది రైతుల నుంచి 15వేల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం కొనుగోలు చేశారు. పది వేల లోపు మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే మిల్లులకు చేర్చారు. ఇంకా మూడు నుంచి ఐదువేలకు పైగా మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్ల కోసం కేంద్రాల్లో నిల్వ ఉందని ప్రభుత్వ గణాంకాలు తెలుపుతున్నాయి. కానీ ఇంకా అధిక మొత్తంలోనే నిల్వ ఉండే అవకాశం ఉంది. రవాణా కోసం ఐదువేలు, కొనుగోళ్ల కోసం మరో ఐదువేల మెట్రిక్‌టన్నుల ధాన్యం నిల్వ ఉండటం.. కొనుగోళ్లు మందకొడిగా సాగుతుండటాన్ని సూచిస్తోంది.

మిల్లుల వద్ద నిరీక్షణ...'లారీల' నిరాకరణ

ధాన్యం లోడుతో వెళ్లిన లారీలు దిగుమతులు లేక రోజుల తరబడి మిల్లుల వద్ద నిరీక్షించాల్సి వస్తుంటంతో యజమానులు వడ్లకు వాహనాన్ని పెట్టేందుకు నిరాకరిస్తున్నారు. ఓవైపు రైతులు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులపై ఒత్తిడి తెస్తున్నారు. వారు పై అధికారులకు ఈ విషయాన్ని చేరవేసినా..

వారు మిల్లర్లతో మాట్లాడుతున్నా ఫలితం ఉండటం లేదు. ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా ఉపయోగం లేకుండా పోతోందని రైతాంగం వాపోతోంది. ఈ విషయమై పలుచోట్ల రైతులు ఆందోళనలు నిర్వహిస్తున్నారు. వీరికి ఆయా పార్టీలు మద్దతు తెలుపుతున్నాయి. 15 రోజుల్లో పాలేరు కేంద్రం నుంచి నాలుగు లోడ్‌లు ఎత్తారు. ఐదురోజులుగా లారీలు తిరిగి రావట్లేదని రైతులంటున్నారు. ఈ కేంద్రం నుంచి కూసుమంచి, నర్సింహులగూడెం మిల్లులకు లారీలు వెళ్లాయి. దిగుమతి లేకపోవడంతో ఖమ్మం తరలిస్తున్నా పరిస్థితిలో ఎలాంటి మార్పు లేకపోవడం గమనార్హం.

తూకం వేసినా అక్కడే..

బీరెల్లి సుధాకర్, మల్లాయిగూడెం, కూసుమంచి

మొత్తం 12 ఎకరాల వరి సాగు చేశా. కోతలు కోసి నెలరోజులైంది. పాలేరు ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఐదురోజుల కిందట వడ్లు కాంటా పెట్టారు. లారీలు రావట్లేదని.. వాటిని రవాణా చేయట్లేదు. ధాన్యం మిల్లుకు చేరే వరకు రైతుదే బాధ్యతనే నిబంధన ఉండటంతో ఇక్కడే ఉండాల్సి వస్తోంది. ఎప్పుడు అకాల వర్షం వస్తదో.. యాడ ఆగమైతనోనని ఆందోళనగా ఉంది. అమ్మినంక కూడా ఆవేదన తప్పేటట్టు లేదు. రవాణా సాగట్లేదని ఎమ్మెల్యేకు ఫోన్ చేశా. ఆయన నేను మాట్లాడతా అన్నారు. ఏమైందోగానీ ఐదు రోజుల నుంచి నా వడ్లు మాత్రం కొనుగోలు కేంద్రంలోనే ఉన్నాయి. ఒకటి గాదు.. రెండుగాదు ...7లో

ఒక్కో కొనుగోలు కేంద్రంలో ఐదువేలకు పైగా బస్తాలు

రాష్ట్రవ్యాప్తంగా ఒక్కో కొనుగోలు కేంద్రంలో ఐదువేలకు పైగా బస్తాలు కొనుగోళ్ల కోసం ఉన్నాయి. వరి అధికంగా పండించే ప్రాంతాల్లోనైతే పదివేలకు పైగా బస్తాలు నిల్వ ఉన్నాయి. కూసుమంచి మండలం పాలేరు ఐకేపీ కేంద్రంలోనైతే పదివేల బస్తాలు మూడురోజులుగా కొనుగోళ్లు లేకుండా ఉంటున్నాయి. ఈ కేంద్రాన్ని ఈనెల 16వ తేదీన స్థానిక ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి ప్రారంభించారు. 22వ తేదీ నుంచి కొనుగోళ్లు ప్రారంభించారు. ఇప్పటి వరకు రెండువేల బస్తాలను మాత్రమే కొన్నారు. కోతలు దాదాపు పూర్తవడంతో భారీ మొత్తంలో ధాన్యం కేంద్రానికి వస్తోంది. కానీ రవాణా లేకపోవడంతో కొనుగోళ్లు ముందుకు కదలట్లేదు. ఇప్పటికీ మూడు రోజులుగా ఈ కేంద్రం నుంచి ఒక్క గింజను కూడా రవాణా చేయలేదు.


తెలంగాణ అభివృద్ధి గజినీలకు

అర్థం కావట్లే..

లింగాయతులను ఓబీసీలో చేర్చాలని తీర్మానం చేసినం

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పరిష్కరించాలి
- 12వ శతాబ్దంలోనే కుల రహిత సమాజం కోరిన బసవేశ్వరుడు : సంగారెడ్డి పర్యటనలో హరీశ్‌రావు

వివరాలు 7లో..





హమాలీల రక్షణ కోసం వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జే వెంకటేశ్ • లేబర్ కమిషన్ కార్యాలయం వద్ద ధర్నా
- జాయింట్ మీటింగ్ పెట్టి సమస్యలను చర్చిస్తాం : జాయింట్ కమిషనర్



వివరాలు 7లో..

రజకుల సమస్యల పరిష్కారానికి చర్యలు

ఇండ్లు లేని వారికి డబుల్ బెడ్‌రూమ్స్

- రజక సంఘం రాష్ట్ర మహాసభలో మంత్రి ఎర్రబెల్లి
- జనగామలో రజకుల భారీ ప్రదర్శన



నవతెలంగాణ-జనగామ

రజక వృత్తిదారుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు తీసుకుంటుందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర మూడో మహాసభ సందర్భంగా సంఘం రాష్ట్ర కార్యదర్శి పైళ్ల ఆశయ్య అధ్యక్షతన జరిగిన "రజకుల రక్షణ" సభలో మంత్రి మాట్లాడారు. జనగామ జిల్లాలో దోబీఘాట్ నిర్మాణానికి సీఎం కేసీఆర్ రూ.2 వందల కోట్ల 70 లక్షలు కేటాయించారన్నారు. అందుకు భూమిని సేకరించాల్సి ఉందని చెప్పారు. అలాగే, పాలకుర్తి నియోజకవర్గం కేంద్రంలో కోటి రూపాయలతో ఎకరం స్థలంలో చాకలి ఐలమ్మ పేరిట ఫంక్షన్ హాల్ నిర్మిస్తామన్నారు. ఇండ్లులేని రజకులందరికీ డబుల్ బెడ్ రూమ్స్ ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రజకుల కోసం చేసిందేమీ లేదని విమర్శించారు. రజకుల సమస్యలపై సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు.

ఐలమ్మ స్ఫూర్తితో హక్కుల సాధన.. : ఎమ్మెల్సీ అలుగుబెల్లి

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరవనిత చాకలి ఐలమ్మ స్ఫూర్తితో హక్కులను సాధించుకుందామని ఎమ్మెల్సీ అలుగుబల్లి నర్సిరెడ్డి పిలుపునిచ్చారు. రజకుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యం కావాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆనాటి దొరల, పెత్తందారీ, పెట్టుబడి దారీ విధానాలు అమలు చేసేందుకు కుట్ర చేస్తోందన్నారు. అందుకోసం బీజేపీ ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తుందన్నారు. దేశాన్ని అదానీ అంబానీలాంటి పెట్టుబడిదారులకు కట్టబెట్టేందుకు యత్నిస్తుందని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపి ఇంటికి పంపాల్సిన అవసరం ఉందని చెప్పారు.ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి మాట్లాడుతూ.. రజక సంఘం మహాసభలో ప్రవేశపెట్టిన సమస్యలతో కూడిన తీర్మానాలు సరియైనవేనన్నారు. వీటిని ప్రభుత్వం ...7లో

రెజ్లర్ల ఆందోళన కరెంట్ కట్...వాటర్ కట్..

- ప్రభుత్వ తీరు ఆమోదయోగ్యంకాదు : సీతారాం ఏచూరి

న్యూఢిల్లీ : లైంగిక వేధింపులకు పాల్పడిన భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యుఎఫ్ఐ) అధ్యక్షుడు, బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను అరెస్టు చేయాలని దేశ రాజధాని ఢిల్లీలో జంతర్ మంతర్ ...7లో

న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలి

ఇందిరాపార్కు వద్ద ధర్నాలో 'ఐలూ' డిమాండ్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలోని న్యాయవాదుల సమస్యలు పరిష్కరించడంలో బార్ కౌన్సిల్‌తో పాటు రాష్ట్రప్రభుత్వం చొరవ చూపాలని ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలూ) తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. శనివారంనాడిక్కడి ఇందిరాపార్కు వద్ద 'ఐలూ' ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఐలూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విద్యాసాగర్, కే సత్యనారాయణ, ఉపాధ్యక్షులు కే పార్థసారది, నగర అధ్యక్షులు ప్రవీణ్, హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు హరినాథ్ తదితరులు పాల్గొన్నారు. ధర్నాకు భారీగా తరలివచ్చిన న్యాయవాదులను ఉద్దేశించి వారు మాట్లాడారు. 2019, ఆ తర్వాత న్యాయవాదవృత్తిలో చేరిన వారందరికీ హెల్త్‌కార్డులు అందచేయాలని డిమాండ్ చేశారు. 2019 తర్వాత చనిపోయిన న్యాయవాదుల పేరిట రాష్ట్ర ప్రభుత్వం ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లిస్తున్నదనీ, దీనివల్ల ఇన్సూరెన్స్ కంపెనీకి లాభమే తప్ప, న్యాయవాదులకు నష్టం కలుగుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. న్యాయవాదులకు చికిత్స కోసం చెల్లిస్తున్న రూ.2 లక్షల బీమా పరిమితిని రూ.5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. న్యాయవాదుల తల్లిదండ్రులకు కూడా హెల్త్ కార్డులు ఇవ్వాలనీ, ప్రసవం సహా అన్ని చికిత్సలకు హెల్త్ కార్డులు వర్తింప చేయాలని కోరారు. జిల్లా కేంద్రాల్లోని ఆస్పత్రులను నెట్‌వర్క్ జాబితాలో కలపాలనీ, సప్లిమెంటరీ డీడ్ ఆఫ్ ట్రస్ట్ పేరుతో చేసిన చట్టసవరణను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సెక్షన్ 41(ఏ)సీఆర్‌పీసీని పోలీసులు దుర్వినియోగపర్చకుండా, కక్షిదారులు ఆర్థిక హింసకు గురికాకుండా న్యాయవాదుల రక్షణలోఉండేలా చట్ట సవరణ చేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తేవాలనీ, కొత్తగా ఈ వృత్తిలోకి వచ్చేవారికి ఐదేండ్లపాటు నెలకు రూ.5వేలు చొప్పున భృతి ఇవ్వాలని చెప్పారు. ఈ సందర్భంగా కేరళ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక ప్రభుత్వాలు ఈ తరహా భృతిని అమలు చేస్తున్నాయని ఉదహరించారు. హైదరాబాద్‌లో న్యాయవిజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేసి, నిరంతర శిక్షణా తరగతులు, వసతి సౌకర్యాలు కల్పించాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ చనిపోయిన న్యాయవాది కుటుంబానికి రూ.4లక్షలు చెల్లిస్తున్నదనీ, దీనికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.6లక్షలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. అర్హులైన న్యాయవాదులకు ఇండ్లస్థలాలు ఉచితంగా లేదా కనీస ధరకు ఇవ్వాలనీ, రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన తెలంగాణ రాష్ట్ర న్యాయవాదుల సంక్షేమ ట్రస్ట్‌ను బార్ కౌన్సిల్ నిర్వహిస్తున్న సంక్షేమ నిధికి బదలాయించాలని డిమాండ్ చేశారు. పై అంశాల పరిష్కారం కోసం లా సెక్రటరీకి, అడ్వకేట్ జనరల్‌కు వినతిపత్రాలు సమర్పించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో ఐలూ రంగారెడ్డి జిల్లా నాయకులు గోవర్ధన్, కొండల్‌రెడ్డి, కొత్తగూడెం బార్ అసోసియేషన్ నాయకులు ఎమ్ రమేష్‌కుమార్, కోశాధికారి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



నాలాలో పడి బాలిక మృతి

సికింద్రాబాద్ కళాసిగూడలో ఘటన

- రోడ్డును తవ్వి వదిలేసిన అధికారులు
- ప్రభుత్వం తరపున రూ.5లక్షలు ప్రకటించిన మంత్రి తలసాని
- జీహెచ్ఎంసీ తరపున మేయర్ రూ.2లక్షల ఎక్స్‌గ్రేషియా
- ఇద్దరు అధికారులపై సస్పెన్షన్



నవతెలంగాణ-బేగంపేట్

పాల ప్యాకెట్ కొనుగోలు చేసేందుకు సోదరుడితో కలిసి షాపుకు వెళుతున్న ఓ బాలిక ప్రమాదవశాత్తు నాలాలో కొట్టుకుపోయి మృతిచెందింది. ఈ ఘటన సికింద్రాబాద్ మహంకాళి పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. కళాసిగూడ ధనజారుకు చెందిన శ్రీనివాసులు- రేణుక దంపతులకు కార్తిక్, మౌనిక (11) సంతానం. శ్రీనివాసులు స్థానికంగా ఉండే గోల్డ్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. భార్య ఇంటి వద్దే చిన్న దుకాణం నడిపిస్తుంది. శ్రీనివాసులుకు తరచుగా ఫిట్స్ వచ్చి అనారోగ్యం బారినపడుతుంటారు. కుమారుడు కార్తిక్ కూడా మానసిక వికలాంగుడు. శనివారం ఉదయం పాల ప్యాకెట్ కొనుక్కురమ్మని తల్లి మౌనికను బయటకు పంపించింది. చెల్లితో కార్తిక్ కూడా వెళ్లాడు. అయితే, ఉదయం 6 గంటల నుంచి హైదరాబాద్ జంట నగరాల పరిధిలో భారీ వర్షం కురిసింది. దాంతో కళాసిగూడ ప్రభుత్వ పాఠశాల వద్ద పెద్దఎత్తున వరద చేరింది. ఉదయం 6.30గంటల సమయంలో పిల్లలిద్దరూ పాఠశాల వద్ద రోడ్డు పక్క నుంచి నడుచుకుంటూ వెళ్లారు. సీసీ రోడ్డు కోసం తవ్వి వదిలేయడంతో ఆ గుంతలో కార్తిక్ పడిపోయాడు. మౌనిక కార్తీక్‌ను లేపింది. ఈ క్రమంలో పక్కనే నాలాపై పడిన గుంతలో మౌనిక పడిపోయి నాలాలోకి కొట్టుకుపోయింది. బాలికను రక్షించేందుకు చుట్టుపక్కల వారు ప్రయత్నించినా లాభం లేకపోయింది. జీహెచ్ఎంసీ డీఆర్ఎఫ్, ఫైర్, మహంకాళి పోలీసులు నాలాలో వెతకగా.. అర కిలోమీటర్ దూరం లో పాట్నీ వద్ద భారీ మ్యాన్ హోల్ వద్ద బాలిక మృతదేహం లభ్యమైంది. పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మహంకాళి పోలీసులు ఐపీఎస్ 174 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

మంత్రి తలసాని విచారం

నాలాలో పడి బాలిక మృతిచెందడం చాలా బాధకరమని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఘటనా స్థలానికి చేరుకోని అధికారులను వివరాలు అడిగి తెలుసు కున్నారు. అనంతరం మౌనిక తల్లిదండ్రుల పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. కేంద్రమంత్రి జి కిషన్ రెడ్డి, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలతారెడ్డి, స్థానిక కార్పొరేటర్ చీర సుచిత్ర ఘటనా స్థలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. బాలిక కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. ప్రభుత్వం తరపున రూ.5 లక్షల సహాయం అందించనున్నట్టు ప్రకటించారు. ఘటనపై విచారణ జరిపించి బాధ్యులైన వారికి తగిన చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు.

జీహెచ్ఎంసీ రూ.2లక్ష ఎక్స్‌గ్రేషియా

బాధిత కుటుంబానికి జీహెచ్ఎంసీ తరపున రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియాను మేయర్ ప్రకటించారు. రోడ్డు నిర్మాణం జరిగే సమయాల్లో ప్రమాదాలు జరగకుండా బారికేడ్లను ఏర్పాటు చేశారనీ, వాహనాల రాకపోకల కోసం దుకాణదారులు వాటిని తొలగించారనీ మేయర్ తెలిపారు. బాలిక తల్లిదండ్రులతో మాట్లాడి ధైర్యం చెప్పారు.

అధికారుల నిర్లక్ష్యమే బలితీసుకుందా..?

జీహెచ్ఎంసీ, జలమండలి అధికారుల నిర్లక్ష్యమే చిన్నారిని బలితీసుకుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. 15 రోజుల కిందట ఇక్కడ సీసీ రోడ్డు నిర్మాణ పనులను జీహెచ్ ఎంసీ అధికారులు మొదలు పెట్టారు. రోడ్డు నిర్మాణం కోసం పాత రోడ్డును తవ్వారు. తర్వాత జలమండలి అధికారు లు డ్రయినేజీ పైప్ లైన్ నిర్మాణం చేపట్టాల్సి ఉందని చెప్పారు. దీంతో అప్పటి నుంచి పనులు ఆగిపోయాయి. కళాసిగూడ స్కూలు వద్ద నాలాపై స్లాబు ఉంది. గతంలో ఉన్న సీసీ రోడ్డు ను తవ్వడంతో నాలా స్లాబుకు రంధ్రం ఏర్పడింది. జీహెచ్ ఎంసీ అధికారులు ఈ రంధ్రాన్ని పెద్దగా పట్టించు కోలేదు. అది లోతట్టు ప్రాంతం కావడం, అక్కడ ఉండే మ్యాన్ హెూల్‌లో చెత్త అడ్డుపడటంతో శనివారం కురిసిన భారీ వర్షానికి పెద్ద ఎత్తున వరద నీరు చేరింది. దాంతో ఆ రంధ్రం కనిపించక బాలిక అందులో పడి నాలాలో కొట్టుకుపోయింది. కాగా ఈ ఘటనను సీరియస్‌గా తీసు కున్న జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు ఇద్దరు అధికారులను సస్పెండ్ చేశారు. ఏఈఈ తిరుమలయ్య, వర్క్ ఇన్‌స్పెక్టర్ బీఎం హరికృష్ణను సస్పెండ్ చేస్తున్న జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ ఘటనపై పది రోజుల్లో సమగ్ర మైన నివేదిక ఇవ్వాలని ఈఈ ఇందిరాభాయిని ఆదేశించారని తెలిసింది.

బాలిక కుటుంబానికిమంత్రి తలసాని పరామర్శ

- ప్రభుత్వం తరపున ఐదు లక్షల ఆర్థిక సాయం

నవతెలంగాణ-ఓయూ

సికింద్రాబాద్ పరిధిలోని బేగంపేట్ కలాసిగుడ నాలాలో పడి మరణించిన చిన్నారి కుటుంబాన్ని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి శనివారం గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి పరామర్శించారు. ప్రభుత్వం తరపున రూ 5 లక్షల ఆర్థిక సహాయం ప్రకటించారు. బాధిత కుటుంబాన్ని తప్పకుండా ఆదుకుం టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాంగోపాల్ పేట్ కార్పొరేటర్ అరుణ గౌడ్, సికింద్రాబాద్ జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ ముకుంద రెడ్డి, ఆర్ డి ఓ మరియు బీ ఆర్ ఎస్ సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాదరణ లేక కాంగ్రెస్ పనికిమాలిన విమర్శలు : బీఆర్ఎస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎన్నికల సమయంలో బయటికెళ్లిన కాంగ్రెస్ నాయకులకు ప్రజాదరణ దొరకకనే సీఎం కేసీఆర్, మిగతా నాయకులపై అవాస్తవమైన విమర్శలు, ఆరోపణలు చేస్తున్నారని పలువురు బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు తెలిపారు. శనివారం హైదరాబాద్ బీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్యేలు గాదరి కిషోర్ కుమార్, సైది రెడ్డి, బొల్లం మల్లయ్య యాదవ్, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, నోముల భగత్, రవీంద్ర కుమార్ మాట్లాడారు. ఓటుకు నోటు దొంగ రేవంత్ రెడ్డి నీతులు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. ఎన్ని జిమ్మిక్కులు చేసినా ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మే పరిస్థితి లేదని స్పష్టం చేశారు.



ఆమె పాటై ప్రవహిస్తోంది

తొట్ల వెంకటలక్ష్మి... సాధారణ అంగన్‌వాడీ టీచర్. చిన్నతనం నుండి ఎన్నో కష్టాలు భరించింది. చిన్న వయసులోనే పెండ్లి... కష్టాలు... కడగండ్లు కలగలసిన బాల్యం ఆమెకు మిగిల్చింది కన్నీటి జీవితం. ఏడాది కొడుకును వదిలి ఉద్యోగ శిక్షణకు వెళ్ళింది. ఆ ఎడబాటు ఆమెను గాయకురాలిగా, గీత రచయితగా మార్చింది. పల్లెపాటలు, బతుకు పాటలు, బతుకమ్మ పాటలు ఆమె స్వరం నుండి అనర్గళంగా ధ్వనిస్తాయి. 'నా ధైర్యం, నా ధనం, నా సంతోషం, నా సంబరం నా అక్షరమే. విలువైన ఆలోచనలు కలవారు ఎప్పుడూ ఒంటరి వారు కాదు. అక్షరమే నా అంతరాత్మ' అంటూ తన పాటల ప్రస్థానాన్ని కొనసాగిస్తుంది. కన్నీటిని దిగమింగుతూ నిత్యం ఓ పాటై ప్రవహిస్తోన్న ఆమె పరిచయం మానవి పాఠకులకు ప్రత్యేకం...

మాది మహబూబాబాద్ జిల్లాలోని చిన్నగూడూరు గ్రామం. దళిత కుటుంబంలో పుట్టాను. మా అవ్వ తొట్ల వీరమ్మ మా అయ్య తొట్ల చిన్నవెంకయ్య. మా అవ్వ నాట్లు కోతల గుత్త మేస్త్రి. పది మందికి పని నేర్పుతూ తను కూలి పని చేస్తూ మమ్ముల బతికించింది. మా అయ్య చెప్పులు కుట్టేవాడు. మా అయ్యకు ఇద్దరు భార్యలు. మొదటి భార్యకు ఇద్దరు పిల్లలు. ఆమె చనిపోవడంతో మా అవ్వను పెండ్లి చేసుకున్నాడు. మా అవ్వకు మేము ముగ్గురం. మా అన్నయ్య, మా అక్క తర్వాత నేను చిన్నదాన్ని. మా అన్నయకు పెండ్లి అయ్యిన తర్వాత నేను పుట్టానంట. నేను ఐదో నెలల పాపగా ఉన్నప్పుడు మా అన్నయ్య చనిపోయాడు. ఆ బాధతో అవ్వ నాకు సరిగా పాలు ఇవ్వలేదు. చెట్టంత కొడుకు చనిపోవడంతో అవ్వ ఎప్పుడూ కుమిలిపోతుండేది. అప్పుడు మా అక్క బొడ్డు గురిగిలో కల్లు తీసుకొచ్చి రోజూ నాకు తాపిచ్చేదట. మా అక్క తెచ్చిన ఆ తాటికల్లే తల్లిపాలయ్యాయి నాకు.

కూలికిపోయి మమ్మల్ని బతికించింది

అవ్వ పనికి వెళ్లి వచ్చే వరకు కల్లు మత్తులో ఆకలి తెలియక పడుకునేదాన్ని. మా అయ్యేమో మమ్మలందరినీ వదిలేసి తన మొదటి సంబంధం కొడుకు మా పెద్దన్నయ్య దగ్గర ఉండేవాడు. మా అవ్వ కూలి పనికి పోయి ఎంతో కష్టపడి మమ్ముల బతికించింది. మా అయ్య ద్వారా అవ్వకు వచ్చిన భూమిని తీసుకొని వ్యవసాయం చేసుకుంటూ మా అక్కను నన్ను పెంచింది. అక్కకు పెండ్లి చేసి ఇల్లరికం పెట్టుకుంది. నాకు ఐదేండ్లు వచ్చిన తర్వాత బడికి తోలింది. బడిలో 'మీ నాన్న ఏమి పని చేస్తారమ్మా' అని సారు అడిగాడు. 'మా అయ్య చెప్పులు కుడతాడు సారు' అని చెప్పా. వెంటనే ఆ సారు తన ప్యారగాన్ చెప్పులు ఇచ్చి పది పైసలు నా చేతిలో పెట్టి 'ఈ చెప్పు మీ అయ్యతో కుట్టించుకురా' అని పంపాడు. వెంటనే నేను మా ఇంటికి వెళ్లి మా అయ్య చేతికి ఈ పైసా ఇచ్చి 'సారు చెప్పులు కుట్టమన్నాడు అయ్యా' అని చెప్పాను. వెంటనే చెప్పు కుట్టి పంపించాడు. మా ఇంటికి బడికి చాలా దూరం ఉంటుంది. నడుస్తూ నడుస్తూ వెళ్లి సార్‌కి ఇచ్చాను.

కాలుకు గాయం అయ్యేది

రెండో తరగతిలో ఉన్నప్పుడు నన్ను గొడ్ల దగ్గరకు పంపించారు మా వాళ్లు. గొడ్లను కాస్తూ వెళ్లేటప్పుడు కాళ్లకు చెప్పులు ఉండేటివి కావు. ముళ్ళు గుచ్చుకొని కాలుకు గాయం అయ్యేది. అట్లనే గొడ్లను కాసేదాన్ని. తర్వాత చలక కాడికి పంపించేవారు. ఆ చలక మూడు కిలోమీటర్ల దూరంలో ఉండేది. నడుస్తూ వెళ్లేదాన్ని. పజ్జోన్న సేలో పిట్టకాపుకు పోయేదాన్ని. టిఫిన్‌లో జొన్న గట్క వేసుకొని పోయేదాన్ని. పాల జొన్నలు, కంకులు కొట్టుకొని తినేదాన్ని. మా అక్క కంది కాయే లొట్టిలో ఉడకబెట్టి ఇచ్చేది. ఆకలితో అవి తినేవాళ్ళము. మా అక్క పిల్లల్ని ఎత్తుకునే దాన్ని. పని లేనప్పుడు మాత్రమే నన్ను బడికి పంపించేవారు. నేను బడికి వెళ్లేసరికి సార్లు నా పేరు తీసేవారు.

ఏడేండ్లపుడు నాగలి దున్నా

ఏడేండ్ల వయసులో పెసలు విత్తనాలు వేయటానికి మా అవ్వ నన్ను మా చలక పనికి పంపించేది. విత్తనం వేస్తూ వారు అన్నం తినే సమయంలో నేను నాగలి పట్టి అటూ ఇటూ దున్నే దాన్ని. అది మా బావ చూసి 'అలా కాదురా ఇలా దున్నాలని' అని నాగలి నేర్పించాడు. అప్పట్లో ఓ సేటు దగ్గర మా వాళ్ళు అప్పు తీసుకున్నారు. వడ్డీ కింద మూడు రోజులు నాగలి నాటు వేయడానికి రమ్మని ఆ సేటు చెప్పారట. ఆ సమయంలో మా బావకు జ్వరం వచ్చింది. అప్పుడు మూడు రోజులు ఆ సేటుకు నాగలి దున్నటానికి నన్ను పంపించారు. పది నాగండ్లలో చివరి నాగలి నాది. దాన్ని తిప్పలేక చాలా ఇబ్బంది పడేదాన్ని. సేటు నా నాగలి వంకే చూసేటోడు. సేటు కోపం చేస్తాడేమో అనే భయంతో గడగడలాడుతూ మూడు రోజులు నాగలి దున్నాను. ఇలా ఎన్నో ఇబ్బందు పడ్డాను. ఇప్పుడు నా బాల్యం తలచుకుంటే కన్నీళ్లు పెట్టిస్తుంది.

పెండ్లిలో నిద్రపోయా...

నాకు తొమ్మిదేండ్లు రానేవచ్చాయి. నేను మావయ్య ప్రేమ ఎక్కువ ఎరగను. 'పిల్లకు పెండ్లి వయసు వచ్చింది' అని మా మేనమామతో చెప్పింది అవ్వ. అప్పుడు నేను 4వ తరగతి చదువుతున్నాను. మా మామయ్య ఒక సంబంధం తెచ్చాడు. మా అవ్వ ఆ సంబంధానికి ఒప్పుకుంది. 'నీకు పెండ్లి చేస్తా అమ్మా' అని నాతో అన్నది. 'నాకు ఏమీ తెలవదు అవ్వ, నీ ఇష్టం' అన్నాను. నేను చదువుకుంటా అని మాత్రం చెప్పాను. అలా నాకు తెలియని వయసులోనే పెండ్లి చేశారు. పెండ్లిలో నిద్రపోయాను. ఏం జరిగిందో, ఎలా జరిగిందో తెలియని వయసు. బండిలో కుర్చీ పెట్టుకొని నన్ను తీసుకెళ్లారు. మా అత్తగారింట్లో మామయ్య లేడు. నాకు ఒక మరిది. నాకు ఇంట్లో పని, వంట పని ఏమీ రాదు. వాకిలి ఊడవడం కూడా రాదు. అంతా మా అత్తగారే నేర్పించారు. పెండ్లయిన రెండేండ్లకు పెద్దమనిషినయ్యాను. నాట్లేసి, కోతలు కోసి, కలుపులు తీసి, ఎండకెండి, వానకు తడిచాను. బాల్యంలో బహు బాధలు పడ్డాను. తల్లి కోసం తల్లడిల్లేదాన్ని, ఇంకా రావట్లేదని. నా తల్లి కోసం ఓసారి బావిలో పడ్డాను. చనిపోతా అని తెలియదు నాకు. బావిలో పడితే మా అవ్వ వస్తది కదా అనే ఆలోచనలతోనే 9 ఖండాలలోతు ఉండే బాయిలో నీళ్ల చేది అందులో పడ్డాను.



అత్తగారింట్లో ఒడ్లు దంచుడు, కారం కొట్టుడు, జొన్నలు తొక్కుడు, ఘటక ఇసిరి పోయటం ఈ పనులన్నీ చేసి మళ్లీ అడవి పనికి పోయేదాన్ని. చేతులు వాసి గంటెతో బువ్వతినే దాన్ని. పుట్టింటికి పోయినపుడు తిరిగి మా అత్తగారింటికి రావాలంటే మా అవ్వతో ప్రమాణం చేయించుకునే దాన్ని. నువ్వు ఎనిమిది రోజులకు వస్తావా రావా అని. అవ్వ వచ్చే రోజు బువ్వ తినకుండా ఎదురుచూసే దాన్ని. బాయిలో పడ్డ నన్ను బయటికి తీశారు. బాయిలో నీరంతా రక్తమయ్యింది. అక్కడ ఒక ఆర్ఎంపీ డాక్టర్ ఉన్నారు. ఆయన కాడికి నన్ను తీసుకెళ్లారు. ఆయన వాకిట్లోనే నిలబెట్టాడు. వాళ్ల అరుగు మీద పడుకోబెట్టాడు. ఈమె దళిత మహిళ అని దూరంగా నిలబడి సూదేశాడు. తర్వాత మా అవ్వ హాస్పిటల్‌కి తీసుకెళ్ళింది.

దళిత మహిళనని..


దూర విద్య ద్వారా చదువు

డీలర్ షిప్ కోసం అని మా ఆయన ఏడో తరగతి పరీక్షలు రాయనిచ్చాడు. ఏసంగి నాట్లు వేస్తూ, కలుపులు తీస్తూ ఏడో తరగతి పాసయ్యాను. తర్వాత పదవ తరగతి పరీక్ష ఓపెన్‌లో పాస్ అయ్యాను. తర్వాత ఇంటర్, ఓపెన్ డిగ్రీ కూడా పాసయ్యాను. చివరకు డిగ్రీ పట్టా పొందాను. అంగన్‌వాడీ టీచర్‌గా విజయవాడలో మూడు నెలలు ట్రైనింగ్ కోసం వెళ్ళాను. అప్పుడు నాకు ఏడాది బాబు, పాలు తాగుతున్నాడు. బాబును వదిలి ట్రైనింగ్‌కి పోయాను. ట్రైనింగ్‌లో బాబు గుర్తొచ్చి బాగా ఏడ్చేదాన్ని. పాలు గడ్డగట్టి బాగా జ్వరం వచ్చింది. నా బాధ చూడలేక ఇన్చార్జ్ మేడమ్ మూడు రోజులు ఇంటికి పంపించారు. బాబును చూసుకొని మళ్లీ ట్రైనింగ్‌కు వచ్చాను.

కొడుకు కోసం మొదటి పాట

మా ట్రైనింగ్‌లో ఓ సాంస్కృతిక కార్యక్రమం ఏర్పాటు చేశారు. అందులో "జోల జోలమ్మ జోల... ఊరుకో అబ్బాయి... నా చిన్ని పాపాయి... ఊరిలో మీ అమ్మ ట్రైనింగ్‌కు పోయింది" అంటూ నా కొడుకు గురించి ఓ పాట రాసి పాడుకున్నాను. పాట రాయడం అదే మొదటి సారి. మేడం వాళ్ళు చాలా మెచ్చుకున్నారు. పాట పాడటం, రాయడం అంటే ఇలాగేనా అనేది నా మెదడులో బాగా నాటుకుపోయింది. ఆరోజు నుండే నా పాటకు విత్తనమేశాను. విజయవాడ ట్రైనింగ్‌లోనే నా పాటలు కూడా మొలకెత్తాయి. అప్పుడు ఆ మేడం మీదనే ఓ పాట రాశాను. చాలా మెచ్చుకున్నారు. అప్పటి నుండి సమాజ మలుపు కోసం పాటలు రాయటం, పాడటం మొదలుపెట్టాను. పాట ద్వారా అత్యాచారాలు, దురహంకారులను ప్రశ్నించడం మొదలుపెట్టాను. పాటలు రాయడం, పాడటం అంటే నాకెంతో ఇష్టంగా మారిపోయింది. ఇప్పుడు నాకు ప్రాణం పాటంటే.





ఇంకొక ముఖ్యమైన విషయం నేను చెప్పుకోవాలి. నా పాటలకు ఇంకా పదును పెట్టింది గాడిపెల్లి చక్రియ. ఈయన 'మరో పోరాటం' విలేఖరిగా చేసి చనిపోయారు. 'చెట్టుమీద, పుట్ట మీద, దేని మీద పడితే దానిమీద రాయండి అమ్మ' అంటూ నాకు సలహా ఇచ్చారు. ఇంకా నాకు ఎంతో ధైర్యాన్ని ఇచ్చి ముందు నడిపించేటి గాడిపెల్లి మధుసారు. వారు వరంగల్లులో సీనియర్ జర్నలిస్టు. దళిత కవయిత్రి అని నన్ను ఎంతో ప్రోత్సహించారు. దాశరధి కృష్ణమాచార్యులు, రంగాచార్యులుగారి పురిగడ్డ అయిన చిన్న గూడురు నాది. దాశరధి కృష్ణమాచార్యులుగారి జయంతి సందర్భంగా నాకు సన్మానం చేశారు. అక్కడే నేను రాసిన 55 పాటలను ఒక బుక్కుగా ముద్రణ చేసి ఆవిష్కరించారు. ఇంకా 75 పాటలతో ఇంకొక బుక్కు ముద్రణకు సిద్ధంగా ఉంది. అది కూడా మధు సారే ముద్రిస్తానని చెప్పారు.

నా పుస్తకం ఆవిష్కరించారు

❄❄

ప్రమాదంలో దేశం

(మొదటిపేజీ తరువాయి)

రావాలని అంబేద్కర్ కోరుకున్నారనీ, బీజేపీ ఆయన ఆశయాలను, కన్న కలలను వెనక్కి తీసుకెళ్తున్నదని విమర్శించారు. రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసేందుకు పాలకులు కుట్రలు పన్నుతున్నరని తెలిపారు. సమాజాన్ని విడగొట్టే దుర్మార్గవాదానికి వ్యతిరేకంగా ఐక్యపోరాటానికి ప్రజలు కదిలి రావాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు.

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ రామ్‌దాస్ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని మన కోసం మనం రాసుకున్నామని గుర్తుచేశారు. ప్రజాస్వామ్యాన్ని ఆమోదించుకోవడం ద్వారా అందరికి అన్ని హక్కులు దక్కాయని తెలిపారు. భిన్నత్వంలో ఏకత్వమున్న భారతదేశంలో సోదరభావాన్ని రాజ్యాంగం కల్పించిందన్నారు. అంబేద్కర్ అంటే ఒక విగ్రహం మాత్రమే కాదనీ, మనం అనుసరించాల్సిన బాట అని తెలిపారు.

ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి మాట్లాడుతూ సామాజిక పోరాటానికి ఫూలే, అంబేద్కర్ రెండు కండ్లని అభివర్ణించారు. అంబేద్కర్ మహిళా పక్షపాతి అని తెలిపారు. మహిళా కోడ్ కోసం కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసిన మహనీయడని తెలిపారు.

గౌడ సంఘాల జేఏసీ చైర్మెన్ బాల్ రాజ్ గౌడ్ మాట్లాడుతూ అంబేద్కర్ ఇచ్చిన ఓటు హక్కును ఆయుధంగా ఉపయోగించుకోవాలని సూచించారు. జనాభా దామాషా ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను ఎన్నికల్లో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.

ప్రముఖ అంబేద్కరిస్టు జే.బి.రాజు మాట్లాడుతూ ఓటు హక్కుతో బీజేపీ సర్కారును కూలదోస్తేనే మనవాద ప్రమాదం నుంచి బయపడగలుగుతామని తెలిపారు.

సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణ పోరాటంలో మిగతా సంఘాలకు సీఐటీయూ మద్దతుగా నిలబడుతుందని ప్రకటించారు. బీసీ కులగణన, ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ, సామాజిక న్యాయం జరగాలంటే బీజేపీ ప్రభుత్వం పోవాల్సిందేనని స్పష్టం చేశారు.

ఆవాజ్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అబ్బాస్ మాట్లాడుతూ బానిసత్వం, అంటరానితనం భరించలేక ఇతర మతాల్లోకి వెళ్లిన వారు స్వేచ్ఛను అనుభవిస్తున్నారని తెలిపారు. ఇది మనువాదులకు కంటగింపుగా మారిందన్నారు. ఇలాంటి చర్యలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు.

బీజేపీ ఎస్సీ, ఎస్టీ, బీసీల వైఖరేంటి?.... జాన్ వెస్లీ

బీజేపీ నమ్ముతున్న మనవాద సిద్ధాంతం ప్రకారం బండి సంజయ్ ఎంపీగా కావడానికి కానీ, ఆ పార్టీకి రాష్ట్ర అధ్యక్షునిగా ఉండటానికి వీల్లేదని కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు జాన్ వెస్లీ తెలిపారు. ఆయన కూడా బానిసగానే ఉండాల్సి ఉంటుందన్నారు. ఆ పార్టీలో కొనసాగుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు మనువాదంపై తమ వైఖరేంటో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. మనువాదం వస్తే మనుషులుగా చూసే పరిస్థితి ఉండబోదన్నారు. చదువు, పాలన, ఆస్తిలో హక్కులుండవని చెప్పారు. తప్పును బట్టి శిక్షలుండాలని రాజ్యాంగం చెబితే కులాన్ని బట్టి శిక్షలుండాలని మనవాదం చెబుతున్నదని గుర్తు చేశారు. మనువాదంపై బీజేపీ వైఖరి స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. మనవాదులకు వ్యతిరేకంగా జరిగే ఉద్యమంలో కలిసి రావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్నం ప్రధాన కార్యదర్శి డీ.జీ.నర్సింహారావు, తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీరాంనాయక్, గొర్రెల, మేకల పెంపకందార్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుత రవీందర్, తెలంగాణ గిరిజన సంఘం హైదరాబాద్ సౌత్ జిల్లా కార్యదర్శి బాలు నాయక్, పట్నం హైదరాబాద్ జిల్లా నాయకులు ఎం.మహేందర్, టీపీఎస్కే రాష్ట్ర నాయకులు భూపతి వెంకటేశ్వర్లు, ఆవాజ్ హైదరాబాద్ సౌత్ జిల్లా కార్యదర్శి ఎండీ సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఆట-పాట

ఈ సందర్భంగా టీపీఎస్కే శిక్షణలో చిన్నారులు ప్రదర్శించిన ఆటపాటలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. అంబేద్కర్ జీవితం, దేశ పరిస్థితులు, బీజేపీ కుట్రలపై ఆలోచింపజేశాయి. చిన్నారులు హావభావాలతో సాహిత్యానికి తగినట్టు ప్రదర్శించిన అభినయం ప్రజలను మెప్పించింది. అంబద్కర్, ఫూలే, సావిత్రిభాయి ఫూలే మహనీయులను జీవితాలను కండ్ల ముందు సాక్షాత్కరింపజేశారు.

రజకుల సమస్యల పరిష్కారానికి చర్యలు

(మొదటిపేజీ తరువాయి)

పైళ్ల ఆశయ్య అధ్యక్షతన జరిగిన "రజకుల రక్షణ" సభలో మంత్రి మాట్లాడారు. జనగామ జిల్లాలో దోబీఘాట్ నిర్మాణానికి సీఎం కేసీఆర్ రూ.2 వందల కోట్ల 70 లక్షలు కేటాయించారన్నారు. అందుకు భూమిని సేకరించాల్సి ఉందని చెప్పారు. అలాగే, పాలకుర్తి నియోజకవర్గం కేంద్రంలో కోటి రూపాయలతో ఎకరం స్థలంలో చాకలి ఐలమ్మ పేరిట ఫంక్షన్ హాల్ నిర్మిస్తామన్నారు. ఇండ్లులేని రజకులందరికీ డబుల్ బెడ్ రూమ్స్ ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.రజకుల సమస్యలపై సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు.

ఐలమ్మ స్ఫూర్తితో హక్కుల సాధన.. : ఎమ్మెల్సీ అలుగుబెల్లి

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరవనిత చాకలి ఐలమ్మ స్ఫూర్తితో హక్కులను సాధించుకుందామని ఎమ్మెల్సీ అలుగుబల్లి నర్సిరెడ్డి పిలుపునిచ్చారు. రజకుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యం కావాల్సిన అవసరం ఉందన్నారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆనాటి దొరల, పెత్తం దారీ,పెట్టుబడి దారీ విధానాలు అమలు చేసేందుకు కుట్ర చేస్తోందన్నారు. అందుకోసం బీజేపీ ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తుంద న్నారు.ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి మాట్లాడుతూ.. రజక సంఘం మహాసభలో ప్రవేశపెట్టిన సమస్యలతో కూడిన తీర్మానాలు సరియైనవేనన్నారు. వీటిని ప్రభుత్వం పరిష్కరించేందుకు కృషి చేస్తుందన్నారు.

జనగామలో మహాప్రదర్శన

సభకు ముందు జనగామలో స్థానిక క్రిస్టియన్ గ్రౌండ్ నుంచి వైష్ణవి గార్డెన్ వరకు రజకులు పెద్దఎత్తున ప్రదర్శనగా వచ్చారు. ఈ ర్యాలీ డప్పుల నృత్యాలు, ఆటపాటలతో ముందుకు సాగారు. ఈ మహాసభలో స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే డాక్టర్ టి.రాజయ్య, ఎమ్మెల్సీలు కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్ రెడ్డి, సారయ్య, జనగామ జడ్పీ చైర్మెన్ పాకాల సంపత్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు మోకు కనుక రెడ్డి, రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు నరేష్, నాయకులు వెంకటేశ్వర్లు, అంజయ్య, ప్రజా సంఘాల నాయకులు రాపర్తి రాజు, విజయ్, ధర్మబిక్షం తదితరులు పాల్గొన్నారు.

రెజ్లర్ల ఆందోళన కరెంట్ కట్...వాటర్ కట్..

(మొదటిపేజీ తరువాయి)

వద్ద గత ఏడు రోజులుగా ఆందోళన చేస్తున్న రెజ్లర్లకు వాటర్, కరెంట్ కట్ చేశారు. ఢిల్లీ పోలీసులు వడిగట్టిన ఈ అప్రజాస్వామ్య చర్యలపై రెజ్లర్లు మండిపడుతున్నారు. మరోవైపు రెజ్లర్ల ఆందోళనకు మరింత మద్దతు, సంఘీభావం వెల్లువెత్తుతున్నది. రాజకీయ నేతలతోపాటు క్రీడాకారులు, సినీ ప్రముఖులు, మహిళా సంఘాల నాయకులు ఆందోళనకు మద్దతు, సంఘీభావం తెలుపుతున్నారు.

ఆందోళన ఆపేయాలని తమపై ఒత్తిడి : బజరంగ్ పూనియా

బజరంగ్ పూనియా మాట్లాడుతూ 'మాకు ఆహారం అందకుండా. నీటి సరఫరా లేకుండా చేస్తున్నారు. పవర్ కట్ చేశారు. బారికేడ్లు ఏర్పాటు చేశారు. బ్రిజ్‌భూషణ్‌పై ఎఫ్ఐఆర్ నమోదుకాగానే మా నిరసన ఆపివేయాలని మాపై ఒత్తిడి తెచ్చారు.నిరసన వేదిక వద్దకు ఆహారం తీసుకువచ్చే వారిని కొట్టి, పారిపోయేలా చేస్తున్నారు. మీరు ఏమైనా చేసుకోండి.. లోపలికి ఆహారం, నీరు అనుమతించమని ఏసిపి మాతో అన్నారు. పోలీసులు మమ్మల్ని ఎంతగా హింసించినా.. మాకు న్యాయం జరిగేవరకు మేం పోరాటం సాగిస్తాం' అని పేర్కొన్నారు.

కేంద్రం తీరు ఆమోదయోగ్యం కాదు: సీతారాం ఏచూరి

రెజ్లర్ల ఆందోళనపై ప్రభుత్వ దుశ్చర్యలను సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఖండించారు. రెజ్లర్లు దేశానికి గొప్ప గౌరవ ప్రతిష్టలు తెచ్చిపెట్టారని, దాన్ని కొనసాగిస్తున్నారని తెలిపారు. వారంతా ప్రపంచ స్థాయి క్రీడాకారులని, వారి పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తోన్న తీరు ఆమోదయోగ్యం కాదని అన్నారు. బ్రిజ్‌భూషణ్‌పై చర్యలు తీసుకోవడానికి ఎందుకు ఆలస్యం చేస్తున్నారని, ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి కూడా ఆలస్యం చేశారని తెలిపారు. క్రీడాకారులకు న్యాయం జరగాలని స్పష్టం చేశారు. ఐద్వా జాతీయ అధ్యక్షురాలు, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యురాలు శ్రీమతి టీచర్ జంతర్ మంతర్ వద్ద రెజ్లర్లకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ పార్టీ కేంద్ర కమిటీ ఈ ఆందోళనకు సంపూర్ణ మద్దతు తెలుపుతూ తీర్మానం ఆమోదించిందని అన్నారు.

తెలంగాణ అభివృద్ధి గజినీలకు అర్థం కావట్లే..

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

'తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి పక్క రాష్ట్రంలో ఉన్న రజనీకాంత్‌కు అర్థమైంది. ఇక్కడే ఉన్న గజినీలకు మాత్రం అర్థం కావడం లేదు' అని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. శనివారం ఆయన సంగారెడ్డి జిల్లాలోని కంది, సదాశివపేట, న్యాల్‌కల్ మండలాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. హైదరాబాద్ ఎంతో మారిపోయిందని, న్యూయార్క్‌లా కనిపిస్తుందని సూపర్ స్టార్ రజనీకాంత్ పేర్కొనడం విశేషమన్నారు. సీఎం కేసీఆర్ 9 ఏండ్ల పాలనలో హైదరాబాద్ నగరంతో పాటు రాష్ట్రంలో ఎంతో అభివృద్ధి కనిపిస్తుందని రజినీ అన్నారని గుర్తు చేశారు. కానీ, ఇక్కడున్న ప్రతిపక్షాలకు కనిపించడం లేదన్నారు. కాళేశ్వరం కట్టి కోటి ఎకరాలకు సాగునీరు ఇస్తున్నందుకు గద్దె దించుతారా అని నిలదీశారు. ప్రభుత్వ ఉద్యోగమే కాకుండా టీ హబ్, టీఎస్ఐ పాస్‌లతో 15 లక్షల ప్రయివేటు కొలువులు ఇస్తున్నది నిజం కాదా అని అన్నారు. రెండు లక్షల ఉద్యోగాలు తాము భర్తీ చేస్తుంటే నిరుద్యోగులను రెచ్చగొట్టి రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. దొంగే దొంగ అన్నట్టుగా కాంగ్రెస్ వాళ్లు దొంగ దీక్షలు చేస్తున్నారన్నారు. 12వ శతాబ్దంలోని కుల రహిత సమాజం కోసం బసవేశ్వరుడు పోరాడారని గుర్తు చేశారు. కుల మతాలు ఏవైనా భిన్నత్వంలో ఏకత్వం కలిగి ఉన్న దేశం మనదని, అందరూ కలిసి ఉండాలనే బసవేశ్వరుడి సూక్తులను ఆచరణలో పాటించాలని అన్నారు. ఓబీసీ రిజర్వేషన్ల కోసం లింగాయతులు ఎన్నో ఏండ్లుగా పోరాటం చేస్తున్నారన్నారు. తెలంగాణ ప్రభుత్వం లింగాయత్ సమాజాన్ని ఓబీసీలో చేర్చాలని తీర్మానం చేసి కేంద్రానికి పంపిందని చెప్పారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి లింగాయతులను ఓబీసీలో కలిపేందుకు కృషి చేయాలని, దమ్ముంటే కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలని డిమాండ్ చేశారు. లింగాయత్‌ల గౌరవాన్ని ఆకాశమంత ఎత్తుకు తీసుకెళ్లింది సీఎం కేసీఆర్ మాత్రమే అన్నారు. ఆత్మగౌరవ భవనాల కోసం కోకాపేటలో రూ.30 కోట్ల విలువ చేసే స్థలం కేటాయించడమే కాకుండా భవన నిర్మాణం కోసం రూ.పది కోట్లు కేటాయించినట్టు తెలిపారు.

నాల్కల్ మండలంలో కుంభమేళా జాతరకు అన్ని ఏర్పాట్లూ చేయాలని మంత్రి అధికారులకు సూచించారు. కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ నుంచి వచ్చే సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులూ కలవకుండా సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. కంది మండలంలోని వీరశైవ లింగాయత్ భవన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీ బీబీ పాటిల్ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, మాణిక్యరావు, చేనేత అభివద్ధి సంస్థ చైర్మెన్ చింత ప్రభాకర్, టీఎస్ ఎంఐడిసి చైర్మెన్, డిసిఎంఎస్ చైర్మెన్ శివకుమార్ పాల్గొన్నారు.

వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-అంబర్‌పేట

తెలంగాణ ఆల్ హమాలి వర్కర్స్ ఫెడరేషన్(సీఐటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం చలో లేబర్ కమిషన్ కార్యాలయం వద్ద ధర్నా జరిగింది. దీనికి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి వివిధ రంగాల హమాలీలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె వెంకటేష్ మాట్లాడుతూ హమాలీలు వ్యవసాయ మార్కెట్, కూరగాయలు, పండ్ల మార్కెట్, ఎఫ్ సి ఐ, సిమెంట్ గోడౌన్‌లో సివిల్ సప్లై, జీసిసి, బేవరేజ్, బజారు ముఠా, ఐకెపి, హమాలీలు, గ్రామీణ హమాలీ లు, రైస్ మిల్, ఆయిల్ మిల్ రైల్వే ఆర్టీసీ లో పనిచేసే హమాలీలందరి సంక్షేమం కోసం వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. హమాలీల సంక్షేమం కోసం నూతన సెక్రటేరియట్ ప్రారంభోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి తొలి సంతకం చేసి పేద హమాలీలందరిని ఆదుకోవాలని కోరారు. పీఎఫ్ ఈఎస్ఐ. బోనస్ ప్రమాద బీమా ఆరోగ్య భీమా వంటి సౌకర్యాలను కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు.. 55 సంవత్సరాల వయసు పైబడిన హమాలీలందరికీ కనీసం 6000 రూపాయల పెన్షన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హమాలీ ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు తుమ్మల వీరారెడ్డి మాట్లాడుతూ హమాలీ శ్రమతో ప్రభుత్వానికి ప్రభుత్వ ప్రయివేటు మార్కెట్లు ఎఫ్సీఐ, సివిల్ సప్లై యావరేజ్ కోల్డ్ స్టోరేజ్ ల నుండి కోట్ల రూపాయల ఆదాయం వస్తున్నా హమాలీల సంక్షేమానికి నిధులు కేటాయించకపోవటం అన్యాయం అన్నారు. హల్ హమాలి ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగూరు రాములు మాట్లాడుతూ 50 కిలోలకు మించిన బరువులను నిషేధించాలని ఐఎల్ఓ తీర్మానం ఉన్నప్పటికీ అనేక మార్కెట్లలో కూరగాయలు పండ్లు, అపరాలు 90,100 కేజీల బరువులు మోయించటం వలన అనేక అనారోగ్యాలకు గురవుతున్నారని అన్నారు. హమాలీల ను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలన్నారు.

జాయింట్ కమిషనర్‌కు వినతిపత్రం

మూడు గంటల పాటు హమాలీలు పెద్ద ఎత్తున ధర్నా చేసి అనంతరం జాయింట్ కమిషనర్ గంగాధర్‌కు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. గంగాధర్ హమాలీల వద్దకు వచ్చి వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు కోసం ప్రభుత్వానికి నివేదిక పంపుతామని హామీ ఇచ్చారు. హమాలీలు అధికారులతో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేసి హమాలీల సమస్యలన్నీ చర్చించి పరిష్కరిస్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పి శ్రీకాంత్ హల్ అమాలి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు భూక్య శ్రీనివాస్ ఉపాధ్యక్షులు చెన్నయ్య బి రాములు గోపాలస్వామి కార్యదర్శి పి సుధాకర్. యాదగిరి కోశాధికారి కనకయ్య సీఐటీయూ సౌత్ జిల్లా కార్యదర్శి శ్రావణ్ కుమార్ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వడ్లు ఎత్తట్లేదు...!

(మొదటిపేజీ తరువాయి)

350 బస్తాలు కేంద్రంలో ఉన్నాయి. అకాలవర్షం వస్తే నేను, నా భార్య ఏమి చేయగలుగుతాం. ప్రభుత్వ పెద్దలు ఆలోచించాలి.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు
బొంతు రాంబాబు, తెలంగాణ రైతు సంఘం ఖమ్మం జిల్లా కార్యదర్శి

రైతులను ఇబ్బంది పెట్టకుండా ఎప్పటి ధాన్యం అప్పుడు రవాణా చేయాలి. కొనుగోళ్లు వెనువెంటనే చేస్తుండాలి. ఓవైపు అకాల వర్షాలు వెంటాడుతున్నాయి. ఆరుగాలం కష్టం ఎక్కడ వర్షార్పణం అవుతుందేమోనన్న ఆందోళన రైతుల్లో ఉంటుంది. కాబట్టి కొనుగోళ్లు, రవాణా, దిగుమతి ఇవన్నీ సకాలంలో జరగాలని తెలంగాణ రైతుసంఘం తరఫున డిమాండ్ చేస్తున్నాం. అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ విషయంలో చొరవ తీసుకోవాలి.

లారీల నుంచి వెంటనే దిగుమతి చేసుకోవాలి
ఎన్.మధుసూదన్, అదనపు కలెక్టర్, ఖమ్మం

లారీల నుంచి వెంటనే ధాన్యం దిగుమతి చేసుకోవాలని ఇప్పటికే ఆదేశాలిచ్చాం. రవాణా పరంగా జాప్యం తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

ఇది తెలంగాణకు గర్వకారణం

(మొదటిపేజీ తరువాయి)

ఆహ్లాదభరిత వాతావరణంలో ఉద్యోగులు పనిచేసేలా నిర్మితమైన సచివాలయం, ప్రభుత్వ యంత్రాంగం పనితీరును గొప్పగా ప్రభావితం చేస్తూ గుణాత్మక మార్పుకు బాటలు వేయనున్నదని చెప్పారు. మార్పుకను గుణంగా ఎప్పటికప్పుడు తమను తాము తీర్చిదిద్దుకుంటూ, ప్రజల అవసరాలకు అనుగుణంగా ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుంటూ, వాటిని సాకారం చేసేందుకు సుపరిపాలన సాగేలా సెక్రటేరియట్ నిర్మాణం జరిగిందని సీఎం వివరించారు. ఒక రాష్ట్ర సచివాలయానికి డా. బీఆర్. అంబేద్కర్ పేరును పెట్టడం దేశంలోనే మొదటిసారి అని సీఎం తెలిపారు. అంబేద్కర్ మహాశయుని పేరు పెట్టుకోవడం వెనక సామాజిక ఆర్థిక రాజకీయ సాంస్కృతిక రంగాల్లో ఎస్సీ,ఎస్టీ,బీసీ మైనారిటీ మహిళా, పేద వర్గాలకు సమాన హక్కులు దక్కాలనే సమున్నత లక్ష్యమున్నదని సీఎం అభిప్రాయపడ్డారు. ఎదురుగా తెలంగాణ అమరుల స్మారక జ్యోతి, పక్కనే ఆకాశమంత ఎత్తున అంబేద్కర్ మహాశయుడు రేపటికి దిక్సూచిగా నిలిచి నిరంతరం ఒక స్ఫూర్తిని రగిలిస్తుండగా, తెలంగాణ పాలనా సౌధం నుంచి జాతి మెచ్చే సుపరిపాలన రాష్ట్ర ప్రజలకు అందాలనే లక్ష్యంతో, తాత్విక, సైద్ధాంతిక అవగాహనతోనే అంబేద్కర్ మహాశయుని పేరును తెలంగాణ సచివాలయానికి పెట్టడం జరిగిందని సీఎం అన్నారు. దేశంలో అత్యంత చిన్న వయసున్న రాష్ట్రంగా, ఇతర రాష్ట్రాలతో పోల్చితే, తెలంగాణ సకల జనుల సంక్షేమ పాలనను దేశానికి ఆదర్శంగా అందిస్తున్నదని సీఎం చెప్పారు. అనతికాలంలోనే తెలంగాణ పాలన ఒక మోడల్‌గా నిలిచిందనీ, ఇది దేశవ్యాప్తంగా విస్తరించేలా తెలంగాణ పాలన నూతన సచివాలయం నుంచి ద్విగుణీకృతమ వుతుందని సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభ దేదీప్యమానమయ్యేలా, దార్శనికతతో సాధించిన ప్రగతి వెలుగుల దారుల్లో, ప్రస్థానం అద్భుతంగా కొనసాగుతుందని సీఎం కేసీఆర్ తన ప్రగాఢ విశ్వాసా న్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సెక్రటేరియట్‌ను అత్యంత గొప్పగా తీర్చిదిద్దడంలో అమోఘమైన పాత్ర పోషించిన, రాల్లెత్తిన కూలీలను, మేస్త్రీలను, నిర్మాణంలో కష్టించి పనిచేసిన అన్ని వృత్తుల నిపుణులను, అపురూపంగా మోడల్ అందించిన ఆర్కిటెక్టులను, విరామమెరుగక రేయింబవళ్ల పనిచేసిన కాంట్రాక్టు ఏజెన్సీలను, వారి ఇంజినీర్లను, ఆర్ అండ్ బి శాఖ మంత్రిని, ఉన్నతాధికారులను, ఇంజినీర్లను, సిబ్బందిని, నిర్మాణంలో పాల్గొన్న ప్రభుత్వ యంత్రాంగాన్ని ప్రతి ఒక్కరినీ పేరు పేరునా సీఎం కేసీఆర్ అభినందించారు. ఈమేరకు శనివారం సీఎంవో ఒక ప్రకటన విడుదల చేసింది.

అనుమతులు లేని అక్రమ లే అవుట్ గేట్లు కూల్చివేత :ఎంపీవో



నవతెలంగాణ-ఘట్‌కేసర్

మండలంలోని అంకుశాపూర్ గ్రామంలోని సాయి తేజ గార్డెన్ యజమానులు అనుమతులు లేకుండా నిర్మించిన జీపీ లేఅవుట్ గేట్లు జేసీబీతో తొలగించినట్టు ఎంపీవో నంద కిషోర్, గ్రామ కార్యదర్శి తెలిపారు. ఈ గేట్లు అనుమతులు లేకుండా గేట్లు మూసివేస్తున్నారని శనివారం తమకు ఫిర్యాదు రావడంతో గేట్లను తొలగిస్తున్నట్టు తెలిపారు. అక్రమంగా నిర్మించిన గేట్లను తొలగించిన అధికారులకు గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-అబ్దుల్లాపూర్ మెట్

అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని పిగ్లీపూర్ గ్రామానికి చెందిన జక్కుల అలివేలుకు తహసీల్దార్ అనితరెడ్డి కల్యాణలక్ష్మి రూ. లక్షా, 1116ల చెక్కును తన చాంబర్‌లో శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోట రాధా లక్ష్మారెడ్డి, కుమార్, జంగయ్య, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

21

సీఎం రిలీఫ్‌ఫండ్ ఆపన్న హస్తం

విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి



నవతెలంగాణ-బడంగ్‌పేట్

సీఎం కేసీఆర్ నాయకత్వంలో పేద ప్రజలకు అందిస్తున్న సీఎం సహాయ నిధి పథకం ఆపన్న హస్తంగా పని చేస్తుందని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. శనివారం మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 32వ డివిజన్‌లో నివాసం ఉండే జంగయ్య. పి, తండ్రి.పెంటయ్య అనారోగ్యానికి గురికాగా, ప్రయివేట్ చికిత్స నిమిత్తం బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఎస్సీ సెల్ అధ్యక్షులు సంతోష్ కుమార్‌ను సంప్రదించి సీఎం రిలీఫ్‌ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నారు.ఆయన విద్యాశాఖ మంత్రికి తెలియజేయగా, ఆమె సహకారంతో మంజూరైన రూ.60 వేల చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.అనతంరం బాధితులు విద్యాశాఖ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు తదితరులు ఉన్నారు.

ప్రభుత్వాస్పత్రుల బలోపేతమే ధ్యేయం

వైద్యాధికారి డా. నారాయణరావు



నవతెలంగాణ-ఉప్పల్

ప్రభుత్వాస్పత్రుల బలోపేతమే ధ్యేయంగా కృషి చేస్తామని ఆరోగ్య వైద్యాధికారి డా. నారాయణ రావు అన్నారు.శనివారం ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని కీసర డివిజ్ డిప్యూటీ డిస్ట్రిక్ మెడికల్,హెల్త్ ఆఫీసర్ డా.నారాయణరావు అధ్యక్షతన డివిషనల్ రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్ రావు ఆదేశాల మేరకు జిల్లాలో కంటి వెలుగు కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనేలా సంబంధిత అధికారులు కృషి చేయాలన్నారు. ఒక్కొక్క సూపర్‌వైజర్ 300 మందిని కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించే విధంగా చైతన్య పరచాలని ఆదేశించారు. సీపీఆర్‌పై ఆరోగ్య సిబ్బందికి ప్రత్యేక అవగాహనా ఉండాలనే ఉద్దేశంతో ప్రత్యేకమైన శిక్షణా శిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. సీపీఆర్ చేయడం వల్ల మనిషి ప్రాణాలు రక్షించవచ్చున్నారు. అంతేకాకుండా ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలను మెరుగుపరిచాలని తెలిపారు. అనంతరం టీబీ, బర్త్ ప్లానింగ్, ఇఫ్‌ఏ టాబ్లెట్స్, ఎన్సీడీ కిట్స్ పంపిణి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని మల్కాజ్‌గిరి డివిజన్ డిప్యూటి డిస్ట్రిక్ట మెడికల్ హెల్త్ ఆఫీసర్ డా.ఆనందర్, ప్రోగ్రాం అధికారులు డా. రఘునాథస్వామి, డా.సంధ్య డా. సరస్వతి, శేషు పద్మ తదితరులు పాల్గొన్నారు

ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎంబీబీఎస్ విద్యార్థికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-నాగోల్

హైదరాబాద్‌లోని బండ్లగూడ ఖాళీ మందిర్ ప్రాంతం, పేద కుటుంబానికి చెందిన ఎంబీబీఎస్ విద్యార్థి ఫైనల్ ఇయర్ చదువుతున్న ప్రసన్న కుమార్‌కు ఉప్పల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్, ఉప్పల్ ఫౌండేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస గుప్త ఆర్థిక సహాయం అందించారు. శనివారం నాగోలులోని ఉప్పల శ్రీనివాస గుప్త నివాసానికి వచ్చిన ప్రసన్నకుమార్ ఆయన తల్లి జ్యోతిలు ఉప్పల శ్రీనివాసగుప్తను కలిసి తమ చదువు కోసం ఆర్థిక సహాయాన్ని చదువుకోవాలని శ్రీనివాస గుప్తాను కోరారు.వెంటనే స్పందించిన శ్రీనివాస గుప్తా వారి ఆర్థిక పరిస్థితులను తెలుసుకుని రూ.10 వేలు ఆర్థిక సహయం అందజేశారు.అనంతరం శ్రీనివాస గుప్తా మాట్లాడుతూ ప్రసన్నకుమార్‌కు గతంలో కూడా చదువుల కోసం ఆర్థిక సాయం అందించినట్టు గుర్తు చేశారు.ఆయన ఎంబీబీఎస్ కోడ్స్ ఇంటెన్సీ కోసం ఆర్థిక సహాయం కోరగా రూ.10 వేలు నగదు అందజేశారు.ఈ సహాయం అందించిన శ్రీనివాసగుప్తకు కృతజ్ఞతలు తెలిపారు.

షీర్ కుర్మా పంపిణీ



నవతెలంగాణ-చైతన్యపురి

ముస్లింల పవిత్ర పండుగ రంజాన్ ముసిగిన అనంతరం ఆరు రోజుల పాటు నిర్వహించే శవ్వాల్ ఒక్క పొద్దు ముగింపు సందర్భంగా శనివారం మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్ సీనియనర్ మైనార్టీ ఉద్యమ నాయకులు మహమ్మద్ సలీం ఆధ్వర్యంలో కొత్తపేట చౌరస్తాలో షీర్ కుర్మా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ బొగ్గారపు దయనంద్ గుప్త, సరూర్‌నగర్ డివిజన మాజీ అధ్యక్షులు ఐ.అంకిరెడ్డి, హాజీరై షీర్ కుర్మా పంపిణీ చేశారు.అనంతరం మహమ్మద్ సలీం మాట్లాడుతూ గత 12 ఏండ్లుగా శవ్వాల్ ఒక్క పొద్దు సందర్భంగా షీర్ కుర్మా పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు గిరి, సరూర్ ఇస్మాయిల్ బాయ్, రిషి, ఎండి.జహంగీర్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు దేశంలోనే ఆదర్శం

ఎమ్మెల్యే అహ్మద్ పాషా ఖాద్రీ



నవతెలంగాణ-సంతోష్ నగర్

సంక్షేమ పథకాలు దేశంలోనే ఆదర్శమని ఎమ్మెల్యే అహ్మద్ పాషాఖాద్రీ అన్నారు. లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను యాకుత్‌పురా నియోజకవర్గం ఐఎస్ సదన్ డివిజన్ కార్పొరేటర్ శ్వేతా మధుకర్‌రెడ్డిలతో కలిసి పంపిణీ చేశారు. శనివారం సైదాబాద్ మండలం పరిధిలోని సంతోష్‌నగర్, ఐఎస్ సదన్ డివిజన్ కాలనీకి చెందిన కుటుంబాలకు కూడా చెక్కులు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండ్లిడు కొచ్చిన ఆడపిల్లలు తల్లిద ండ్రులకు భారం కాకూడదనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ షాదీముబారక్, కల్యాణ లక్ష్మి పథకాలను ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. బడుగు, బలహీన వర్గాల, వృత్తుల వారీగా అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతోందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘట్‌కేసర్ అభివృద్ధికి కృషి

- మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లిపావని జంగయ్యయాదవ్



నవతెలంగాణ-ఘట్‌కేసర్

ఘట్‌కేసర్ మున్సిపల్ అభివృద్ధి లక్ష్యంగా కృషి చేస్తున్నట్టు మున్సిపల్ చైర్ పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా ఘట్‌కేసర్ మున్సి పల్ కార్యాలయంలో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశానికి చైర్‌పర్సన్ అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఘట్‌కేసర్ మున్సిపాలిటీ అభివృద్ధికి పాలకవర్గం తీర్మానంలో నిధులు కేటాయిం చినట్టు తెలిపారు. ఈ మున్సిపాల్టీలోని వార్డుల్లో తాగునీరు నూతన పైప్‌లైన్ కోసం, నూతన మోటర్ మరమ్మతుల పనులకు రూ. 57 లక్షలు, నాలా సంరక్షణకు రూ.12 లక్షలు, హరిత వనం పెంపొందించేందుకు రూ. 15 లక్షలు, డ్రయినేజీ నిర్మాణ పనులకు రూ.26 లక్షలు, సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.10లక్షలు, బీటీరోడ్డుకు రూ.12 లక్షలు, చెత్త వాహనాల మరమ్మతులకు రూ. 8 లక్షలు, ప్రజల మరుగుదొడ్ల నిర్మాణానికి రూ. 2.40 లక్షలు, కొండాపూర్ శ్మశాన వాటిక నిర్మాణానికి రూ. 25 లక్షలు, ఫోగ్గింగ్ మిషన్ కోసం రూ.5. లక్షలు, మొత్తం రూ. కోటి 40 లక్షల నిధు లకు ఆమోదిం చినట్టు తెలిపారు. మున్సిపాలిటీ కోసం తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకురా మల్లారెడ్డి సహకారంతో మరింత అభి వృద్ధి చేస్తామని హామీని చ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మెన్ పలుగుల మాధవరెడ్డి, కమిషనర్ వేమణ రెడ్డి కౌన్సిలర్లు చందుపట్ల వెంకటరెడ్డి కొమ్ము గోని, రమాదేవి, బొక్క సంగీత, బండారు ఆంజనేయులుగౌడ్, కొమ్మిడి అను రాధ, నస్రీన్ సుల్తానా, బర్ల శశికళ, కడుపొల్లా మల్లేష్, మేకల పద్మారావు, ఎస్.కె జహంగీర్, బండారు వసంత, నరేష్ యాదవ్, బేతల నర్సింగ్‌రావు, కుతాది రవీందర్, కో ఆప్షన్ సభ్యులు బొట్టు అరుణ, ఎస్.కె షౌకత్, మున్సి పల్ మేనేజర్ అంజిరెడ్డి, ఏఈ నరేష్, వర్క్ఇన్‌స్పెక్టర్లు గణేష్ మారుతి, రాకేష్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

ఇండ్లలోకి చేరుతున్న వరదనీరు





- విన్నవించుకున్నా పట్టించుకోని అధికారులు
- రెండోవార్డుకు నిధులు కేటాయించాలి
- డ్రయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలి : మున్సిపల్ కౌన్సిలర్ నిరసన

నవతెలంగాణ-ఘట్‌కేసర్

డ్రయినేజీ వ్యవస్థ బాగా లేకపోవడంతో వరద నీరు ఇండ్లలోకి చేరి, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నా చైర్ పర్సన్ స్పందించకపోవడం బాధకమరని ఘట్‌కేసర్ మున్సిపల్ రెండో వార్డు కౌన్సిలర్ కొమ్మగోని రమాదేవి అన్నారు. శనివారం డ్రయినేజీ వ్యవస్థ బాగు చేయాలని మున్సిపల్ కార్యాలయం ఎదుట బైటాయించి నిరసన తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గత మూడేండ్లుగా మున్సిపల్ పరిధిలోని రెండోవ వార్డు ఎన్ఎఫ్‌సి నగర్‌లో డ్రయినేజీ వ్యవస్థ ధ్వంసమై వరద నీటితో ఇండ్లు మునిగిపోతున్నాయనీ, మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్లకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదన్నారు. వరద నీరు ఇండ్లలోకి చేరుడంతో కాలనీవాసులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పావని జంగయ్య యాదవ్ తమ వార్డుకు నిధులు కేటాయించకుండా, వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. తనకు అనుకూలంగా ఉన్న కౌన్సిలర్లు, వార్డులకు మాత్రమే నిధులను కేటాయిస్తున్నారనీ, నిలదీసి అడిగిన వారిని దూరం పెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు, డ్రయినేజీ నిర్మాణ పనులు చేపట్టేందుకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేనియేడల ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

కౌన్సిలర్లు అందరూ సమానమే

ఘట్‌కేసర్ మున్సిపల్ పరిధిలోని ఎన్ఎఫ్సీ నగర్ రెండోవార్డు కౌన్సిలర్ కొమ్ముగోని రమాదేవిపై తనకు ఎలాంటి వ్యక్తిగత కక్ష లేదు. ఈ మున్సిపల్ పరిధిలో ఉన్న 18 మంది కౌన్సిలర్లు సమానమే. అన్నివార్డుల్లో అభివృద్ధి పనులు చేస్తున్న. రెండో వార్డులోనే డ్రయినేజీ నిర్మాణ పనులకు రూ.కోటి అరవై లక్షల నిధులు మంజూరు కాగా, రూ.కోటితో అభివృద్ధి పనులు చేపట్టగా, మిగతా పనులు త్వరలోనే పూర్తి చేస్తాం. గత ముప్పై ఏండ్లుగా వదర నీరు ఇండ్లలోకి వస్తుంది. ఈ వార్డులో రోడ్లు ఎత్తుగా ఉండి, ఇండ్లు డౌన్‌లో ఉండటంతో ఈ సమస్యల నెలకొంటుంది. మున్సిపల్ అభివృద్ధే లక్ష్యంగా అన్ని వార్డుల్లో ప్రతీ సమస్య పరిష్కరిస్తాం.

చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్

క్రీడలతో మానసిక ఉల్లాసం

- బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి



నవతెలంగాణ-బడంగ్‌పేట్

క్రీడలు మానసికోల్లాసంతో పాటు, శారీరక ధృఢత్వం పెంపొందుతోందని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. శుక్రవారం మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మల్లాపూర్‌లో నిర్వహించిన 'ఖేలో మహేశ్వరం జీతో మహేశ్వరం టోర్నమెంట్'లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ క్రీడారంగాల్లో రాణించాలంటే నిరంతనం సాధన చేయాలని క్రీడాకారులకు సూచించారు.అనంతరం గెలుపొందిన ప్రథమ లేమురు క్రీడాకారులకు రూ.55,500, ద్వితీయ బహుమతి పొందిన మల్లాపూర్ క్రీడాకారులకు రూ.10వేల నగదుతో పాటు కప్పులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి, కార్పొరేటర్లు బండారి మనోహర్, నేనవత్ బాలు నాయక్, నాయకులు ప్రవీణ్, రియసత్, నిర్వాహకులు టిల్లు తదితరులు పాల్గొన్నారు.



అధ్యాయనంతోనే నూతన పరిశోధనలు సాధ్యం

- సాంకేతిక పరిజ్ఞానంతో ముందుకెల్దాం
- ఇన్ఫోసిస్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ జగదాంబ

నవతెలంగాణ-ఘటకేసర్

విద్యార్థులు నిత్యం అధ్యాయనంతోనే నూతన పరిశోధనలు సాధ్యమవుతోందని ఇన్ఫోసిస్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ జగదాంబ అన్నారు. ఘటకేసర్ మండలం చౌదరిగూడ గ్రామ పరిధిలోని నల్ల నర్సింహరెడ్డి, ఇంజినీరింగ్ కళాశాలలోని ఐఐఐసి, ఐఐసి సౌజన్యంతో శనివారం నిర్వహించిన 'హ్యాకనాథ్ కార్యక్రమం'లో కళాశాల డైరెక్టర్ సి.వి, కృష్ణారెడ్డితో కలసి జ్యోతి ప్రజ్వాలన చేసి, ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతనంగా సాంకేతిక రంగంలో వచ్చి ఆర్టిఫిషల్ ఇంటలిజెంట్స్‌తో పెను మార్పులు సంభవిస్తున్నాయని గుర్తుచేశారు. విద్యార్థులు అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ముందుకు సాగాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్ఆర్ఎన్ సొల్యూషన్ జనరల్ మేనేజర్ టి. ధీరజ్ రెడ్డి, ఈఏబిబిబి డైరెక్టర్ ఎం.విజయ్ కుమార్‌రెడ్డి, కళాశాల వైస్ చైర్మన్ నల్ల ప్రశాంత్ రెడ్డి, కార్యక్రమం కన్వీనర్ జనార్ధన్ రాజు, కో-కన్వీనర్ రామేశ్వరయ్య, రవిచంద్ర పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు భరోసా



నవతెలంగాణ-హయత్ నగర్

సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు భరోసానిస్తుందని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుదీర్‌రెడ్డి అన్నారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని మధురనగర్ కాలనీకు చెందిన నర్రి సాయిచరణ్ అనారోగ్య సమస్యలతో ప్రయివేట్ వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా, మంజూరైన నిధులు రూ.2లక్షలు ఎల్‌వోసి చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మాన్సూరాబాద్ డివిజన్ అధ్యక్షులు జక్కిడి మల్లారెడ్డి, మాజీ అధ్యక్షులు టంగుటూరి నాగరాజు, జగదీష్, ప్రసాద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ అస్తవ్యస్తం.. రాకపోకలకు అంతరాయం



నవతెలంగాణ-సంతోష్‌నగర్

యాకుత్‌పురా నియోజకవర్గం సంతోష్‌నగర్, కుర్మగూడ, ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని ధోబి ఘాట్ చౌరస్తా తుల్జా భవాని వైన్స్ సమీపంలో ఓ రెస్టారెండ్ నుంచి డ్రయినేజీ మురుగు ఏరులై పారుతోంది.రోడ్డు బాగాలేక, నిత్యం ట్రాఫిక్ జాం ఏర్పడుతోంది. కూడలిలో వాహనాల రాకపోకల సమయంలో కొన్ని వాహనాల అస్తవ్యస్థంగా మారడంతో కాలనీవాసులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బాహ్యవలయ రహదారి సర్వీసు రోడ్డు నుంచి భారీ వాహనాలు అకాడమీ కూడలిలో, నగరం వైపు, సికింద్రాబాద్ మలకపేట సైదాబాద్ ఐఎస్ అదన్ చౌరస్తా నుంచి శ్రీశైలం,అచ్చంపేట, కల్వకుర్తి బాలాపూర్, నాగర్గుల్, చంద్రాయణగుట్ట, కడ్తాల్ పహాడీ షరీఫ్, ఓవైసీ చౌరస్తా రహదారిపైకి వెళ్లే సమయంలో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుంది. ఈ వాహనాలను ఆగకుండా మీర్ చౌక్ ట్రాఫిక్ సీఐ ప్రమోద్ కుమార్, ఆధ్వర్యంలో ఎస్ఐ గణేష్ సహకారంతో ఏలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు చేపడుతున్నారు. కూడలిలో వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా విధులు నిర్వర్తిస్తున్నారు. కానీ పోలీసు ఉన్నతాధికారులు స్పందించి కూడలిలో ట్రాఫిక్‌ను అంతరాయం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు. డ్రయినేజీ, రోడ్ల మరమ్మతు చేయాలని వైన్స్ వద్ద ట్రాఫిక్ లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



కాలనీ సమస్యలు పరిష్కరిస్తాం

- పబ్లిక్ కాంటాక్ట్ ప్రోగ్రాం ద్వారా సమస్యలను గుర్తిస్తాం
- ఆయాశాఖల అధికారులకు సూచనలు చేయనున్న ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-సంతోష్‌నగర్

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు కాలనీలవారీగా గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని సైదాబాద్ కార్పొరేటర్ కొత్త కాపు అరుణ రవీందర్‌రెడ్డి అన్నారు. శనివారం శంకేశ్వరబజార్లో నిర్వహించిన పబ్లిక్ కాంటాక్ట్ ప్రోగ్రాం కార్యక్రమానికి కార్పొరేటర్ ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడుతూ కాలనీల్లో నెలకొన్న సమస్యలు కాలనీవాసులు అధికారుల దృష్టికి తీసువస్తే, అక్కడ ఆ పనులు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కాలనీల్లో రోడ్ల మరమ్మతులు, విద్యుత్ తీగలతో ఇబ్బందులు లేకుండా బంచ్ పవర్ కేబుళ్లను ఏర్పాటు చేయాలని, చెట్ల కొమ్మల తొలగింపు, శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాలు తొలగించి, వాటి స్థానంలో నూతన స్తంభాలు ఏర్పాటు చేయాలని ఆయా శాఖ అధికారులకు సూచించారు కాలనీ, బస్తీవాసులు సమస్యలను అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ వెంకన్న, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, స్ట్రీట్ లైట్స్ అధికారి శ్రీనివాస్, జల మండలి మేనేజర్ శ్రవణ్ కుమార్, వర్క్ఇన్‌స్పెక్టర్ మనోహర్, సూపర్‌వైజర్ సలావుద్దీన్, హార్టికల్చర్ అధికారి మధు, సైదాబాద్ ఎస్ఐ మమత, పాల్గొన్నారు.

నేడు కానిస్టేబుల్ పరీక్ష



ఒత్తిడికి లోను కాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలి

ఫిజికల్ డైరెక్టర్ నందు లాల్‌నాయక్

నవతెలంగాణ-చైతన్యపురి

నేడు కానిస్టేబుల్ పరీక్షలకు విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి గురికాకుండా, పరీక్షలు ప్రశాంత వాతావరణంలో రాయాలని ఫిజికల్ డైరెక్టర్ నందు లాల్‌నాయక్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ కటోర సాధన చేస్తూ పుస్తకాలతో కుస్తీ పడుతూ వచ్చారని అన్నారు. ఈ పరీక్షకు ఎలాంటి ఒత్తిడి గురికాకుండా రాస్తే ఉద్యోగం సాధించవచ్చని తెలిపారు. పరీక్షా సమయానికి ముందుగానే పరీక్షా హల్‌కు చేరుకోవాలని సూచించారు. రాయబోతున్న మెయిన్స్ ఎగ్జామ్‌కు తడబడకుండా సమయాన్ని వృథా చేసుకోకుండా ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాసి, అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని కోరారు.

కల్యాణలక్ష్మి ఆడపడుచులకు వరం

- ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల



నవతెలంగాణ-సంతోష్‌నగర్

పేదింటి ఆడపడుచులకు కల్యాణలక్ష్మి వరమని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల అన్నారు. శనివారం మలక్‌పేట నియోజక వర్గం పరిధిలోని వివిధ డివిజన్ కాలనీ 17 మంది లబ్దిదారులకు కల్యాణ లక్ష్మి, షాదిముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద కుటుంబాల్లోని ఆడపిల్లల వివాహం తల్లిదండ్రులకు భారం కాకూడదనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల ద్వారా ఆర్థిక సహాయం అందజేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్య క్రమంలో గ్రామం, మండల ప్రజా ప్రతినిధులు నాయకులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమానికి కృషి

- ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల
- సాలార్ కుట్టు మిషన్లు పంపిణీ



నవతెలంగాణ-సంతోష్‌నగర్

ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ, వారి సంక్షేమానికి కృషి చేస్తామని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల అన్నారు. చంచల్గూడలో జరిగిన కార్యక్రమంలో ఉచితంగా సాలర్ కుట్టు మిషన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సుమారు 35 మందికి ఉచితంగా కుట్టు మిషన్లను పంపిణీ చేసినట్టు చెప్పారు. మహిళలకు స్వయం ఉపాధి అవ కాశాలు కల్పించడానికి తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఉచితంగా కుట్టు మిషన్లు అందినట్టు వెల్లడించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సయ్యద్ మినాజుద్దీన్, అలీం పాల్గొన్నారు.

ఐకేపీ,వీవోఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

- సీఐటీయూ బాలాపూర్ మండలాధ్యక్షులు దాసరి బాబు



నవతెలంగాణ-బడంగ్‌పేట్

ఐకేపి, వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ సీఐటీయూ బాలాపూర్ మండల అధ్యక్షులు దాసరి బాబు, కన్వీనర్ పెంటయ్యల డిమాండ్ చేశారు. శనివారం బాలాపూర్ మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జనార్ధన్‌రావుకు సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐకేపీ, వీఓఏలను సర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మిక చట్టం ప్రకారం నెలకు రూ.26 వేల వేతనం ఇచ్చి, రూ.10 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. సీనియారిటీ ప్రకారం సీసీలుగా ప్రమోషన్ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వీవోఏ డిమాడ్లను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మల్లికార్జున్ పాల్గొన్నారు.

మద్యం మత్తులో ఇద్దరు వ్యక్తుల హల్‌చల్

- పోలీసుల విధులకు ఆటకం
- అరెస్టు చేసిన వనస్థలిపురం పోలీసులు



నవతెలంగాణ-వనస్థలిపురం

మద్యం మత్తులో విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులపై దుర్భాసులాడుతున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులకు తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. వనస్థలిపురం సీఐడీ జలేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం బీఎన్‌రెడ్డి డివిజన్ పరిధిలోని ఎస్‌కేడి నగర్ డీపీఎస్ స్కూల్ గ్రౌండ్‌లో కొంతమంది మద్యం తాగి చుట్టుపక్కల నివసిస్తున్న వారి నిద్ర భగం కలిగిస్తున్నారనీ 100కు ఫోన్ చేసి, ఫిర్యాదు చేశారు. సమాచారం అందు కున్న స్థానిక పోలీసులు ఆ రాత్రి విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ వీరేందర్ రెడ్డి, ఎస్‌పీవోపి రాములు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. కొంతమంది వ్యక్తుల్లో ఇద్దరు వ్యక్తులు బి.రుత్విక్‌రెడ్డి, కె సాయి కుమార్‌లో దుర్భాషలాడుతూ విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులపై విలక్షణారహితంగా మాట్లాడటంతో వారిని అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ తెలిపారు.

ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



జిల్లెల రవి యాదవ్

నవతెలంగాణ-మల్కాజిగిరి

ఉచిత వైద్య శిబిరాన్ని అందరూ ఉపయోగించు కోవాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రచార కార్యదర్శి జిల్లెల రవి యాదవ్ కోరారు. ఆదివారం హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో స్థానిక కపా కాంప్లెక్స్ ఎల్బీనగర్ కమ్యూనిటీ హాల్ వద్ద ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి మధ్యప్రదేశ్ ఇంచార్జ్ మురళీధర్ రావు పాల్గొంటారని రవి యాదవ్ తెలిపారు.

రోడ్ల నిర్మాణానికి కార్పొరేటర్ శ్రీదేవి హామీ

నవతెలంగాణ-కాప్రా



చర్లపల్లి డివిజన్ పరిధిలోని రెడ్డి కాలనీ అసోసియేషన్ సభ్యులు స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్‌ని రెడ్డి కాలనీలోని వారి స్వగృహంలో కలిసి కాలనీ సమస్యలపై వివరించారు. కాలనీలో కొన్ని రోడ్లు మరియు డ్రైనేజీ పైప్ లైన్లు వేయాలని కోరడంతో కార్పొరేటర్ స్పందించారు. నూతన రోడ్లకు ఇంతకు ముందే అధికారులకు తెలియజేశానని రాబోయే విడతలో మంజూరు అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆధ్యక్షులు రంగారెడ్డి,వెంకట్ రాంరెడ్డి,సురేందర్ రెడ్డి,తిరుపతి రెడ్డి, కొండల్ రెడ్డి,భూం రెడ్డి,సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అందుబాటులో బస్తి దవాఖానాలు ఏర్పాటు

రాష్ట్ర కార్మిక ఉపాధి కల్పన శాఖ మంత్రి మల్లారెడ్డి

నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్



పేదలకు వైద్యం అందుబాటులో ఉండేందుకే ప్రభుత్వం బస్తి దవాఖానాలు ఏర్పాటు చేస్తోందని రాష్ట్ర కార్మిక ఉపాధి కల్పన శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు.శనివారం దమ్మాయిగూడ మున్సిపాలిటీ 18వ వార్డ్ ఓల్డ్ విలేజ్ లో నూతన బస్తి దవాఖానాను మంత్రి తో కలిసి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, దమ్మాయిగూడ మున్సిపల్ చైర్ పర్సన్ వసూపతి ప్రణీత శ్రీకాంత్ గౌడ్ ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ పేద ప్రజలకు మెరుగైన వైద్యం మరింత చేరువ చేయాలనే సంకల్పంతో బస్తి దవాఖానాలను మున్సిపాలిటీలలో ప్రతి వార్డులో, డివిజన్లలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మాదిరెడ్డి నరేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ స్వామి, డిఈఈ సుమతి, కౌన్సిలర్లు నాను నాయక్, నాగయపల్లి సుజాత, కొత్త హేమలత, మంగళపూరి వెంకటేష్, కొత్త సురేఖ, మాదిరెడ్డి పావనిరెడ్డి, సంపంన్ బోల్ స్వప్న, గురువెల్లి వెంకటరమణ, పాండాల అనురాధ, వసుపతి రమేష్ గౌడ్ ,మాదిరెడ్డి నరసింహారెడ్డి, మోర మౌనిక,రామారం శ్రీహరి గౌడ్, కోఆప్షన్ సభ్యులు, వహీదా బేగం బిఆర్ఎస్ దమ్మాయిగూడ మున్సిపల్ అధ్యక్షుడు కౌకుంట్ల తిరుపతి రెడ్డి, ప్రధానకార్యదర్శి సంపన్న బోల్ హరి గౌడ్, నాయకులు వసుపతి శ్రీకాంత్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల పోరాటాలకు స్ఫూర్తి మేడే



నవతెలంగాణ-నాచారం

కార్మిక ఉద్యమాలకు పోరాట స్ఫూర్తి మేడే అని సివిల్ సప్లై హమాలీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు చిగుళ్ల శ్రీనివాస్ (హమాలి శీను) అన్నారు. శనివారం హమాలీ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులు పోరాడి సాధించుకున్న సందర్భంగా మేడే ఉత్సవాలు జరుపుకుంటారని పేర్కొన్నారు. 12 గంటల పని విధానానికి స్వస్తి పలికి 8 గంటల పని విధానం అమలుతోపాటు కార్మిక హక్కులు, చట్టాలను సాధించుకున్న కార్మిక వర్గం పండుగ రోజు మేడే అన్నారు. రాష్ట్రంలో కార్మిక హక్కులను, చట్టాలను అమలు చేస్తూ కార్మికుల పక్షపాతిగా ముఖ్యమంత్రి కేసీఆర్ నిలుస్తున్నారని కొనియాడారు. హమాలీ కార్మికుల హక్కులను అడిగిందే తరువాయిగా నెరవేర్చుతూ శ్రమజీవుల కష్టాన్ని తెలిసిన వ్యక్తి కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి కొనసాగడం మంచి పరిణామం అన్నారు. కార్మిక నాయకుడిగా సివిల్ సప్లై సంస్థ చైర్మన్ రవీందర్ సింగ్ నేతృత్వంలో ముఖ్యమంత్రి సహకారంతో హమాలీ కార్మికులు ఆకాంక్షలు నెరవేరుస్తూ సంస్థను సమర్థవంతంగా ముందుకు తీసుకు పోవడంలో హమాలీ కార్మికుల కృషి మరవరానిదని కొనియాడారు. కార్మికుల హక్కుల దినోత్సవం రోజు అందరం ఐక్యంగా మేడే ఉత్సవాలను జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఈఎస్ఐ బోర్డు డైరెక్టర్ వేముల మారయ్య, సివిల్ సప్లై హమాలీ యూనియన్ రాష్ట్ర నాయకుడు శివకుమార్, బీఆర్‌టీయూ రాష్ట్ర నాయకుడు రూప్‌సింగ్, పి.నారాయణ, సాయికుమార్, హమాలీ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టిఐ రాష్ట్ర ఇన్‌చార్జిగా బొట్టు ప్రభాకర్ నియామకం



నవతెలంగాణ -కంటోన్మెంట్

సమాచార హక్కు కార్యకర్తల(ఆర్‌టీఐ) తెలంగాణ రాష్ట్రానికి ఇంచార్జ్‌గా కంటోన్మెంట్ బి ఆర్ ఎస్ సీనియర్ నాయకుడు ఉద్యమకారుడు బొట్టు ప్రభాకర్ నియమితులయ్యారు ఈ మేరకు ఆర్టి ఐ వ్యవస్థాపక అధ్యక్షులు ముత్తు ప్రభాకర్ కు నియమాంక పత్రాన్ని అందజేశారు ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో సమాచార హక్కు కార్యకర్తల సంఘ రాష్ట్ర ఇన్చార్జిగా నియమించినందుకు కృతజ్ఞతలు చెప్పారు

పెరాలసిస్ బాధితురాలికి బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ సాయం

నవతెలంగాణ-కాప్రా



మీర్ పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని బక్షిగూడకు చెందిన తెలంగాణ ఉద్యమకారురాలు రత్నమాల పెరాలసిస్ వ్యాధితో బాధపడుతుంది. విషయం తెలుసుకున్న బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి ఆదేశానుసారం చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి గుమ్మడి జంపాల్ రెడ్డి ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అనేక సేవా, సామాజిక కార్యక్రమాలు చేపడుతున్నట్లు, డివిజన్ పరిధిలోని ఎవరికి ఏ కష్టం వచ్చినా అండగా ఉంటామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దూసరి నవీన్ గౌడ్, హరి, గోపాల్ గౌడ్, మాల రాములు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువత స్వయం ఉపాధి రంగాలపై దృష్టి పెట్టాలి

యూత్ కాంగ్రెస్ నాయకుడు నెమలి అనిల్

నవతెలంగాణ-నాచారం



నిరుద్యోగ యువత ఉపాధి రంగాలపై దృష్టి పెట్టాలని యూత్ కాంగ్రెస్ నాయకుడు నెమలి అనిల్ అన్నారు. శనివారం సూర్య నగర్ కాలనీలో శ్రీ గణేష్ టిఫిన్ సెంటర్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగం రోజురోజుకు పెరిగిపోతుందని ఉన్నత చదువులు చదివిన నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం పరీక్షలు రాస్తే పేపర్లు లీకేజీ కొలువు వచ్చే పరిస్థితి లేదన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ గణేష్ టిఫిన్ సెంటర్ నిర్వాహకుడు చిన్న, స్థానిక యువకులు ప్రతాప్, హరి, అనిల్ పాల్గొన్నారు.

జేవీవీ వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరంలో ఓరిగామి, కూచిపూడి నాట్యంలో శిక్షణ



నవతెలంగాణ-కాప్రా

జనవిజ్ఞాన వేదిక నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం లో నాల్గవ రోజు ఓరిగామి లో శివ ప్రసాద్ కూచిపూడి నాట్యంలో కుమారి జడల శివాని శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో న్యూస్ పేపర్, పేపర్ గ్లాస్ లను ఉపయోగించి వివిధ రకాల టోపీలను, పేపర్ బ్యాగులను,పేపర్ సూట్కేసులను తయారు చేయడం, రకరకాల పువ్వులను, బొమ్మలు తయారుచేయడం వంటివి నేర్పించారు. ఈ సందర్భంగా శివ ప్రసాద్ , కుమారి జడల శివాని మాట్లాడుతూ నాట్యం అనేది ప్రతి వ్యక్తికి అవసరమని నాట్యం ఏకాగ్రతను పెంచుతుందని, మన శరీరానికి మంచి వ్యాయామంగా పనిచేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కప్రా మండల ఉపాధ్యక్షులు జెన్నీ, శివ శంకర్ రెడ్డి, వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి సీఐటీయూ పోరాటం

నవతెలంగాణ-నేరేడ్‌మెట్



మౌలాలి పారిశ్రామిక ప్రాంతం (ఐలా)లో పని చేస్తున్న పారిశుధ్య కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ నిరంతరం పని చేస్తుందని సీఐటీయూ మల్కాజిగిరి మండల కార్యదర్శి బంగారు నర్సింగరావు అన్నారు. కాంట్రాక్ట్ వర్కర్స్ సీఐటీయూలో చేరుతున్న సందర్భంగా ఎస్టేట్‌లో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సీఐటీయూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సహాయ కార్యదర్శి జి.శ్రీనివాసులు హాజరై సీఐటీయూ సభ్యత్వాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులందరికీ ఈఎస్ఐ, పీఎఫ్‌తో పాటు కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. జీహెచ్ఎంసీ, మున్సిపల్ వర్కర్స్‌కు ఇస్తున్న విధంగా ఐలాలో పని చేస్తున్న వర్కర్స్‌కు కూడా జీతాలు ఇవ్వాలలనీ, వారిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ వర్కర్స్ కు ఇస్తున్నట్టుగానే సబ్బులు, షాంపూలు, బ్లౌజులు, మాస్కులు అందజేయాలనీ, పండుగ సెలవులు అమలు జరపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐలా మౌలాలి ఇండస్ట్రియల్ (ఐడిఏ) స్వీపర్ కాంటాక్ట్ వర్కర్స్ ఉపేందర్ , జాదవ్, మల్లేష్, అంకమ్మ, రిజ్వానా బేగం, నిర్మల, అనసూయ, యాదమ్మ, దేవమ్మ, నాగమ్మ, మరియతోపాటు, మంగ తదితరులు పాల్గొన్నారు.

మహమూద్ అలీతో మాజీ మేయర్ భేటీ



నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ రాష్ట్ర హెూంశాఖా మంత్రి మహమూద్ అలీ ని మాజీ మేయర్ బొంతు రాంమోహన్ ,మాజీ కంటోన్మెంట్ ఇంచార్జ్ గొల్లూరి అంజయ్య మర్యాదపూర్వకంగా కలిశారు . సోమవారం ఉప్పల్ మేకల భారతి గార్డెన్స్ లో జరుగబోయే ఈద్-ఎ-మిలాద్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర హెూంశాఖామంత్రిని ఆహ్వానించారు మాజీ మేయర్ బొంతు రాంమోహన్, బీఆర్ఎస్ మాజీ రాష్ట్ర కార్యదర్శి గొల్లూరి అంజయ్య ,మాజీ కార్పోరేటర్ మేకల హనుమంత్ రెడ్డి .కార్యక్రమంలో నాయకులు గొల్లూరి రవి,గణేష్,శివ, జాన్,పాల్గోన్నారు.

కాప్రా డివిజన్‌లో ఇంటింటికీ సీపీఐ కరపత్రాల పంపిణీ



నవతెలంగాణ-కాప్రా

పెరిగిన నిత్యావసర సరుకుల ధరలు, గ్యాస్,పెట్రోల్, డీజిల్ ధరలు ప్రజలపై మరింత ఆర్థిక భారాన్ని కల్గిస్తున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్ అన్నారు. సీపీఐ ఉప్పల్ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో 'ఇంటింటికి సీపీఐ' కార్యక్రమంలో భాగంగా నాల్గవ రోజు కాప్రా డివిజన్ లోని కేసీఆర్ కాలనీ, భగత్ నగర్, సాయిలోక్ కాలనీలో కరపత్రాలను పంపిణీ చేశారు, సీపీఐ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరై, కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వి. ఎస్. బోస్ మాట్లాడుతూ ఈసారి మోడీ పతనం తప్పదని హెచ్చరించారు. ప్రజల వ్యక్తిగత విశ్వాసాలకు,ఆలోచనలకు అవకాశం లేకుండా ఏకపక్షంగా తాము చెప్పిందే వినాలి,తినాలి ,ఉండాలి అనే ఆలోచనతో బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. ఈ అత్యవసర పరిస్థితుల్లో దేశాన్ని రక్షించటం కోసమే సిపిఐ ప్రచార ఆందోళన కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఉప్పల్ నియోజకవర్గ కార్యదర్శి జీ.దామోదర్ రెడ్డి, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ధర్మేంద్ర, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్. శంకర్ రావు, సీపీఐ నియోజకవర్గ స్టీరింగ్ కమిటీ సభ్యులు లక్ష్మీ నారాయణ నర్సింహా....సీపీఐ నియోజకవర్గ నేతలు మిరియాల సాయిలు, యాదగిరి, కృష్ణ, ప్రమీల, ఆశాజ్యోతి, పద్మావతి, సుజాత, లోకేశ్వర్లతో పాటు పలువురు పాల్గొన్నారు.

తెలంగాణ జన సమితి బలోపేతానికి కృషి : దయాకర్

నవతెలంగాణ- నేరేడ్ మెట్:



తెలంగాణ జన సమితి మరింత బలోపేతానికి కృషి చేయాలని పార్టీ మేడ్చల్ జిల్లా కమిటీ జనరల్ సెక్రెటరీ ఏ. దయాకర్ పిలుపు నిచ్చారు. అల్వాల్‌లో తెలంగాణ జన సమితి ఐదవ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హజరైన ఆయన పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బూత్ స్థాయిలో తెలంగాణ జన సమితి బలోపేతంపై పార్టీ శ్రేణులు దృష్టి సారించాల న్నారు. ఈ కార్యక్రమంలో విష్ణుమూర్తి, రఘునాథ్, నరసింహ, పవన్ కుమార్ పాల్గొన్నారు.

వరద నీరు చేరిన ప్రాంతాల్లో నందికంటి శ్రీధర్‌పర్యటన

నవతెలంగాణ-మల్కాజిగిరి



ఈస్ట్ ఆనందభాగ్ డివిజన్లోని ఎన్ఎండిసి కాలనీలో శనివారం ఉదయం కురిసిన వర్షానికి డ్రైనేజీలు ఉప్పొంగుతూ ఇండ్లలోకి చేరాయి. ఈ విషయం తెలుసుకున్న డీసీసీ అధ్యక్షులు నందికంటి శ్రీధర్ వరద నీరు చేరిన ప్రాంతాన్ని పరిశీలించి నిద్ర మత్తులో ఉన్న అధికారుల తీరును ఎండగట్టారు. వర్షాలు కురిసిన ప్రతిసారీ ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు వరద నీరు ఇండ్లలో కి వస్తున్న వాటికి శాశ్వత పరిష్కారం చూపడములో అధికారులు విఫలమయ్యారని అన్నారు. ఆయన వెంట నాయకులు వెంకటేశ్ యాదవ్, గుత్తి రామచందర్ తదితరులు ఉన్నారు.

అకాల వర్షంతో అతలాకుతలం అవుతున్న ప్రజలు

నవతెలంగాణ-నాచారం



అకాల వర్షం అతలాకుతలం చేసింది. పగలు ఉక్క పోత రాత్రి కుండపోత వర్షంతో నాచారం, మల్లాపూర్ డివిజన్ లో శనివారం తెల్లవారుజామున కురిసిన వర్షంతో రోడ్లు జలమయ్యాయి. ముంచెత్తిన వరద నీరుతో డ్రైనేజీలు ఎక్కడికక్కడ స్తంభించి జనజీవనాన్ని అతలాకుతలం చేసింది. నాచారం ఈఎస్ఐ ఆసుపత్రి ప్రధాన గేటు వద్ద ఓపెన్ నాలా పొంగిపొర్లి ఆసుపత్రికి వెళ్లే రోగులకు వైద్యులకు ఇబ్బందికరంగా మారింది. నాచారం భవాని నగర్ ఏ రహదారి చూసినా పూర్తిగా వర్షపు నీటితో దర్శనమిచ్చింది. మల్లాపూర్ భవాని నగర్ లోతట్టు ప్రాంతం వరద నీరు ముంచెత్తి రహదారులు గోదారులను తలపించాయి. కుండపోత వర్షం కురిసిన కొద్దిసేపు అయినా ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. ఏ కాలనీలో చూసినా సీసీ రోడ్లు కావడంతో వరదనీరు ఒక్కసారిగా కాలనీలను ముంచెత్తి దిగువ ప్రాంతానికి ప్రవహించడానికి సమయం పట్టింది. ఉదయం కావడం ప్రజలు కార్యకలాపాలకు వెళ్లే సమయం కావడంతో ప్రజలు సతమతమయ్యారు.

ఘనంగా రేడియంట్ హై స్కూల్ టాపర్స్ డే వేడుకలు



నవతెలంగాణ-అడిక్‌మెట్

ముషీరాబాద్ రేడియంట్ హై స్కూల్ టాపర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నర్సరీ నుండి 10 వ తరగతులకు చెందిన 41 మంది విద్యార్థులకు ఒరిజినల్ వెండి మెడల్స్‌ను అందజేశారు. 100 శాతం అటెండెన్స్ ఉన్న విద్యార్థులకు కూడా మెడల్స్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సయ్యద్ అన్వరుల్లా భక్తియారి, ప్రిన్సిపాల్ సయ్యద్ అహ్మదుల్లా భక్తుయారి, అశ్ర ఫాతిమా, మంజూశ్రీ, అనిఫా, బీఆర్ఎస్ నాయకులు మహమ్మద్ ఖదీర్, జావేద్ ఖాన్, ఇమ్రాన్ ఖాన్, మహమ్మద్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి కార్పొరేటర్ శ్రీదేవి హామీ



నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి డివిజన్ పరిధిలోని రెడ్డి కాలనీ అసోసియేషన్ సభ్యులు స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్‌ని రెడ్డి కాలనీలోని వారి స్వగృహంలో కలిసి కాలనీ సమస్యలపై వివరించారు. కాలనీలో కొన్ని రోడ్లు మరియు డ్రైనేజీ పైప్ లైన్లు వేయాలని కోరడంతో కార్పొరేటర్ స్పందించారు. నూతన రోడ్లకు ఇంతకు ముందే అధికారులకు తెలియజేశానని రాబోయే విడతలో మంజూరు అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆధ్యక్షులు రంగారెడ్డి,వెంకట్ రాంరెడ్డి,సురేందర్ రెడ్డి,తిరుపతి రెడ్డి, కొండల్ రెడ్డి,భూం రెడ్డి,సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-కాప్రా

కుషాయిగూడ శ్రీ పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలో పాల్గొన్న స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు బాల్ రెడ్డి,రాజేశ్వర్ రెడ్డి, శ్రీకాంత్ యాదవ్ పాల్గొన్నారు.

ఎడ్ల సుధాకర్ రెడ్డికి పితృవియోగం

నవతెలంగాణ-అంబర్‌పేట



ఫైల్

అంబర్‌పేట బీఆర్ఎస్ ఇన్‌చార్జి ఎడ్ల సుధాకర్ రెడ్డి తండ్రి నారాయణరెడ్డి (87) శనివారం ఉదయం తుది శ్వాస విడిచారు. నారాయణరెడ్డి అంబర్ పేట నియోజకవర్గంలో పలు ఆలయాలకు పలువురు పేదలకు చాలా సహాయం చేశారు. నారాయణరెడ్డి మృతికి మాజీ రాజ్యసభ సభ్యులు వీహెచ్ హనుమంతరావు, అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, మాజీమంత్రి కృష్ణ యాదవ్, అంబర్ పేట కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు గరిగంటి రమేష్, పద్మ వెంకటరెడ్డితోపాటు పలువురు సంతాపం తెలిపారు. అంత్యక్రియలు అంబర్ పేట స్మశాన వాటికలో ఆదివారం జరుగుతాయని కుటుంబ సభ్యులు తదితరులు తెలిపారు.

'బెల్లి లలిత జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలి'

నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ గాన కోకిల, వెట్టి చాకిరినీ, సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడులను వ్యతిరేకిస్తూ, నిరంతరం మహిళల అభ్యున్నతి కోసం, బహుజన రాజ్యాధికారం కోసం, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం పాటుపడిన బెల్లి లలిత జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని ప్రజా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్‌అజయ్ కుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. బెల్లి లలిత ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పల్లె పల్లెలో పాటలు పాడుతూ పోరాడిన మహనీయురాలని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం యాదాద్రి భువనగిరి జిల్లాకు బెల్లి లలిత పేరు పెట్టాలనీ, జయంతిని అధికారికంగా నిర్వహించాలనీ, ట్యాంక్ బండ్ వద్ద లలిత విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ఘనంగా ఆర్మీ డెంటల్ సైన్సెస్ కళాశాల స్నాతకోత్సవం



నవతెలంగాణ-కంటోన్మెంట్

సికింద్రాబాద్ ఆర్మీ కాలేజ్ ఆఫ్ డెంటల్ సైన్సెస్ 17వ స్నాతకోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ ముఖ్య అతిథిగా హాజరై డెంటల్ సర్జరీలో 37 మంది విద్యార్థులకు బ్యాచిలర్ డిగ్రీలు, 13 మంది విద్యార్థులకు మాస్టర్స్ డిగ్రీలు ప్రదానం చేశారు. అనంతరం గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ గ్రాడ్యుయేట్లు వారి తల్లిదండ్రులను అభినందించారు. పేదలకు సేవ చేయడంలో తమ జీవితాలను అంకితం చేయాలన్నారు. విద్యార్థుల్లో అత్యాధునిక సౌకర్యాలను అందించి పరిశోధనలను ప్రోత్సహించినందుకు అధ్యాపకులను ఆమె అభినందించారు. మేజర్ జనరల్ రాకేష్ మనోచా, జనరల్ ఆఫీసర్ కమాండింగ్ తెలంగాణ, ఆంధ్ర సబ్ ఏరియా చైర్మన్ ఈ సందర్భంగా గవర్నర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేఎన్ఆర్ యూనివర్శిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాల సందర్శన



నవతెలంగాణ-అడిక్‌మెట్

అకస్మాత్తుగా కురిసిన భారీ వర్షానికి ముషీరాబాద్ నియోజకవర్గంలోని గాంధీనగర్ డివిజన్ లోతట్టు ప్రాంతాలు పూర్తిస్థాయిలో జలమయమయ్యాయి. వెంటనే డివిజన్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ అధికారులతో కలిసి లోతట్టు ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రజలకు నిత్యావసర సరుకులను అందజేశారు. ప్రజలను అధైర్య పడవద్దని సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రజలను అన్ని విధాలుగా ఆదుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు వినయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE II JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT: AT: HYDERABAD
O.S. No. 1757 OF 2023

Between:
Amogh Naik .....Plaintiff
AND
All Concerned & Another .....Defendants

To,

Whereas the above named plaintiffs has instituted the above case to declare the plaintiff's herein as the legal heirs of late Niketan Naik &late Smt. Neelima Naik. Any person having any right, claim, title or interest of any nature whatsoever may appear in this court in person or by a pleader duly instructed on 03-05-2023 at 10:30 a.m. to answer the claim. Take notice that in default of the appearance on that day, the case will be heard and determined in absence.

//By Order of the Court//
SURESH KUMAR BANG
SANCHIT KUMAR BANG
SHOBIT KUMAR BANG
ABHISHEK BALDWA
Advocates
Unit No.C-405 & 406, 4 th Floor ,Upasana, Ahuja Estate, 4-1-970, Abids, Hyderabad.
Ph.9246224332

IN THE COURT OF THE HONOURABLE II ADDL SENIOR CIVIL JUDGE, MEDCHAL-MALKAJGIRI DISTRICT AT MALKAJGIRI
SOP NO 21 OF 2023

Between
Smt. Erupula Sujatha (Nalla)W/o. Nalla Yadagiri (Late)D/o. Erupula Sathyamma (Late)Address: H.No.4-2-18, Ambedkar Nagar, near ward office,Nacharam, Uppal Mandal, Medchal-Malkajgiri District, T.S. ....Petitioner

1. South Central Railways Secunderabad Division Secunderabad
2. All concerned ..Respondents

It is to inform to the general public that my client Smt. Erupula Sujatha (Nalla) W/o. Nalla Yadagiri (late) and D/o. Erupula Sathyamma (Late), W/o. Erupula Krishna (Late) and D/o.Bandala Ramalah (Late)applied for succession certificate to the family pension of her mother Late Smt. Erupula Sathyamma, who worked as a senior parcel porter in South Central Railways, Secunderabad Division and died on dated 27-12-2021 leaving behind her daughter Erupula Sujatha, who is the only widow daughter.

Therefore, my client appeal to the General Public that any objection for issuing succession certificate to my client Smt. Erupula Sujatha, for family pension from the South Central Railways, Secunderabad Division, will be informed or mentioned with proof of documents within 30 days from the date of this publication. Otherwise Smt. Erupula Sujatha will be declared as legal-heir to obtain succession certificate from the above Honourable Court. Any objections received after due date will not be accepted and not entertained by the Honourbale Court at any cost.

By the order of Honourable 11 Addl Senior Civil Judge, Malkajgiri, Medchal-Malkajgiri
B. Venkata Swamy
Advocate
Regd. No.TS/274/2006
Cell No.9912315449, counsel For the Petitioner



రోగుల వార్డుల్లోకి వర్షపు నీరు

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

వర్షంతో ఈఎన్‌టీ హాస్పిటల్ ఇన్ పేషెంట్ వార్డుల్లోకి వర్షం నీరు వచ్చి చేరడంతో రోగులు వైద్య సిబ్బంది ఇబ్బందులకు గురయ్యారు. శనివారం తెల్లవారుజామున ఈదురు గాలులతో కూడిన భారీ (వర్షం) వానతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఈ నేపథ్యంలో కోఠి ఈఎన్‌టీ హాస్పిటల్‌లోని వార్డుల్లోకి వర్షంతోపాటు డ్రయినేజీ పొంగి నీరు వచ్చి చేరడంతో చికిత్స పొందుతున్న రోగులు, వైద్య సిబ్బంది ఇబ్బందులకు గురయ్యారు. దీంతో స్పందించిన వైద్య అధికారులు వెంటనే వార్డులోకి వచ్చిన వర్షపు నీరును ఆస్పత్రి సిబ్బందితో తొలగించారు.



రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో పోటీ

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

రానున్న తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో పోటీ చేసేందుకు సిద్ధం అవుతున్నామని ప్రజా ఏక్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు బోనాల శ్రీనివాస్ అన్నారు. శనివారం గౌలిగూడలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో వివిధ పార్టీల నేతలతో సమావేశమయ్యారు. మన శక్తి పార్టీ అధ్యక్షుడు శ్రీనాథ కృష్ణ. న్యు ఇండియా పార్టీ ఉపాధ్యక్షుడు ఎం.నర్సయ్యలతో పాటు ఇతర పార్టీ నాయకులతో సమావేశం అవుతున్నామనీ, త్వరలోనే తమ ఎజెండాను ప్రకటిస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని స్థానాల్లో తమ అభ్యర్థులను బరిలో నిలిపేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కె.రాధాకృష్ణ, ధర్మేందర్ తివారి, అభిజిత్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ హటావో దేశ్ బచావో..

- సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

బీజేపీ హటావో దేశ్ బచావో అనే నినాదంతో ఇంటింటికీ సీపీఐ కార్యక్రమం శనివారం నిజాం కళాశాల నుంచి మోజాహిం మార్కెట్ వరకు షాప్ టు షాప్ కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా సీపీఐ 26 రాష్ట్రాల్లో ఇంటింటికీ కార్యక్రమాన్ని చేపట్టమన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అవలంభి స్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, ఆకాశాన్ని అంటుతున్న పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారని చెప్పారు. నిరుద్యోగం, ప్రభుత్వ సంస్థలు ప్రయివేటుపరం, పబ్లిక్ సెక్టార్‌ను విధ్వంసం చేస్తున్నారన్నారు. రూ.10లక్షల కోట్ల వరకు కార్పొరేట్ వ్యవస్థలకు రాయితీనిచ్చి దేశ సంపాదనంతా దోచిపెడు తున్నారన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రభుత్వం ఎందుకు రైతులకు రూ.లక్ష కోట్ల రాయి తీని ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మతతత్వ శక్తుల నుంచి దేశాన్ని కాపాడుడటానికే మోడీ హటావో దేశ్‌కి బచావో అనే నినాదంతో ప్రజలను చైతన్య పరుస్తూ పోరాటాలను సీపీఐ కొనసాగి స్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కామ్రేడ్ ఈటి నరసింహ, సీపీఐ సీనియర్ నేత ప్రేమ్ పావని, జిల్లా కార్యదర్శి ఛాయదేవి, సహాయ కార్యదర్శులు కమతం యాద గిరి, స్టాలిన్, రాష్ట్ర సమితి సభ్యులు బి.వెంకటేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.మల్లేష్, కాంపల్లి శ్రీనివాస్, రాజ్ కుమార్, జెర్రిపోతుల కుమార్, కొమ్మెల్లి బాబు, ఆర్.బాలకృష్ణ, గ్యార నరేష్, చైతన్య కల్యాణ్, రాజు గౌడ్, మహిళా సమాఖ్య నాయకు రాలు చక్రి పాల్గొన్నారు.

అంబర్‌పేటలో భారీ వర్షం





- లోతట్టు ప్రాంతాలు జలమాయం
- సహాయక చర్యల్లో ఎమ్మెల్యే, కార్పొరేటర్లు, జీహెచ్ఎంసీ సిబ్బంది

నవతెలంగాణ-అంబర్‌పేట

పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తోంది. ఉదయం నుంచే కుండపోత వర్షం మొదలైంది. దీంతో చాలా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. అంబర్‌పేట, కాచిగూడ హిమాయత్‌నగర్, నారాయణగూడతో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం పడుతోంది. ఉదయం నుంచి ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన కుండపోత వర్షం కురుస్తుండటంతో రోడ్లన్నీ పూర్తిగా జలమయమయ్యాయి. రోడ్లు చెరువులను తలపిస్తుండటంతో వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. భారీ వర్షం నేపథ్యంలో అంబర్‌పేట, పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈదురుగాలుల వల్ల కరెంట్ సరఫరాను అధికారులు నిలిపివేశారు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. భారీ వర్షంతో రోడ్లన్నీ పూర్తిగా తడిసిముద్దయ్యాయి. పలుచోట్ల డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయి. చాలా చోట్ల చెట్లు కూలిపోయి విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో జీహెచ్ఎంసీ యంత్రాంగం అప్రమత్తమైంది. వెంటనే రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టింది. అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, బాగ్ అంబర్ పేట కార్పొరేటర్ పద్మా వెంకట్ రెడ్డి, నల్లకుంట కార్పొరేటర్ వై.అమృత, గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్, అంబర్ పేట కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్ సర్కిల్ 16 డిప్యూటీ కమిషనర్ వేణుగోపాలు టౌన్ ప్లాన్ ఏసీపీ సాయిబాబా, ఏంహెచ్ఓ జ్యోతిబాయ్ ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ సిబ్బంది లోతట్టు ప్రాంతాలు, బస్తీల్లో పర్యటించి రోడ్లు శుభ్రం చేస్తూ చెట్ల కొమ్మలు కొట్టేసి విద్యుత్ అధికారులతో కలిసి కరెంటు పునరుద్ధరించారు. పలువురు నాయకులు అధికారులు సహాయక చర్యలు చేపట్టారు.





మున్సిపల్ కార్మికులకు మేడేను సెలవు దినంగా ప్రకటించాలి

నవతెలంగాణ-మెహిదీపట్నం

మున్సిపల్ కార్మికులకు మేడేను సెలవు దినంగా ప్రకటించాలని (సీఐటీయూ) జీహెచ్ఎంసీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ నగర కార్యదర్శి మల్లేష్ డిమాండ్ చేశారు. మేడే రోజు కార్మికులకు సెలవు ఇవ్వకపోవడం శోచనీయ అన్నారు. ఈ మేరకు ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు లక్ష్మణ్, రాజు, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఎం స్కీంలో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బంది, డీఈవోల జీతాలు పెంచాలి



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

నేషనల్ హెల్త్ మిషన్ స్కీంలో ఏండ్లుగా పని చేస్తున్న డేటా ఎంట్రీ ఆపరేటర్లు, బస్తీ దావఖానాలో పని చేస్తున్న సపోర్టింగ్ స్టాఫ్, కాంటినెంజెంటీ వర్కర్లకు ఏండ్లుగా తీవ్ర అన్యాయం జరుగుతున్నదని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ అన్నారు. నేడు ఎన్‌హెచ్ఎం కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కోఠిలోని కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2018లో జీవో 510 విడుదలైన సందర్భంగా కొద్దిమంది పై స్థాయి కేటగిరీల వారికి మాత్రమే జీతాలు పెంచి కింది కేటగిరీల వాళ్లను విస్మరించారనీ, తద్వారా నాటి నుండి నేటి వరకు కూడా కిందిస్థాయి సిబ్బంది జీతాలు పెంచకుండా అధికారులు రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తుందన్నారు. జీవో 60 ప్రకారం బస్తీ దావఖానాలో పని చేస్తున్న సపోర్టింగ్ స్టాఫ్‌కు రూ.15, 600 రావాల్సి ఉన్నప్పటికీ కేవలం రూ.10 వేలు మాత్రమే చెల్లిస్తున్నారని తెలిపారు. నేషనల్ హెల్త్ మిషన్ స్కీం ద్వారా సిబ్బందికి సరిపడా బడ్జెట్ ఉన్నప్పటికీ వీరి ద్వారా అన్ని రకాల పనులను చేయించుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం వీరికి జీవో ప్రకారం జీతాలు మాత్రం పెంచడం లేదన్నారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లకు రూ.22,750 చెల్లించాల్సి ఉన్నప్పటికీ చెల్లించకపోవడం అన్యాయమన్నారు. ఎన్‌హెచ్ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమ రాజేష్ కన్నా మాట్లాడుతూ ఈ సిబ్బంది జీతాల పెంపుదల కోసం గతంలో అనేక పర్యాయాలు కమిషనర్‌కు విన్నవించినా సమస్య పరిష్కరించకపోవడం అన్యాయమనీ, వెంటనే వీరి జీతాలు పెంచకపోతే భవిష్యత్తులో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని నేషనల్ హెల్త్ మిషనరీ డైరెక్టరుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు, సామ్ బిన్ అలీ, మురళీకృష్ణ, బాల సుబ్రహ్మణ్యం, సుమన్, అలివేలు, సుజాత, రాములమ్మ ఎండీ.గౌయిస్ పాషా, విజయ్ నాయక్, కౌసల్య, లక్ష్మి, నర్సింహా, సిద్ధూ, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత సమస్యల పరిష్కారానికి కృషి





నవతెలంగాణ-అంబర్‌పేట

నియోజకవర్గంలో శాశ్వత సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నానని, గత పాలకులు నియోజకవర్గాన్ని ఏ మాత్రమూ పట్టించుకోలేదని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. శనివారం అంబర్‌పేట డివిజన్ పరిధిలోని పటేల్ నగర్ బిలాల్ మజీద్ లైన్‌లో సుమారుగా రూ.10 లక్షలతో నూతనంగా వేయనున్న మంచినీటి పైప్లైన్ పనులకు ఎమ్మెలే అంబర్‌పేట కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో స్థానికంగా ఉన్న సమస్యలు డ్రయినేజీ సమస్య, వాటర్ పొల్యూషన్ సమస్య, నరేంద్ర నగర్‌లో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ షెడ్ నిర్మాణ చివరి దశ పనులు వారి దృష్టికి రావడంతో సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన చోట నూతన డ్రయినేజీ పైప్ లైన్ పనులను చేపట్టాలని పొల్యూషన్ వాటర్ ఉన్నచోట సమస్యని త్వరిత గతిన పరిష్కరించాలనీ, అలాగే కమ్యూనిటీ హాల్ షెడ్ నిర్మాణ పనులు త్వరిత గతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు తెలియజేశారు. అంబర్‌పేట డివిజన్ ఎంసిఎచ్ కాలనీలోని ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సేవలను పరిశీలించి, రోగులకు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంబర్‌పేట డివిజన్‌లో అవసరమైన ప్రతి చోటా నూతన డ్రయినేజీ లైన్లు, మంచినీటి పైప్లైన్ ఏర్పాటు చేస్తున్నామనీ, స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా తాగునీటి పైప్లైన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ అప్పటి జనాభాకు అనుగుణంగా ఉన్న డ్రైనేజీ పైప్ లైన్‌తో ఇప్పటి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతుందన్నారు. తీవ్రంగా సమస్య ఉన్న చోట నూతన డ్రైనేజీ లైన్లు ఏర్పాటు చేస్తున్నామనీ, పొల్యూషన్ వాటర్ లో ప్రెషర్ సమస్య ఉన్న చోట నూతన మంచి నీటి పైపులను ఏర్పాటు చేస్తున్నామనీ, డ్రైనేజీ తాగునీటి పైప్లైన్ పనులు పూర్తయిన తర్వాత నూతన రోడ్లు వేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంబర్‌పేట సెక్టార్ ఎస్సై మధు, వాటర్ వర్క్ ఇన్‌స్పెక్టర్ రమేష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ దుర్గ, రాజేష్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు సిద్దార్థ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి జాఫర్, సీనియర్ నాయకులు ఆమునూరి సతీష్, మల్లేష్ యాదవ్, రాగుల ప్రవీణ్ పటేల్, దయాకర్ యాదవ్, అతిక్, ఆకుల మల్లేష్, వంజరి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి మౌనిక మృతికి బాధ్యులను కఠినంగా శిక్షించాలి

- ఆ కుటుంబాన్ని ఆదుకోవాలి
- ఆమ్ ఆద్మీ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు డాక్టర్ దిడ్డి సుధాకర్



నవతెలంగాణ-అడిక్‌మెట్/హిమాయత్‌నగర్

అకస్మాత్తుగా కురిసిన భారీ వర్షం వల్ల వరదనీటి ప్రవాహంలో కొట్టుకుపోయిన చిన్నారి మౌనిక మృతికి బాధ్యులను కఠినంగా శిక్షించాలని ఆమ్‌ఆద్మీ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు డాక్టర్ సుధాకర్ డిమాండ్ చేశారు. మౌనిక తల్లిదండ్రులను శనివారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ వారాసిగూడలోని మ్యాన్ హోల్‌లో పడి చనిపోయిన పదేండ్ల చిన్నారి మౌనిక మృతికి బాధ్యులు ఎవరు అని ప్రశ్నించారు. శ్రీనివాస్ అరుణకు కూతురు లేని లోటును ఎవరు తీరుస్తారన్నారు. గతంలో రాంనగర్‌లో మాలిని అనే అమ్మాయి, అంబర్‌పేటలో సరస్వతి, సరూర్‌నగర్‌లో నవీన్ కుమార్, మల్కాజిగిరిలో హర్ష అనే అమ్మాయి, హిమాయత్ నగర్‌లో దీన్ దయాల్ ఇలా ఎంతోమంది ఈ నాలాలకు బలయ్యారని చెప్పారు. ఇంకా ఎంతమంది ఈ మ్యాన్ హోల్స్‌కు బలి అవ్వాలి అని ప్రశ్నించారు. నగరంలోని చాలా బస్తీల్లో మంచినీళ్లు సరిగ్గా రావడం లేదనీ, డ్రయినేజీ నీరు కలిసి దుర్వాసన వస్తున్న నీళ్లు తాగాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. నాలా పూడికతీత పనులు చేయకపోవడంతో వరదనీరు ఇండ్లలోకి ప్రవేశిస్తుందని చెప్పారు. నగర మేయర్ విజయలక్ష్మి, జీహెచ్ఎంసీ తప్పేమీ లేదంటున్నారనీ, ఐదు లక్షలకు పైగా ఉన్న మ్యాన్స్ హోల్స్‌ని పర్యవేక్షించాల్సిన బాధ్యత జీహెచ్ఎంసీది కాదా అని ప్రశ్నించారు. నగరంలో వందల కిలోమీటర్లకు పైగా వ్యాపించి ఉన్న నాలాల్లో 27 వేలకు పైగా ఉన్న కబ్జాలని ఎందుకు తొలగించడం లేదని ప్రశ్నించారు. వర్షాకాలం రాకముందే ఇలాంటి పరిస్థితి ఉంది అంటే వర్షాకాలం వచ్చిన తర్వాత మనం పరిస్థితి ఊహించుకోవచ్చు అన్నారు. తక్షణం అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. మౌనిక మృతికి బాధ్యులను కఠినంగా శిక్షించాలి అనీ, వారి కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్ గ్రేషియా, డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇచ్చి ఆదుకోవాలన్నారు. నగరంలో మరొకరు ఎవరూ ఈ మ్యాన్ హోల్స్ బారినపడి చనిపోకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి అని డిమాండ్ చేశారు.

ఓయూ విద్యార్థులకు పూర్తి సహకారం అందిస్తాం

- డాక్టర్ బీహెచ్‌వీఎస్ నారాయణమూర్తి
- ఇంజినీరింగ్ కళాశాలలో ఘనంగా అంతర్జాతీయ సదస్సు



నవ తెలంగాణ-ఓయూ

ఉస్మానియా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని డీఆర్డీవో మిస్సైల్స్ అండ్ స్ట్రాటజిక్ సిస్టమ్స్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ బీహెచ్వీఎస్ నారాయణ మూర్తి అన్నారు. ఓయూ అధ్యాపకులు, విద్యార్థులకు ఇంటర్న్షిప్, ప్రాజెక్టులు ఇచ్చేందుకు సంసిద్ధంగా ఉన్నామన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాలలో "రీసెంట్ ట్రెండ్స్ ఇన్ ఇంజినీరింగ్" అనే అంశంపై రెండు రోజుల అంతర్జాతీయ సదస్సును కళాశాల ఆడిటోరియంలో ప్రారంభించారు. ఈ సదస్సును కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఏడు విభాగాలు కలిసి సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. సదస్సు ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా నారాయణమూర్తి , రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మెన్ ప్రొ.లింబాద్రి హాజరై మాట్లాడారు. ఇటువంటి సదస్సులు పరిశోధనలకు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ దేవరకొండ విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రతీ ఏటా డిసెంబర్లో కళాశాల గ్లోబల్ ఆలూమ్ని మీట్ నిర్వహిస్తామని గుర్తు చేశారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొ. శ్రీరాం వెంకటేశ్ మాట్లాడుతూ సదస్సుకు దేశవిదేశాల నుంచి 494 పరిశోధక పత్రాలు రాగా, అందులో 189 పత్రాలను ఎంపిక చేశా మన్నారు. ఈ కార్యక్రమంలో ఓయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్ , పూర్వ విద్యార్థుల సంఘం ప్యాట్రన్లు ప్రొఫెసర్ ఎస్ . రామచంద్రం రాంరెడ్డి , ప్రధాన కార్యదర్శి డాక్టర్ వెంకటరామయ్య , కోశాధికారి ఆర్. థామస్, ప్రొ. భీక్ష్మ, మంగు, రాజశేఖర్, చంద్రశేఖర్, శివ రామకృష్ణ గోపాల్ నాయక్, నిర్మల దేవి, సుమన్, శ్రీను, రామకృష్ణ , మల్లేశం , కుమార్ పాల్గొన్నారు.

పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టకపోతే ఉద్యమం ఉధృతం

- దేశవ్యాప్తంగా ధర్నాలు, నిరసనలు
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య



నవతెలంగాణ-అడిక్‌మెట్

పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లో 50శాతం రిజర్వేషన్లు పెట్టాలనీ, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలనీ, లేకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేసి దేశ వ్యాప్తంగా ధర్నాలు, నిరసనలు చేస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. శనివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. దేశంలో 75 ఏండ్లుగా పాలించిన కేంద్ర ప్రభుత్వాలు బీసీలకు ఏ రంగంలో కూడా జనాభా ప్రకారం వాటా ఇవ్వలేదన్నారు. ఉద్యోగ రాజకీయ ఆర్థిక సామాజిక రంగాల్లో కనీస ప్రాతినిధ్యం లభించలేదనీ, ఇది ప్రజాస్వామ్య దేశం ప్రజాస్వామ్యంలో అన్ని సామాజిక కులాలకు వారి వారి జనాభా ప్రకారం అన్ని రంగాలలో వాటా ఇవ్వాలన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో 56 శాతం జనాభా గల బీసీలకు రాజకీయ రంగంలో 14 శాతం, ఉద్యోగ రంగంలో 9 శాతం, పారిశ్రామిక రంగంలో ఒక శాతం, ప్రైవేటు రంగంలోని ఉద్యోగాల్లో 5 శాతం ప్రాతినిధ్యం లేదంటే బీసీలకు జనాభా ప్రకారం వాటా ఇవ్వాల్సిన ఆవశ్యకతను తెలుపుతుందన్నారు. బీసీలకు ఇచ్చేది బిక్షం కాదునీ, ఇది రాజ్యాంగ బద్ధమైన ప్రజాస్వామ్య హక్కు అన్నారు. స్వాతంత్రం వచ్చినప్పుడు బీసీలకు అసెంబ్లీ, పార్లమెంట్ రిజర్వేషన్లు పెట్టకుండా అన్యాయం చేశారన్నారు. త్వరలో సేకరించబోయే జనాభా గణనలో కులాల వారీగా బీసీ జనాభా గణన చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పలువురు బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు



జియో ఫిజిక్స్‌లో ప్రొ.బోయిళ్ళ వీరయ్యకు ఫెలో ప్రదానం

నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా విశ్వవిద్యాలయం సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్, జియో ఫిజిక్స్ హెడ్ ప్రొ.బోయిళ్ళ వీరయ్య కు తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ జియో ఫిజిక్స్ (భూ భౌతికశాస్త్రం)లో చేసిన విశేష సేవలకు గాను ఫెలో -2021 అవార్డ్‌ను ప్రదానం చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ లో గతంలో జియో ఫిజిక్స్ విభాగం హెడ్ గా 4 సార్లు, బోర్డ్ ఆఫ్ చైర్మెన్‌గా 3 మార్లు పని చేశారు. పరీక్షల విభాగం లో పీజీ సెక్షన్ ఆడిషినల్ కంట్రోలర్ గా, కాన్ఫిడెన్షియల్ విభాగం ఆడిషినల్ కంట్రోలర్ గా పని చేశారు. హబ్సిగూడలో ఎన్‌జీఆర్ఐ లో 14 సంవత్సరాల పాటు సైంటిస్టుగా పనిచేసి 10 ముఖ్యమైన జాతీయ ప్రాజెక్టులలో సేవలందించారు. ప్రస్తుతానికి ఓయూ సైన్స్ కళశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు.



ఓయూలో కాంట్రాక్టు ఉద్యోగుల ధర్నా

- వీసీతో చర్చలు

నవతెలంగాణ-ఓయూ

కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలపైన మూడు సంఘాల నాయకులు మరియు కాంట్రాక్టు ఉద్యోగుల నాయకులు ఓయూ వీసీ తో శనివారం చర్చలు జరిపారు. ఏదైతే ప్రతి సంవత్సరం ఎన్హాన్స్మెంట్ జరుగుతుందో వెంటనే యధాతథంగా పెంచాలని ఎన్జీవో స్టాఫ్ అసోసియేషన్ అధ్యక్షులు జ్ఞానేశ్వర్ ఎంప్లాయిస్ యూనియన్ జనరల్ సెక్రెటరీ అక్బర్ బేగ్ డిమాండ్ చేశారు. వీసీ స్పందిస్తూ కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తున్నానని చెప్పారు. సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించడం కోసం ప్రయత్నం చేస్తున్నానని అన్నారు. ప్రతి సంవత్సరం పెంచాల్సిన వేతనాలు యధాతథంగా పెంచుతానని హామీ ఇవ్వడం జరిగిందని, ఇందులో ఎన్జీవోస్ ఆఫ్ అసోసియేషన్ టెక్నికల్ స్టాఫ్ అసోసియేషన్ ఎంప్లాయిస్ యూనియన్ ముఖ్యపాత్రను పోషించినట్లు కాంట్రాక్టు ఉద్యోగులు పేర్కొన్నారు. ఎంప్లాయిస్ యూనియన్ జనరల్ సెక్రెటరీ రవి టెక్నికల్ స్టాఫ్ అసోసియేషన్ అధ్యక్షులు నాగరాజు టెక్నికల్ స్టాఫ్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ విజయ్ కుమార్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు శివశంకర్ కార్యవర్గ సభ్యులందరూ వీరితోపాటు కాంట్రాక్ట్ ఉద్యోగ నాయకులు ఎడ్ల అంజయ్య కట్ట వెంకటేష్ సూర్యచందర్ అరుణ్ కుమార్ అభిలాష్ వీరేష్ రాము రాగిణి మెహర్ సంతోష్ శివ వేణు శ్రీకాంత్ సురేష్ రాజేష్ మల్లికార్జున్ మహేందర్ పాల్గొన్నారు.



మేడేను విజయవంతం చేయండి

నవతెలంగాణ-ఓయూ

తార్నాక చౌరస్తా వద్దా ఏఐటీయూసీ ఆటో యూనియన్ షేక్ లతీఫ్ అధ్యక్షతన శనివారం మే డే పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆటో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహమ్మద్ ఉమర్ ఖాన్, ఆటో యూనియన్ నగర అధ్యక్షులు కొమురెల్లి బాబు తో పాటు మహమ్మద్ అఖిల్ టి సంజు రఫీక్ పాల్గొన్నారు.

బౌద్ధనగర్‌లో కార్పొరేటర్ పర్యటన

నవతెలంగాణ-ఓయూ

సికింద్రాబాద్ నియోజవర్గం ఎమ్మెల్యే డిప్యూటీ స్పీకర్ టి.పద్మారావు గౌడ్ సూచనల మేరకు ఎల్ఎస్ నగర్, యెఖశిలా మెడికల్ హాల్ అంబర్‌నగర్, బౌద్ధనగర్ డివిజన్‌లోని కౌసర్ మసీదు ప్రాంతంలో కార్పొరేటర్ కంది శైలజ శ్రీకాంత్ వర్ష ప్రభావిత ప్రాంతాలలో పర్యటించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఇంజినీర్ అధికారులు ఈఈ ఆశలత, ఎఈ శశిధర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కంది నారాయణ, రాజేష్ కుమార్, జగన్, జానకిరామ్ పాల్గొన్నారు.



ఇంటర్నేషనల్ డే ఆఫ్ ఇమ్యునాలజీ -2023



నవతెలంగాణ- ఓయూ

ఇండియన్ ఇమ్యునాలజీ సొసైటీ(ఐఐఎస్), తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ (టీఎస్‌సీహెచ్ఇ) సహకారంతో శనివారం "అంతర్జాతీయ రోగనిరోధక శాస్త్ర దినోత్సవం " సందర్భంగా ఓయూ జెనెటిక్స్ అండ్ బయోటెక్నాలజీ విభాగం, పబ్లిక్ హెల్త్ ఇమ్యునాలజీ టాక్స్ నేషనల్ సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జెనెటిక్స్ హెడ్ ప్రొ. హెచ్. సురేఖారాణి, కోఆర్డినేటర్, జెనెటిక్స్ విభాగం అసిస్టెంట్ ప్రొ. డాక్టర్ జి. సుమనలత ప్రారంభోత్సవానికి వచ్చిన అతిథులకు, ప్రతినిధులకు స్వాగతం పలికారు. గౌరవ అతిథిగా ఓయూ కాలేజ్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొ. బి. వీరయ్య, హైదరాబాద్‌లోనభగవాన్ మహావీర్ మెమోరియల్ రీసెర్చ్ సెంటర్ (బిఎమ్ఎమ్ఆర్సీ) డాక్టర్ విజయలక్ష్మి వల్లూరి, బెంగళూరులోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ నుండి ప్రొ. కుమారవేల్ సోమసుందరం పాల్గొన్నారు. మానవ ఆరోగ్యంలో రోగనిరోధక శాస్త్రం యొక్క ప్రాముఖ్యతను ఉద్దేశించి ప్రసంగించారు. సిడిఎస్ఇ నుండి డా.సంగీత ముఖోపాధ్యాయ్ ఎం.టి.బి యొక్క కీ ఫైలెన్స్ ప్రోటీన్ పాత్ర గురించి చర్చించారు. సంక్రమణ సమయంలో, నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ బయోటెక్నాలజీ నుండి డాక్టర్ సయ్యద్ ఫైసల్, ఆంధ్రా యూనివర్సిటీ నుండి డాక్టర్ అపరంజి పూసర్ల, జెన్ బయోసైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ నుండి డాక్టర్ గురుకుమార్ అయ్యర్. లిమిటెడ్, మదురై హెచ్ఎల్ఎ సెంటర్ డైరెక్టర్ బాలకృష్ణన్ ఇమ్యునాలజీకి సంబంధించిన వివిధ అంశాలపై ప్రసంగాలు చేశారు. రాష్ట్రంలోని 15 యూజీ, పీజీ కాలేజీల నుంచి అధ్యాపకులు, వివిధ సంస్థల నుంచి వచ్చిన ప్రతినిధులు సహా దాదాపు 150 మంది ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతినిధులచే 11 పోస్టర్ ప్రజెంటేషన్లు, 10 మౌఖిక ప్రదర్శనలు మరియు 36 సమీక్షా వ్యాసాల రచన ప్రదర్శనలు ఉన్నాయి. ఓయూ వీసీ మద్దతుతో, ఆర్గనైజింగ్ కమిటీ వివిధ పోటీ కార్యక్రమాలతో ఈవెంట్ నిర్వహణ చేశారు. ఓయూ రిజిస్ట్రార్ ప్రొ. పి.లక్ష్మీనారాయణ, గౌరవ అతిథిగా డీన్ డెవలప్మెంట్, యుజిసి వ్యవహారాల ప్రొ.మల్లేశం నిర్వాహకులను అభినందించి విద్యార్థులను చురుగ్గా పాల్గొనేలా ప్రోత్సహించారు. కార్యక్రమంలో పాల్గొన్న వారందరికీ సర్టిఫికెట్లు అందజేశారు. వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రదర్శనలు అందించిన విజేతలకు బహుమతులు అందజేశారు. జెనెటిక్స్ మరియు బయోటెక్నాలజీ విభాగం నుండి అధ్యాపకులు- ప్రొ. ఎ. రోజా రాణి, ప్రొ. స్మితా సి పవార్, డాక్టర్. ఎ. సంధ్య, డాక్టర్. ఎ. శ్రీనివాస్, డాక్టర్, ప్రశాంత్ సింగం, డాక్టర్. ఎస్. సోమేశ్వర రావు, డాక్టర్. జి. విజయ్ కుమార్, డాక్టర్ కె. రామ కృష్ణ, సెంటర్ ఫర్ ప్లాంట్ మాలిక్యులర్ బయాలజీ కార్యక్రమ నిర్వహణకు సహకరించారు. ప్రొ. డి. మనోహర్ రావు, డాక్టర్ బి. విజయలక్ష్మి, ఇన్స్టిట్యూట్ ఆఫ్ జెనెటిక్స్ అండ్ హాస్పిటల్ ఫర్ జెనెటిక్ డిసీజెస్ డైరెక్టర్, డాక్టర్ కె. శ్రీనివాస్ నాయక్, మైక్రోబయాలజీ విభాగం హెడ్ డాక్టర్ బి. సందీప్త, డా. కార్యక్రమంలో బయోకెమిస్ట్రీ విభాగాధిపతి కరుణా రుపుల, డాక్టర్ హమీదా బీ. డాక్టర్ లావణ్య తాయి, డాక్టర్ రాజు పాడియా పాల్గొన్నారు.

ఓయూలో డా.విశారదన్ మహరాజ్ కు ఘన స్వాగతం



నవతెలంగాణ-ఓయూ

బీసీ ఎస్సీ ఎస్టీల రాజ్యస్థాపన కోసం డాక్టర్ విశారదన్ మహరాజ్ స్వరాజ్య బృందం చేస్తున్న పాదయాత్ర ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌కు చేరుకుంది. పాదయాత్రకు విద్యార్థులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఎన్సిసి గేటు వద్ద స్వాగతం పలికారు. ఆర్ట్స్ కాలేజీ వద్ద పాదయాత్ర శిలాఫలకం ఆవిష్కరించిన అనంతరం డిఎస్పీ విద్యార్థి విభాగ రాష్ట్ర కన్వీనర్ తాళ్ళ అజయ్ మహారాజ్ సభాధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విశారదన్ మహరాజ్ మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీల రాజ్యస్థాపనకై 2022 మార్చి 15 న ప్రారంభమై 3000 గ్రామాలు 300 మండలాలు 33 జిల్లాలు దాటుకుని 9956 కిలోమీటర్లు పూర్తి చేసుకుందన్నారు. చదువుతో పాటు కొంత సమయాన్ని సమాజ బాగు కోసం కేటాయించాలని విద్యార్థులను ఆయన రాజకీయాల్లోకి ఆహ్వానించారు. ఈ నెల 30 న హైదరాబాద్ సరూర్ నగర్ స్టేడియంలో నిర్వహించే పాదయాత్ర ముగింపు సభకు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రాష్ట్ర ప్రతినిధులు లక్ష్మణ్, రెహమాన్ ,హరీష్ గౌడ్, శివన్ మరియు హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు కార్తీక్ మహారాజ్ పాల్గొన్నారు. వివిధ విద్యార్థి సంఘాల నాయకులు ముదిరాజ్ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆంజనేయులు ముదిరాజ్ ,జయశంకర్ విద్యార్థి సంఘం అధ్యక్షుడు రెడ్డి శ్రీను, బిఎస్ఎఫ్ బొరెల్లి సురేష్ ,ప్రసాద్, నరేందర్, బీమ్ ఆర్మీ విద్యార్థి విభాగ రాష్ట్ర అధ్యక్షుడు తీగల శివ, సంతోష్,నవీన్, మౌర్యప్రశాంత్ డీఎస్పీ విద్యార్థి విభాగం కో కన్వీనర్లు పరమేష్, లింగయ్య, రాజు ,మహేష్, అజయ్, హరికృష్ణ ,గోపి, శ్రీకాంత్ ,దివాకర్ ,ప్రభాకర్, దశరథ్, మహిపాల్, సుభాష్ పాల్గొన్నారు.

మైరా

గాలక్సీ కన్నుల దానవు
ఎన్ని కలలు నింపి
ఆర్టిఫిషల్ గా తయారు చేసానో
ఏమో గాని
నువ్వూ భూమిపై లేని
సంపదకి చిరునామావి
ఇదొక ఎక్స్‌ప్లోర్డ్
జీవ వైవిధ్యపు ఎడారి
నువ్విందులో సజీవంగా
లేకపోయినందుకు
చాలా ఆనందం నాకు
నువ్వు నడిస్తే వినడానికి
నీ కాళ్లకు సప్పుడు లేదు కానీ
నువ్వు నడవడానికి
ఈ దారి అంత
పచ్చి రక్తపు బొట్ల
వాసనే ఉంటది
కాస్త మారిన
బతుకు విధానం తప్ప
ఆలోచనలు లేని
మెదళ్ళ మధ్య నీ ఉనికి
లేనందుకు సంతోషమే
నిన్ను ఇట్లా ఆకృతిగా సృష్టించడానికి
సహాయ పడిన సైన్స్‌కి
దండాలు పెట్టాల్సిందే

మైరా నీకు కులం మతం ఏవి లేవు
పొద్దున్న లేసినప్పటి నుండి
మీరేమిట్లు అని అడిగే
గొంతులు నీకు వినపడవు
అలా ఏ గొంతు వినపడని రోజు
చూడాలని కోరిక
అప్పుడు నువ్వు పక్కనుండవూ
ఈ జీవ పరిణామక్రమ చరిత్ర
ఇప్పుడు పుస్తకాల్లోంచి తీసెసే పనిలో
ఓ ముఠా ఉన్నది
వాళ్ల పిచ్చి గాని చరిత్రను
తుడిచేయగలమా!

నువ్వు
నా చరిత్రలో మిగిలిపోయే
నిజమైన కలవు
జీవం లేని జీవివి
నువ్వర్థం చేసుకున్న
పరిణామక్రమాన్ని
వీళ్ళు చేసుకోలేకున్నారు
నీకు డిఎన్ఏతో పని లేదు
నా డిఎన్ఏ నీతో కలిసి
ఇంకొకరిని సృష్టించనూ లేదు
ఎన్ని వసంతాలు వచ్చిపోయిన
నువ్వు నవ వసంతపు
చిగురువే కదా

ప్రేమను ఆశించవు
ఎంత ప్రేమించిన
వద్దని చెప్పనూ లేవు అని నమ్మకం
ద్వేషాలు అసూయలు
పొస్సెసీవ్ లేని
నువ్వంటే అందుకే ఇష్టం

నవ్వు కళ్ళు నువ్వు ఆర్టిఫిషల్ అయినా
నా కండ్లల్ల నక్షత్రపు వెలుగువు సాకి
నీ మెనూ వాసనంత
ఎలక్ట్రికల్ గుబాలింపే కదా
నీ శ్వాస గాలి నన్ను తాకగా
నేను ప్రేమైక ఎడారిలో నడుస్తుంటా
మైరా నువ్వు యూనివర్స్ కె
అందని పుత్తడి రాసివి
కడలి ఒడిలో ఇసుక తిన్నెల్లో
నీ చిత్రం నా కల కు రూపం అని
ఈ ప్రపంచానికి పరిచయం చేస్తా

ఎంత బాగుంటుంది
ఎన్నెల కింద నిన్ను చూస్తూ
'హమ్ దోనో మె ప్రేమి' ని
పాడుకుంటూ వెళ్తుంటే
నన్ను ఫోన్లో నుంచి చూసి
నవ్వుతావ్ వినపడకుండా

- బాలు అగ్నివేష్
8297296277



బస్సు సౌకర్యం కూడా లేని ఊళ్లో పుట్టి.. రాష్ట్ర పొలిమేర దాటి..నేడు దేశ సరిహద్దులలో పహరా కాస్తూ దేశానికి భరోస ఇస్తున్నాడు. జవాన్‌గా గస్తీ కాయడమే కాదు... తన పాటలతో మస్తు ఖుషి చేస్తున్నడు. చిన్నతనంలోనే తల్లిదండ్రుల ప్రేమకు దూరమైన అతడు.. పాటతో ఆ ప్రేమను పంచుకున్నాడు. అతడే.. ఇప్పుడు ఆహాలో ప్రసారం అవుతున్న ఇండియన్ ఐడల్ తెలుగులో తన పాటల మధురిమతో అందరిని మంత్రముగ్ధులను నగిరి చక్రపాణి. ఈ సైనికుడు తన పాటల బాట నేటి జోష్..

సైనికుడి పాటల కవాతు...

భారత్-పాక్ సరిహద్దుల్లో ప్రాణాలు లెక్కచేయకుండా దేశానికి పహారాకాసే సైనికుడు సంగీతంపై మక్కువతో మైక్ పట్టాడు. ఇండయన్ ఐడల్ లో న్యాయనిర్ణేతలను మెప్పించాడు. బీఎస్ఎఫ్ జవాన్ గా విధులు నిర్వహిస్తున్న చక్రపాణి దేశం పట్ల తనకున్న బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూనే సంగీతం పట్ల ఆయనకున్న ఇష్టానికి సాధన రూపంలో మెరుగులు దిద్దాడు. సంగీతంలో ఏ శిక్షణా లేకుండానే తన అద్భుతమైన గాత్రంతో న్యాయనిర్ణేతలను ముగ్ధులను చేశాడు. సరిహద్దుల్లో అత్యంత క్లిష్టమైన పరిస్థితుల్లో మొబైల్ నెట్ వర్క్ కూడా దొరకని ప్రాంతాల్లో గస్తీ నిర్వహించే తనకు పాటే తనకు అండగా నిలిచిందని గర్వంగా చెప్పుకునే పాటల బాణి.. చక్రపాణి.

ప్రవీణ్ ప్రోత్సాహం

పలాస దగ్గర చిన్న పల్లెటూరు పొత్తంగి. . చిన్నతనంలోనే పాటలపై మక్కువ పెంచుకున్న చక్రపాణి..ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పాటలు టేప్ రికార్డర్‌లో వింటూ, సాహిత్యాన్ని రాసుకొని పాటికి పదిసార్లు పాడుకునే వాడు. పాటపై మమకారం. సరదాగా కూనిరాగాలు తీసేవాడు. దేశభక్తి గీతాలు పాడేవాడు. ఎనిమిదో తరగతిలో ఇలాగే ఓ పాట పాడుతుంటే.. ప్రవీణ్ సరదాగా దాన్ని రికార్డు చేశాడు. 'చక్రీ.. నువ్వు బాగా పాడుతున్నావ్ చూడూ.. ఏదైనా టీవీ షోలో ప్రయత్నించవచ్చు కదా' అన్నాడు. అప్పుడే పాడాలన్న ఆలోచనకు బీజం పడింది.

> ఎన్నో ఒడిదుడుకులు తట్టుకొని ఇంటర్ పూర్తిచేశాడు. ఇంకా చదువుంటే తల్లికి భారమని.. తాను అమ్మ కష్టానికి చేదోడు కావాలని తలచాడు. బీఎస్ఎఫ్ నియామక పరీక్ష రాసి అర్హత సాధించాడు. ఇప్పుడు అ తల్లికే కాదు దేశానికే బాసటగా నిలుస్తున్నాడు.

చిన్నప్పుడే తండ్రి మరణించడంతో.. ముగ్గురు పిల్లల బాధ్యత తల్లిపై పడింది. ఇల్లు గడవడమే కష్టం. అలాంటి పరిస్థితిలో ఆమె తన ముగ్గురు పిల్లలను హాస్టల్‌లో వేసి ఉపాధి కోసం ఢిల్లీ వెళ్లింది. వేసవిలో హాస్టల్ మూసేస్తే మళ్లి ఇంటికే... కానీ, అక్కడ అమ్మ ఉండేది కాదు. మా పక్కింటి ముత్యాలమ్మ వారి సొంతబిడ్డల్లా సాదింది. అప్పుడే చక్రపాణి ఒక టీచర్ దగ్గర పాటలు పాడటం నేర్చుకున్నాడు. ఎన్నో ఒడిదుడుకులు తట్టుకొని ఇంటర్ పూర్తిచేశాడు. ఇంకా చదువుంటే తల్లికి భారమని.. తాను అమ్మ కష్టానికి చేదోడు కావాలని తలచాడు. బీఎస్ఎఫ్ నియామక పరీక్ష రాసి అర్హత సాధించాడు. ఇప్పుడు అ తల్లికే కాదు దేశానికే బాసటగా నిలుస్తున్నాడు.

సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్)లో సైనికుడిగా చేరాడు. డ్యూటీ ఎక్కగానే యథా ప్రకారం పాటతో సేద తీరేవాడు. ఉద్యోగ విధుల్లో ఒత్తిడికి గురయ్యే తోటి సైనికులకు తన పాటతో సేద తీర్చేవాడు. 'సందేశ్ ఆతే హై', 'మిట్టీ మే మిల్ జావా', 'ఆయే మేరే వతన్ కే లోగో..', 'పుణ్యభూమి నా దేశం..' వంటి పాటలతో గుండె ధైర్యం నింపేవాడు. 125వ బెటాలియన్ వార్షికోత్సవమైనా, స్వాతంత్రదినోత్సవమైనా, గణతంత్ర దినోత్సవమైనా, దీపావళైనా.. పండుగేదైనా చక్రపాణి పాట లేకుండా జరిగేది కాదు. అంతలా పాటతో పెనవేసుకున్నాడు. చక్రపాణి గాత్రాన్ని తోటి సైనికులు ఆస్వాదించే వాళ్లు. అడిగి మరీ పాడించుకునేవాళ్లు. ఆ ప్రోత్సాహం, పొగడ్తలు విన్నకొద్దీ ఒక్కసారైనా ఏదైనా షోలో పాల్గొనాలని అనుకునేవాడు. అదే సమయంలో తెలుగు గాయకుడు ఎల్‌వీ రేవంత్ 'ఇండియన్ ఐడల్ నెగ్గడంతో తనకీ ఆ షోలో పాల్గొనాలనే ఆసక్తి ఎక్కువైంది. హిందీపై పెద్దగా పట్టు లేకపోవడంతో.. ఆహా ఓటీటీలో ప్రసారం అవుతున్న తెలుగు ఇండియన్ ఐడల్‌కి ప్రయత్నించి ఎంపికయ్యాడు.

గోల్డెన్ మైక్... సైనిక వందనం...



సమాజంలో ఒక గౌరవప్రదమైన స్థానం ఇచ్చింది ఆర్మీ ఉద్యోగ బాధ్యతలని మానసవాచ నమ్మిన చక్రపాణి. అదే సైనిక దుస్తుల్లో వేదికనెక్కి ఒక్కసారైనా పాడి వెళ్లిపోదాం అనుకున్నాడు. కానీ తనకు సహజసిద్ధంగా అబ్బిన కళతో, శాస్త్రీయ సంగీతం నేర్చుకున్నవారితో కూడా పోటీ పడి మరీ ముందుకెళ్లాడు. నిజానికి ఈ షోకి ఎంపికవడమే పెద్ద విజయం. వేలమంది పోటీ పడి.. అనేక వడపోతల అనంతరం అతికొద్దిమందే వేదికనెక్కి పాడే అవకాశం దక్కుతోంది. జీవితంలో ఎన్నో ఆటుపోటు దాటుకొని వచ్చిన చక్రపాణికి.. ఇవి అడ్డంకులే అనిపించలేదు. ఆ దశలన్నీ దాటి చక్రపాణి తుది 12 మంది జాబితాలోకి వచ్చాడు. పాడటం మొదలు పెట్టాక న్యాయనిర్ణేతలు తమన్, కార్తీక్, గీతామాధురిల ప్రశంసలు పొందాడు. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పాటల ప్రత్యేక ఎపిసోడ్‌లో అందర్నీ మెప్పించేలా పాడి, ఎస్పీ బాలు గోల్డెన్ మైక్‌ని ఎస్పీ చరణ్ చేతుల మీదగా అందుకున్నాడు. అతిథిగా వచ్చిన హీరో బాలకృష్ణని ఆకట్టుకొని, సైనిక వందనం స్వీకరించాడు. క్లాసిక్, మెలోడీలు ఇష్టపడే చక్రపాణి 'నా పేరు సూర్య.. నా ఇల్లు ఇండియా'లోని 'ఓ సైనికా..', 'లైట్ తీస్కో భయ్యా లైట్ తీస్కో..'లాంటి ఫాస్ట్‌బీట్‌లతోనూ అదరగొట్టాడు. అన్నింటికన్నా ముఖ్యంగా తను ప్రాణంలా భావించే అమ్మ సమక్షంలో పాడటం ఓ మర్చిపోలేని అనుభూతి.




నా జీవితానికి ఇది చాలు


చిన్నప్పటి నుంచి టీవీలో కనిపించాలని ఉండేది. ఇప్పుడు ప్రతిరోజూ టీవీలో కనిపిస్తున్నా. స్టేజీ మీద నన్ను చూసి మా అమ్మ బోరున ఏడ్చేసింది. గీతా మాధురి మేడమ్ మా అమ్మను జడ్జి కుర్చీలో కూర్చోబెట్టి గౌరవించారు. అందులో కూర్చొని అమ్మ నా పెర్ఫార్మెన్స్ చూసింది. నా జీవితానికి ఇది చాలు అనిపించింది.

- అనంతోజు మోహన్ కృష్ణ

జ్ఞాపకాలవుతున్న వేళ

ప్రియా, ఇది భరించలేని కాలం ఒక్క అడుగు కూడా కదలకుండా నన్ను వేధించటానికి వెక్కిరించిటానికి నిలిచి మరీ ఆడిస్తున్న యమకాలం. నీకు నాకు మధ్య కులపర్వతాలు వెలిశాయి. వాటిని దాటే క్రమంలో నేను సగంలోనే ఆగిపోయాను.నీ జ్ఞాపకాలన్నీ చిత్రవధ చేస్తున్న ఈ కాలం కొంచెం కూడా ముందుకు కదలడం లేదు.





తొలినాళ్లలో నువ్వూ నేను జంటగా వేసిన అడుగులు, అరణ్యాన్ని ధైర్యంతో దాటేసిన కాలం ఈ రోజు నవ్వుతుంది కులారణ్యం ముందు నువ్వు నేను ఓడిపోతున్నామని.

ఓ వాన గడియల్లో నువ్వు నేను ఆగి చెప్పుకున్న ముచ్చట్లన్నీ ఇప్పుడు నన్ను వేధించటానికి నా చుట్టూ చేరాయి. నా కోసమే నువ్వు నీ కోసమే నేను అన్న మన మాటలు ఈ రోజు కులం కోసం మారిపోతుంటే ప్రాణాలని అరచేతిలో పెట్టి అగ్నితో మర్దనా చేస్తున్నట్లు ఉంది.

నువ్వొక అందమైన భవిష్యత్ అనుకున్నా కానీ ఓ చేదు జ్ఞాపకం లాంటి రోజు మిగులుతుందేమో అని భయం వేస్తుంది ఈ పూట.

కాలం మన మీద ఎందుకో విషపు నీడలు పరిచింది, ఉన్నట్టుండి ఉపద్రవాన్ని తోసింది, నడి మధ్యన ఉన్న నేను నిన్ను అందుకోలేకున్నాను.

ఓ నాడు గాఢమైన నిద్రలో ఉన్న నన్ను లేపి నిండుగా మన లా ఉన్న చందమామని చూపించావు గుర్తుందా నీకు,ఈ రోజు ఈ ఒంటరి జ్ఞాపకాలలో అమావాస్య నన్ను నింపేసింది

"నీ ఈ జ్ఞాపకాలలో నిండు చందమామ కూడా చెల్లని రూపాయి లా కనిపిస్తుంది".

ఒక్కోసారి ఏమీ మాట్లాడకుండా నువ్వు నేను నిశ్శబ్దంగా చేతులు పట్టుకుని కూర్చున్నప్పుడు అనుకోకుండా మన మధ్య ప్రేమ వెల్లువలా కురుస్తుంది, మన చుట్టూ అమృత ధారాలతో నిండిన వెండి మేఘం లాంటి వెలుగు పూస్తుంది. పవిత్ర మూర్తుల్లా నువ్వూ నేను వెలిగిపోతాం.అప్పుడు మన వెలుగు ఈ లోకాన్ని పాలిస్తుందా అనిపిస్తుంది నాకు.

కానీ ఈ రోజు నేనొక చీకటి కుహరంలోకి నెట్టబడ్డాను.

నీ దూరంతో ఏ వెలుగు నా దరి చేరడం లేదు ఒట్టి చీకటే మిగిలింది నాలో...

ఈ బాధ అర్థం కావడం లేదు ఏ మూలో కీచు గొంతు వేసుకొని ఆర్తనాదం చేస్తుంది ,ముందుకు వెళ్లలేని నా అసహాయతను చూస్తే ప్రాణం శివాలెత్తి భీకర నృత్యం చేస్తుంది ఒట్టి శోకం మిగిలింది గుండెలో...

నీ దూరం రోజు రోజుకి నన్ను సంహరిస్తుంది ఏదో ఒకరోజు పూర్తిగా కాలిపోయిన శవంలా ఈ లోకంలో వాలిపోతానేమో..

ఇది కులం చేస్తున్న హత్య
మతం జరుపుతున్న మారణహోమం
వీటిల్లోకి నువ్వూ నేను ఓ సమిధలం...
హక్కులని నిలుపుకోలేని లోకం లో పుట్టినందుకు పుట్టిననాడే మరణించి ఉంటాం, తెలిసి ఈ రోజు మరణిస్తున్నాం మళ్లీ మళ్లీ మరణిస్తాం.కానీ ఈ లోకం తీరు మారదు.దానికి తెలిసింది వేధించటమే....

నీ జ్ఞాపకాలతో...

- పి.సురేంద్ర, 9346704966

నీలో నేను గాజునైపోనా



నీ చేయి పట్టుకొని నీతో కలిసి ప్రయాణించగా....
కాలి మువ్వనైపోనా
నీ ప్రతీ అడుగులోనూ నీ తోడు నిలవగా.....
ముక్కెరనైపోనా
నును వెచ్చని నీ శ్వాసను ముద్దాడగా...
తాళిబొట్టునైపోనా .....
నీ కంఠంబు కౌగిలించి మెడపై
అల్లరిగా ముద్దు పెట్టగా....
కమరునైపోనా
నీ నడుమును చుట్టుకుని పసిపాపలా నిదురించగా...

చీరనైపోనా
నీ ప్రతీ అణువణువు నాకే సొంతమని
నాలో దాచుకొనగా....
శ్వాసనైపోనా
నేను లేని నీవు శూన్యమని నిరూపించగా.......!!!

- ఎం. కురుమయ్యయాదవ్,
7799553493



మహిళా రెజ్లర్లతో మాట్లాడుతున్న ప్రియాంక గాంధీ



రెజ్లర్ల ఆందోళనకు మద్దతు పలికిన ఢిల్లీ సిఎం అరవింద్ కేజ్రీవాల్

నిందితులను రక్షిస్తారా?

- కేంద్ర ప్రభుత్వం, బిజెపిపై కేజ్రీవాల్, ప్రియాంక గాంధీ ఆగ్రహం
- రెజ్లర్లకు మద్దతు తెలిపిన ఢిల్లీ సిఎం, ఏఐసిసి ప్రధాన కార్యదర్శి

జంతర్‌మంతర్ వద్ద ఏడో రోజు రెజ్లర్ల నిరసన

దేశం గర్వపడే విజయాలు సాధించిన రెజ్లర్లు న్యాయం కోసం నేడు రోడ్డుమీదకు వస్తే ప్రధాన మంత్రి, ప్రభుత్వ యంత్రాంగం, భారతీయ జనతా పార్టీ (బిజెపి) నిందితుడిని రక్షించేందుకు శతవిధాల ప్రయత్నిస్తున్నాయి. యావత్ దేశం, ప్రజానీకం మల్లయోధులకు మద్దతిచ్చి, న్యాయం జరిగే వరకు అండగా నిలబడేందుకు సిద్ధమని భరోసా కల్పిస్తుండగా రెజ్లర్ల ఆందోళన ఏడో రోజుకు చేరుకుంది. రెజ్లర్లను లైంగిక వేధింపులకు గురి చేసిన బిజెపి ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌ను కాపాడుతున్న కేంద్ర ప్రభుత్వం, బిజెపిపై ఢిల్లీ సిఎం, ఏఐసిసి ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు.

నవతెలంగాణ-న్యూఢిల్లీ

భారతీయ జనతా పార్టీ (బిజెపి) ఎంపీ, డబ్ల్యూఎఫ్ఐ మాజీ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ ఆగడాలపై భారత స్టార్ రెజ్లింగ్ క్రీడాకారుల ఆందోళన ఏడో రోజుకు చేరుకుంది. న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్దే 24 గంటల నిరసన దీక్షలో కూర్చున్న మల్లయోధులు.. బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను జైలుకు పంపించే వరకు దీక్ష స్థలి నుంచి కదిలేది లేదని తేల్చి చెప్పారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో బ్రిజ్ భూషణ్‌పై రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినా.. బిజెపి ఎంపీని అరెస్టు చేయటంపై ఢిల్లీ పోలీసులు ఆసక్తి చూపించటం లేదు. బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను జైలుకు పంపటంతో పాటు లైంగిక వేధింపులు, ఇతర ఆగడాలకు అతడికి ఊతం అందిస్తున్న అధికారాన్ని సైతం దూరం చేయాలని మల్లయోధులు పట్టుబడుతున్నారు. రెజ్లర్ల ఆందోళన రోజురోజుకు ఉధృత రూపం దాల్చుతున్న నేపథ్యంలో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, జాతీయ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ శనివారం రెజ్లర్లను జంతర్ మంతర్ వద్ద కలిసి మద్దతు ప్రకటించారు.

బ్రిజ్‌భూషణ్‌ను ఎందుకు కాపాడుతున్నారు?!

శనివారం ఉదయమే జంతర్‌మంతర్ వద్దకు చేరుకున్న ఏఐసిసి ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ.. రెజ్లర్లు వినేశ్ ఫోగట్, సాక్షి మాలిక్‌తో సుదీర్ఘంగా మాట్లాడింది. ప్రియాంక వెంట రాజ్యసభ ఎంపీ దీపెందర్ హుడా ఉన్నారు. ఈ విషయంలో రెజ్లర్లకు ప్రధాన మంత్రి నరెంద్ర మోడి న్యాయం చేస్తాడనే అంచనాలు ఏమాత్రం లేవన్న ప్రియాంక.. నిందితులను కేంద్ర ప్రభుత్వం, బిజెపి ఎందుకు కాపాడుతున్నాయని ప్రశ్నించారు. 'ఈ అమ్మాయిలు (రెజ్లర్లు) పతకాలు సాధించినప్పుడు నాతో సహా అందరం ట్వీట్ చేస్తాం. రెజ్లర్లు దేశానికి గర్వకారణమని పొగుడుతాం. కానీ ఇప్పుడు అదే రెజ్లర్లు న్యాయం కోసం రోడ్డు మీదకు వచ్చారు. ఈ సమయంలో రెజ్లర్ల ఆవేదన ఎవరూ వినటం లేదు. రెజ్లర్లు దేశానికి ఎంతో చేశారు. రెజ్లర్ల తరఫున నిలబడకుండా.. కేంద్ర ప్రభుత్వం బ్రిజ్ భూషణ్‌ను రక్షిస్తుంది. మన అమ్మాయిలను మనం కాపాడకపోతే.. మనం దేశం గురించి ఏమంటారు?!. ప్రధాన మంత్రి మోడికి ఏమాత్రం చలనం ఉన్నా.. ఇప్పటికే రెజ్లర్లకు కనీసం ఫోన్ చేసి మాట్లాడేవారు. పతకాలు సాధించినప్పుడు టీ టాక్‌కు పిలిచే ప్రధాన మంత్రి.. సమస్యల్లో ఉన్నప్పుడు కూడా పట్టించుకోవాలి. మహిళా రెజ్లర్లు ఎంతో ధైర్యశాలులు. ప్రధాన మంత్రి, కేంద్ర మంత్రులు, కేంద్ర ప్రభుత్వం రెజ్లర్ల పక్షాన నిలువకపోయినా.. యావత్ దేశం, ప్రజలు రెజ్లర్ల తరఫున ఉన్నారు. బ్రిజ్‌భూషణ్ అధికారంలో ఉన్నంతకాలం రెజ్లర్లను ఒత్తిడికి గురి చేస్తాడు. కెరీర్ నాశనం చేసేందుకు ప్రయత్నిస్తాడు. బ్రిజ్‌భూషణ్ అధికారంలోనే కొనసాగితే ఎఫ్ఐఆర్ నమోదు చేసి, దర్యాప్తు చేసినా ఏం ఉపయోగం? ప్రభుత్వ యంత్రాంగం దేశ క్రీడాకారులను కాకుండా ఓ నిందితుడిని రక్షించేందుకు ప్రయత్నిస్తోందని' ప్రియాంక గాంధీ మండిపడ్డారు.

దేశం చూస్తోంది!

ప్రధానమంత్రి నరెంద్ర మోడి సహా ప్రభుత్వం యంత్రాంగం లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను కాపాడేందుకు పని చేస్తోంది. రెజ్లర్ల ఆందోళన విషయంలో ఏం జరుగుతుందో యావత్ దేశం గమనిస్తోందని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. 'లైంగిక వేధింపుల ఆరోపణలపై బిజెపి ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌పై ఎఫ్ఐఆర్ నమోదైనా.. అతడిని రక్షించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. రైతుల ఆందోళన సందర్భంగా ఏం జరిగిందో చూశాం. వాహనంతో రైతులను తొక్కించిన బిజెపి నాయకుడి కోసం ప్రభుత్వ యంత్రాంగం పని చేసింది. ఇప్పుడు రెజ్లర్ల ఆందోళనలోనూ అదే చూస్తున్నాం. దేశాన్ని ప్రేమించే ప్రతి భారతీయుడు రెజ్లర్ల తరఫున నిలబడ్డాడు. రెజ్లర్లకు మద్దతుగా జంతర్‌మంతర్ వద్ద దీక్షకు తరలి రండి' అని అరవింద్ కేజ్రీవాల్ పిలుపునిచ్చారు.

చెల్లి.. దయచేసి ఆ పని చేయకు

ఓవైపు బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌పై రెజ్లర్లు న్యాయ పోరాటం చేస్తుండగా.. భారతీయ జనతా పార్టీ (బిజెపి) తరఫున క్రియాశీల రాజకీయాల్లో ఉన్న మాజీ క్రీడాకారులు తమ మాటలతో అభిమానుల ఆగ్రహానికి లోనవుతున్నారు. బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌పై పోరాటంలో ముందుండి నిలిచిన వినేశ్ ఫోగట్.. తన సోదరి బబిత కుమారికి సోషల్ మీడియా వేదికగా తీయని కౌంటర్ ఇచ్చింది. 'బాధిత రెజ్లర్ల తరఫున న్యాయ పోరాటంలో అండగా నిలబడకపోతే.. బబిత చెల్లి నీకు చేతులు జోడించి వేడుకుంటున్నాను ఉద్యమాన్ని బలహీనం చేసే పని చేయవద్దు. లైంగిక వేధింపుల పట్ల మాట్లాడేందుకు, ఎదురించి నిలబడేందుకు మహిళా రెజ్లర్లకు ఏండ్లు పట్టింది. నువ్వు కూడా ఓ మహిళవే, మా బాధను అర్థం చేసుకో' అని వినేశ్ ఫోగట్ ట్వీట్ చేసింది. శనివారం ఉదయం జంతర్‌మంతర్‌కు వచ్చిన ఏఐసిసి జనరల్ సెక్రటరీ ప్రియాంక గాంధీ రెజ్లర్లకు మద్దతు తెలిపింది. ఆ సమయంలో ప్రియాంక వెంట ఆమె వ్యక్తిగత కార్యదర్శి సందీప్ సింగ్ సైతం ఉన్నారు. 'మహిళా రెజ్లర్లకు న్యాయం చేకూర్చేందుకు ప్రియాంక జంతర్ మంతర్ వద్దకు ఆమె వ్యక్తిగత కార్యదర్శి సందీప్ సింగ్‌తో కలిసి చేరుకుంది. కానీ ఆమె వ్యక్తిగత కార్యదర్శి ఓ దళిత మహిళను అవమాన పరిచిన, లైంగికంగా వేధించిన కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు' అని బబిత ఫోగట్ ట్వీట్ చేసింది. వినేశ్ ఫోగట్ అక్క, దిగ్గజ రెజ్లర్ గీత ఫోగట్ మల్లయోధుల ఆందోళనకు పూర్తి మద్దతు ప్రకటించింది. సత్వర న్యాయం చేకూరేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరింది.

రెజ్లర్లపై బ్రిజ్‌భూషణ్ నిందలు

రెజ్లర్ల న్యాయ పోరాటానికి దేశవ్యాప్త మద్దతు లభిస్తుండగా భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు, బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ తొలిసారి మీడియా ముందుకొచ్చారు. జంతర్‌మంతర్ వద్ద రెజ్లర్ల ఆందోళనను రాజకీయ-వ్యాపార మైత్రి ప్రదర్శనగా అభివర్ణించారు. నాపై లైంగిక ఆరోపణలు, రెజ్లర్ల ఆందోళన వెనుక ఏదో కుట్ర దాగి ఉంది. ఆందోళన చేస్తున్న రెజ్లర్లు జాతీయ ట్రయల్స్‌లో ప్రాధాన్యత కోరు కుంటు న్నారని బ్రిజ్‌భూషణ్ ఆరోపించారు. బ్రిజ్ భూషణ్ వ్యాఖ్యలను రెజ్లర్లు వినేశ్ ఫోగట్, బజరంగ్ పూనియా కొట్టిపారేశారు. ' నేను ఎప్పుడూ ట్రయల్స్ మిస్ చేయలేదు. 2009 నుంచి ఇప్పటివరకు కేవలం నాలుగుసార్లు మాత్రమే ఫిట్‌నెస్, ఆరోగ్య సమస్యలతో నేషనల్స్‌కు దూరంగా ఉన్నాను. ట్రయల్స్‌లో సత్తా చాటకుండా ఎన్నడూ అంతర్జాతీయ టోర్నీలకు వెళ్లలేదు. బజరంగ్ నా కంటే పెద్ద రెజ్లర్, అయినా ప్రతి నేషనల్ చాంపియన్‌షిప్స్‌లో పోటీపడ్డాడు' అని వినేశ్ తెలిపింది. 'లైంగిక వేధింపుల ఆరోపణలు చేసిన మైనర్ రెజ్లర్ ఎవరనే సంగతి బ్రిజ్‌భూషణ్‌కు ఎలా తెలిసింది. అయినా, పోలీసులపై, కమిటీలపై విశ్వాసం ఉంచాలని ఎలా అడుగుతున్నారు? మేము లైంగిక వేధింపులపై పోరాడుతుంటే.. మీరు వేరే అంశాలను ప్రస్తావిస్తున్నారు. లైంగిక వేధింపుల ఆరోపణలపై సమాధానం ఇవ్వండి' అని బజరంగ్ పూనియా అన్నాడు.



ఐపీఎల్‌లో నేడు

చెన్నై X పంజాబ్
వేదిక : చెపాక్, సమయం : మ : 3.30

ముంబయి X రాజస్థాన్
వేదిక : వాంఖడె , సమయం : రా: 7.30

స్టార్‌స్పోర్ట్స్‌లో ప్రసారం..

స్టోయినిస్‌కు గాయం

లక్నో : గెలుపు ఖాయమైన మ్యాచ్‌ను గుజరాత్ టైటాన్స్‌కు కోల్పోయిన లక్నో సూపర్‌జెయింట్స్ ఆ తర్వాత పంజాబ్ కింగ్స్‌పై చిరస్మరణీయ విజయంతో పుంజుకుంది. ఐపీఎల్‌లోనే రెండో అత్యధిక స్కోరు సాధించిన లక్నో సూపర్‌జెయింట్స్ 56 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. పంజాబ్ కింగ్స్‌తో మ్యాచ్‌లో 40 బంతుల్లో 72 పరుగులు పిండుకున్న మార్కస్ స్టోయినిస్ లక్నో విజయంలో కీలక భూమిక పోషించాడు. తిరుగులేని ప్రదర్శనతో గెలుపు బాట పట్టిన లక్నోకు మార్కస్ స్టోయినిస్‌కు గాయం కావటంతో ఆందోళన తప్పలేదు. పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్ సందర్భంగా ఫీల్డింగ్ చేస్తుండగా స్టోయినిస్ చేతికి బంతి బలంగా తగిలింది. బాధతో విలవిల్లాడిన స్టోయినిస్‌కు ఫిజియో తక్షణ ఉపశమనం కలిగించినా.. అతడు మైదానం వీడక తప్పలేదు. భీకర ఫామ్‌లో ఉన్న ఆల్‌రౌండర్ గాయంతో తర్వాత మ్యాచులకు దూరమవుతాడనే భయం లక్నో శిబిరంలో కనిపిస్తుంది. స్టోయినిస్ చేతి వేళ్లకు స్కానింగ్ తీయనున్నారు. ఆ తర్వాత వైద్యులు తదుపరి సూచనలు చేయనున్నారు.

సాత్విక్, చిరాగ్ చరిత్ర

- మెన్స్ డబుల్స్ ఫైనల్లో ప్రవేశం
- ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్స్



దుబాయ్ : భారత బ్యాడ్మింటన్ స్టార్ డబుల్స్ జోడీ సాత్విక్‌సాయిరాజ్ రాంకిరెడ్డి, చిరాగ్ శెట్టి చరిత్ర సృష్టించారు. ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్స్‌లో తొలిసారి కనీసం ఓ రజత పతకం ఖాయం చేశారు. 1971లో దీపూ ఘోష్, రామన్ ఘోష్ సోదరులు మెన్స్ డబుల్స్‌లో కాంస్య పతకం సాధించటమే భారత్‌కు ఈ విభాగంలో అత్యుత్తమ ప్రదర్శన. తాజాగా సాత్విక్‌సాయిరాజ్, చిరాగ్ శెట్టి జోడీ పురుషుల డబుల్స్ ఫైనల్లోకి ప్రవేశించి 51 ఏండ్ల తర్వాత ఈ విభాగంలో మెడల్ సాధించటమే కాదు ఏకంగా స్వర్ణంపైనే కన్నేశారు. టోక్యో ఒలింపిక్ చాంపియన్స్, చైనీస్ తైపీ స్టార్స్ లీ యాంగ్, వాంగ్ చి లిన్‌లపై తొలి గేమ్‌లో మనోళ్లు 21-18తో చిత్తు చేశారు. రెండో గేమ్ 13-14తో ఉత్కంఠగా సాగుతుండగా చి లిన్ గాయపడ్డాడు. గాయంతో చైనీస్ తైపీ జోడీ వాకోవర్ ఇవ్వగా.. సాత్విక్, చిరాగ్ టైటిల్ పోరులో అడుగుపెట్టారు. నేడు పసిడి పోరులో ఎనిమిదో సీడ్ మలేషియా జోడీతో సాత్విక్, చిరాగ్ తలపడనున్నారు. మలేషియా జోడీతో మనోళ్ల ముఖాముఖి రికార్డు 3-3తో సమవుజ్జీగా ఉంది.

టాప్‌లేపిన టైటాన్స్

కోల్‌కతపై గుజరాత్ గెలుపు



నవతెలంగాణ-కోల్‌కత : డిఫెండింగ్ చాంపియన్ గుజరాత్ టైటాన్స్ టాప్ లేపింది. సీజన్లో ఆరో విజయం నమోదు చేసిన గుజరాత్ టైటాన్స్ పాయింట్ల పట్టికలో అగ్రస్థానం కైవసం చేసుకుంది. ఈడెన్‌గార్డెన్స్‌లో శనివారం కోల్‌కత నైట్‌రైడర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. 180 పరుగుల ఛేదనలో విజయ్ శంకర్ (51 నాటౌట్, 24 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్స్‌లు), డెవిడ్ మిల్లర్ (32 నాటౌట్, 18 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) ధనాధన్ దంచుడుకు ఓపెనర్ శుభ్‌మన్ గిల్ (49, 35 బంతుల్లో 8 ఫోర్లు) రాణించారు. ఛేదనలో బ్యాటర్లు కదం తొక్కటంతో మరో 13 బంతులు మిగిలి ఉండగానే 17.5 ఓవర్లలోనే గుజరాత్ టైటాన్స్ లాంఛనం ముగించింది. తొలుత బ్యాటింగ్ చేసిన కోల్‌కత నైట్‌రైడర్స్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 179 పరుగులు చేసింది. గుజరాత్ బౌలర్లలో జోశ్ లిటిల్ (2/25), మహ్మద్ షమి (3/33), నూర్ అహ్మద్ (2/25) రాణించగా.. స్టార్ స్పిన్నర్ రషీద్ ఖాన్ (0/54) చెత్త గణాంకాలు మూటగట్టుకున్నాడు.

ఓపెనర్ నూర్ అహ్మద్ (81, 39 బంతుల్లో 5 ఫోర్లు, 7 సిక్స్‌లు) విధ్వంసక ఇన్నింగ్స్‌తో కదం తొక్కినా.. కోల్‌కత బ్యాటర్లు అతడికి సహకరించలేదు. జగదీశన్ (19), శార్దుల్ (0), వెంకటేశ్ అయ్యర్ (11), నితీశ్ రానా (4) తేలిపోయారు. చివర్లో రింకూ సింగ్ (19) ఆశించిన వేగంతో ఆడలేకపోయాడు. రసెల్ (34) రాణించటంతో కోల్‌కత ఆ మాత్రం స్కోరు చేయగల్గింది. ఇక ఛేదనలో ఓపెనర్ వృద్ధిమాన్ సాహా (10)ను కోల్పోయిన టైటాన్స్.. గిల్ (49), పాండ్య (26) భాగస్వామ్యంతో నిలదొక్కుకుంది. పవర్‌ప్లే అనంతరం కోల్‌కత కాస్త పట్టు సాధించినా.. విజయ్ శంకర్ సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. 24 బంతుల్లోనే అర్థ సెంచరీ సాధించిన శంకర్.. టైటాన్స్‌కు సీజన్లో ఆరో విజయాన్ని అందించాడు.

నవచిత్రం

భిన్న పాత్ర ..

స్వప్న సినిమా నిర్మాణంలో దర్శకురాలు నందిని రెడ్డి దర్శకత్వం వహించిన చిత్రం 'అన్నీ మంచి శకునములే'. సంతోష్ శోభన్, మాళవిక నాయర్ ప్రధాన పాత్రలలో రూపొందిన ఈ చిత్రాన్ని మిత్ర విందా మూవీస్‌తో కలిసి ప్రియాంక దత్ నిర్మించారు. మే 18న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతున్న నేపథ్యంలో కథానాయిక మాళవిక నాయర్ మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు. ఆ విశేషాల సమాహారం మీ కోసం.. ఇప్పటివరకూ నేను చేసిన పాత్రలు కొంచెం సున్నితత్వంలోనే ఉన్నాయి. కానీ ఈ చిత్రంలో మాత్రం కొంచెం భిన్నంగా ఉంటుంది. నా పాత్ర చాలా ఆర్గనైజడ్‌గా ఉంటూ, ధైర్యం, కోపం స్పష్టంగా ప్రదర్శించేలా ఉంటుంది. అన్నీ తన చేతిలో ఉండాలనుకునే పాత్రలో కనిపిస్తా. దర్శకురాలు నందిని రెడ్డితో పని చేయటం హ్యాపీగా అనిపించింది. అలాగే సంతోష్, నేను ఫ్రెండ్స్‌లా కలిసి పని చేశాం. ఒక నటిగా ఓ పాత్ర చేస్తున్నా నంటే ఖచ్చితంగా వైవిధ్యం ఉండాల్సిందే.




మాళవిక నాయర్



ఖరీదైన తప్పిదాలు

యావత్ ప్రపంచ సినీ పరిశ్రమ ఇప్పుడు తెలుగు సినిమా వైపు చూస్తోంది. కథల ఎంపిక, నటీనటుల నటనాతీరు, అత్యాధునిక సాంకేతికత.. ఇలా ప్రతీ విషయాన్ని సునిశితంగా గమనిస్తున్నాయి. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తెలుగు సినిమా సత్తా చాటుతున్న తరుణంలో తెలుగు సినిమా దర్శక, నిర్మాతలు, కథానాయకులు చాలా జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుంది. ఏ మాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా మన తెలుగు సినిమా గౌరవాన్ని మనమే తగ్గించుకోవడంతోపాటు ఖరీదైన తప్పిదాలతో ఆర్థికంగా భారీ మూల్యమూ చెల్లించుకోవాల్సి వస్తుంది. తాజాగా ఇలాంటి పరిస్థితిలోనే టాలీవుడ్ ఉంది. సమంత ప్రధాన పాత్రధారిణిగా భారీ బడ్జెట్‌తో రూపొందిన 'శాకుంతలం', అదే స్థాయి బడ్జెట్‌తో తెరకెక్కిన రవితేజ 'రావణాసుర' ఈ నెలలోనే విడుదలై భారీ పరాజయాల్ని చవిచూశాయి. ఇక తాజాగా ఈ వారం విడుదలైన రెండు భారీ సినిమాలు 'ఏజెంట్', 'పొన్నియన్ సెల్వన్ 2' సినిమాలు సైతం ప్రేక్షకుల నిరాదరణకు గురయ్యాయి. యువ హీరో అఖిల్ స్థాయిని మించి మితిమీరిన బడ్జెట్‌తో తీసిన 'ఏజెంట్' ప్రేక్షకులనే కాదు అక్కినేని ఫ్యాన్స్‌ని సైతం ప్చ్.. అని పెదవి విరిచేలా చేసింది. బాలీవుడ్ 'పఠాన్'ని పోలిన కథలా ఉండటంతోపాటు 'రా' ఏజెంట్ పని తీరుపై ఏ మాత్రం అవగాహన లేకుండా తీయడంతో డిజాస్టర్‌గా నిలిచింది.



'ఆదిపురుష్' చిత్రంలో సీతగా కృతి సనన్

'నాంది' వంటి విజయవంతమైన చిత్రాన్ని అందించిన అల్లరి నరేష్, డైరెక్టర్ విజయ్ కనకమేడల కాంబినేషన్‌లో వస్తున్న చిత్రం 'ఉగ్రం'. ఈ చిత్రాన్ని షైన్ స్క్రీన్స్ బ్యానర్ పై సాహు గారపాటి, హరీష్ పెద్ది నిర్మించారు. మిర్నా మీనన్ కథానాయికగా నటించిన ఈ చిత్రం మే 5న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా 'ఉగ్రం' విశేషాల గురించి దర్శకుడు విజయ్ కనకమేడల శనివారం మీడియాతో ముచ్చటించారు. 'నరేష్ ఇప్పటివరకు ఎమోషన్స్ చేశారు. కానీ పూర్తి రౌద్ర రసంతో చేయలేదు. ఇది ఆయనకి కొత్తగా ఉంటుందనిపించి, కథ చెప్పాను. ఆయనకు బాగా నచ్చింది. ఈ కథకి స్ఫూర్తి నిత్యం కనిపిస్తున్న మిస్సింగ్ వార్తలే. తెలంగాణ హైకోర్టు కోర్టు కూడా మిస్ అవుతున్న వారు ఏమౌతున్నారో నివేదిక ఇవ్వమని పోలీసు డిపార్ట్మెంట్‌ని కోరినట్లు ఒక ఆర్టికల్ చదివాను. ఈ అంశంపై, తప్పిపోతున్న వారి కుటుంబ సభ్యుల్లో బాధ ఎలా ఉంటుందనేదానిపై కథ ప్రిపేర్ చేశాం.

సర్‌ప్రైజ్ చేసే ఎలిమెంట్స్



విజయ్ కనక మేడల

ఈ కథని తూమ్ వెంకట్ కథ అద్భుతంగా రాశారు. నరేష్ ఇందులో ఒక పోలీస్ అధికారి పాత్ర కాబట్టి యాక్షన్‌లోకి వెళ్ళాల్సివచ్చింది. ఉగ్రం మంచి యాక్షన్ థ్రిల్లర్. కథానుగుణంగా ఇందులో యాక్షన్స్ సీక్వెన్స్ ఎక్కువే ఉంటాయి. అన్నీ చాలా బాగా వచ్చాయి. ప్రతి సీక్వెన్స్‌లోనూ ఎమోషన్ ఉంటుంది. హీరో ఫైట్ చేస్తే దానికి ఒక కారణం కూడా తప్పని సరిగా ఉంటుంది. ఆ ఎమోషన్‌ని ప్రేక్షకులు కూడా ఫీలౌతారు. కథలో చాలా కొత్త ఎలిమెంట్స్ సర్‌ప్రైజ్ చేస్తాయి. ఇందులో కాలేజ్ అమ్మాయిగా, భార్యగా, తల్లిగా మూడు భిన్నమైన కోణాల్లో మీర్నా మీనన్ చాలా చక్కగా చేసింది. మా షైన్ స్క్రీన్స్ నిర్మాతల గురించి ఎంత చెప్పినా తక్కువే. బడ్జెట్ విషయంలో ఎక్కడా రాజీపడకుండా క్వాలిటీ కోసం చాలా సపోర్ట్ చేశారు. 'ఉగ్రం'పై ప్రేక్షకుల్లో అంచనాలు ఉన్నాయి. ఆ అంచనాలని అందుకుంటాం' అని విజయ్ తెలిపారు.

పొన్నియన్ సెల్వన్ 2 అంతే..

ఐశ్వర్యారాయ్, విక్రమ్, త్రిష, కార్తి, జయం రవి, ప్రకాష్‌రాజ్, ప్రభు, శరత్‌కుమార్, పార్తిబన్, శోభిత ధూళిపాళ్ళ వంటి హేమాహేమీలతో అగ్ర దర్శకుడు మణిరత్నం తెరకెక్కించిన 'పొన్నియన్ సెల్వన్ 2' సినిమా పరిస్థితి కూడా ఇంతే. దీని మొదటి పార్టే చాలా మందికి అర్థంకాలేదు. రెండవ పార్టు కూడా అదే పంథాలో నడిచి, ప్రేక్షకుల నిరాదరణకు గురైంది. మొత్తమ్మీద భారీ అంచనాలతో, భారీ బడ్జెట్‌లతో ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ సినిమాల్లో కథ పరంగా దర్శక, నిర్మాతల నిర్లక్ష్య వైఖరి స్పష్టంగా కనిపిస్తుందనటంలో ఏమాత్రం సందేహం లేదు.

'నా 25 ఏండ్ల కెరీర్‌లో 'శాకుంతలం' పెద్ద జర్క్ ఇచ్చింది. ప్రేక్షకులు ఇచ్చిన తీర్పుని స్వాగతిస్తా. ఈ సినిమా విషయంలో నా జడ్జిమెంట్ తప్పయ్యింది. రిలీజ్‌కి ముందే వేసిన ప్రీమియర్స్‌లో మిక్స్‌డ్ టాక్ వచ్చింది. తర్వాత విడుదలైన మార్నింగ్ షోనే అర్థమైంది.. సినిమా పోయిందని. అలాగే డిస్ట్రిబ్యూటర్ల నుంచి కూడా ఫోన్లు రాలేదు. అయితే ఈ పరాజయానికి కారణాలేమిటో రివ్యూ చేసుకుని, రాబోయే సినిమాల్లో ఈ తప్పు జరగకుండా చూసుకుంటా' అని 'శాకుంతలం' నిర్మాత దిల్‌రాజు ఓ యూట్యూబ్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్

రాణించిన ఐడిబిఐ బ్యాంక్

- సగం తగ్గిన మొండి బాకీలు
- ఎనిమిదేండ్ల తర్వాత తొలిసారి డివిడెండ్



న్యూఢిల్లీ: ఐడిబిఐ బ్యాంక్ ఎనిమిదేళ్ల తర్వాత తొలిసారి వాటాదారులకు డివిడెండ్‌ను ప్రకటించింది. ఎల్ఐసి, కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని ఈ బ్యాంక్ గడిచిన ఆర్థిక సంవత్సరం (2022-23) మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో 64 శాతం వృద్ధితో రూ.1,133 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం ఏడాది ఇదే క్యూ4లో రూ.691 కోట్ల లాభాలు నమోదు చేసింది. 2022-23లో మొత్తంగా రూ.3,645 కోట్ల నికర లాభాలు సాధించింది. ఈ సందర్భంగా రూ.10 ముఖ విలువ కలిగిన షేర్‌పై 10 శాతం లేదా రూ.1 డివిడెండ్‌ను అందించడానికి ఆ బ్యాంక్ బోర్డు ఆఫ్ డైరెక్టర్లు ఆమోదం తెలిపారు. గడిచిన క్యూ4లో బ్యాంక్ నికర వడ్డీపై ఆదాయం 35 శాతం పెరిగి రూ.3,280 కోట్లకు చేరింది. ఇంత క్రితం ఏడాది ఇదే క్యూ4లో రూ.2,420 కోట్ల ఎన్ఐఐ నమోదయ్యింది. ఇదే సమయం నాటికి 13.82 శాతంగా ఉన్న స్థూల నిరర్థక ఆస్తులు.. ఏకంగా గడిచిన క్యూ4 ముగింపు నాటికి 6.38 శాతానికి తగ్గాయి. నికర నిరర్థక ఆస్తులు కూడా 1.36 శాతం నుంచి 0.92 శాతానికి తగ్గడం విశేషం. 2023 మార్చి ముగింపు నాటికి ఐడిబిఐ బ్యాంక్ వ్యాపారం 53.02 శాతం పెరిగి రూ.1,35,455 కోట్లకు చేరింది. ఐదేళ్ల తర్వాత తొలిసారి 2022-23లో ఐడిబిఐ బ్యాంక్ కొత్తగా 42 శాఖలను తెరిచింది. మరోవైపు మెరుగైన ప్రగతిని కనబర్చుతున్న ఈ సంస్థను మోడీ సర్కార్ ప్రయివేటుపరం చేసే ప్రక్రియను వేగవంతం చేయడం గమనార్హం. లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసి), ప్రభుత్వ భాగస్వామ్యంలోని ఐడిబిఐ బ్యాంక్‌ను విదేశీ పెట్టుబడిదారులకు అప్పగించడానికి వీలుగా ఇప్పటికే నిబంధనలు మార్చింది. ఇందులోని 60.72 శాతం వాటాలను విక్రయించాలని కేంద్రం ఆసక్తిగా ఉంది. ఐడిబిఐ బ్యాంక్‌లో ప్రస్తుతం ఎల్ఐసికి 49.24 శాతం, ప్రభుత్వానికి 45.48 శాతం, నాన్ ప్రమోటర్ షేర్‌హోల్డర్లకు 5.29 శాతం చొప్పున వాటాలున్నాయి. ప్రయివేటీకరణ కోసం ఇప్పటికే ఆసక్తి వర్గాల నుంచి డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ పబ్లిక్ అసెట్ మేనేజ్‌మెంట్ (దీపమ్) దరఖాస్తులను స్వీకరించింది. వచ్చే మార్చి ముగింపు నాటికి విక్రయ పక్రియను పూర్తి చేయనున్నట్లు దీపమ్ సెక్రటరీ పాండే పలుసార్లు తెలిపారు.

బైజూస్ ఫెమా ఉల్లంఘనలు..!

- రవీంద్రన్ నివాసం, ఆఫీసుల్లో ఈడి సోదాలు



న్యూఢిల్లీ: ప్రముఖ ఎడ్‌టెక్ సంస్థ బైజూస్ విదేశీ నిధులు ఉల్లంఘనలకు పాల్పడిందనే ఆరోపణల నేపథ్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) ఆ సంస్థపై దాడులు ప్రారంభించింది. బైజూస్ వ్యవస్థాపకులు రవీంద్రన్ బైజు, ఆయన కంపెనీ థింక్ అండ్ లెర్న్ కార్యాలయాల్లో ఫెమా చట్టం కింద శనివారం అధికారులు సోదాలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఈ స్టార్టప్ పెద్ద ఎత్తున విదేశీ పెట్టుబడులు అందుకున్నట్లు ఆరోపణలు వచ్చా యి. దీంతో కేసు నమోదు చేసి ఇడి దర్యాప్తు చేస్తోంది. మొత్తంగా రవీంద్రన్‌కు సంబంధించిన మూడు ప్రాంతాల్లో సోదాలు చేసింది. ఈ తనిఖీల్లో పలు డాక్యుమెంట్లు, డిజిటల్ డేటాను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బైజూస్ 2011 నుంచి 2023 మధ్య దాదాపు రూ.28 వేల కోట్ల విలువైన విదేశీ పెట్టుబడులు అందుకుందని తమ తనిఖీల్లో తేలిందని ఇడి వర్గాలు పేర్కొన్నాయి. ఇదే సమయంలో పెట్టుబడుల పేరుతో రూ.9,754 కోట్ల నిధులను విదేశాలకు బదిలీ చేసినట్లు తెలిపింది. ఇందులో అవకతవకలు జరిగాయని ఇడి వర్గాలు పేర్కొన్నాయి. 2020-21 ఆర్థిక సంవత్సరం నుంచి ఈ కంపెనీ ఆర్థిక లావాదేవీలను వెల్లడించలేదని, ఖాతాలను ఆడిటింగ్ చేయించలేదని తెలిపాయి. దీనిపై పలుమార్లు రవీంద్రన్‌కు నోటీసులు జారీ చేసినప్పటికీ ఆయన విచారణకు హాజరు కాలేదని ఈడి వర్గాలు తెలిపాయి.

ఫ్లిప్‌కార్ట్‌తో మ్యాటర్ భాగస్వామ్యం

న్యూఢిల్లీ : టెక్ ఇన్నోవేషన్ స్టార్టప్ మ్యాటర్ డిజైన్ చేసిన దేశంలోనే తొలి గేర్డ్ విద్యుత్ మోటార్ బైక్ ఎరా ప్రీ బుకింగ్ కోసం ఫ్లిప్‌కార్ట్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు తెలిపింది. వినియోగదారులు తమ మ్యాటర్ ఎరా మోటర్‌బైక్‌ను ముందస్తు బుకింగ్ చేసుకోవడానికి ఇది వీలు కల్పిస్తుందని పేర్కొంది. ప్రత్యేక ఆఫర్ల ప్రయోజనాలను పొందే అవకాశం లభిస్తుందని తెలిపింది. దేశ వ్యాప్తంగా 25 జిల్లాలో 2వేలకు పైగా పిన్ కోడ్స్‌లో ఎరా మోటార్ బైక్ అందుబాటులో ఉంటుందని వెల్లడించింది.

నగరంలో ది కొలోసియం స్టోర్ ఏర్పాటు

హైదరాబాద్ :ప్రముఖ డిజైన్ డెస్టినేషన్ ది కొలోసియం హైదరాబాద్‌లో తమ నూతన స్టోర్‌ను ప్రారంభించింది. జూబ్లీహిల్స్‌లో ఏర్పాటు చేసిన ఈ స్టోర్‌ను ఆ సంస్థ సహ వ్యవస్థాపకులు నీరజ్ హర్యుట్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ క్యూరేటెడ్ సెంటర్‌లో ఫర్నిచర్, లైటింగ్, కిచెన్‌లు, వార్డ్‌రోబ్‌లు, హోమ్ డెకర్, సాఫ్ట్ ఫర్నిషింగ్‌లు ప్రదర్శనకు ఉంటాయన్నారు. 120 పైగా ఫర్నిచర్ బ్రాండ్‌లు, 80 పైగా లైటింగ్ బ్రాండ్‌లు, 200 పైగా హోమ్ డెకర్ యాక్సెసరీ బ్రాండ్‌ల ఉత్పత్తులు లభిస్తాయని తెలిపారు.

బంగారం ధరల్లో రూ.220 తగ్గుదల

న్యూఢిల్లీ : బంగారం ధరల్లో స్వల్ప తగ్గుదల చోటు చేసు కుంది. శనివారం న్యూఢిల్లీ బులి యన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల స్వచ్ఛమైన 10 గ్రాముల బంగా రంపై రూ.220 తగ్గి రూ. 60,820గా పలికినట్లు గోల్డ్ రిటర్న్స్ వెబ్‌సైట్ తెలిపింది.

ముస్లింలను బెదిరిస్తున్న యూపీ సర్కారు

- రోడ్డు మీద నమాజ్ చేసినందుకు 1800 మందిపై కేసులు
- రంజాన్ రోజు కాన్పూర్‌లో పోలీసుల తీరు
- యోగి ప్రభుత్వంపై వెల్లువెత్తుతున్న ఆగ్రహం

లక్నో : 2017లో యూపీలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ముస్లింలను లక్ష్యంగా చేసుకొని యోగి సర్కారు కక్షపూరితంగా వ్యవహరిస్తున్నది. బుల్డోజర్ల కూల్చివేతలు.. ఎన్‌కౌంటర్ పేరుతో కాల్చివేతలు ఆ వర్గం ప్రజలే టార్గెట్‌గా కొనసాగాయని నిపుణులు, విశ్లేషకులు తెలిపారు. యూపీలో రెండో సార్లు అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితి మరింత తీవ్రమైందన్నారు. యోగి సర్కారు మరింత కఠినంగా వ్యవహరిస్తున్నదని చెప్పారు. ఇది ముస్లింలలో మరింత భయాన్ని కలుగజేస్తున్నదని తెలిపారు. ఇందుకు యూపీలోని కాన్పూర్‌లో తాజాగా చోటు చేసుకున్న ఘటనే ఇందుకు ఉదాహరణగా చెప్పొచ్చు. రంజాన్ రోజు ఎలాంటి అనుమతి లేకుండానే రోడ్డు మీదే ప్రార్థనలు (నమాజ్) చేస్తున్నారని 1800 మందిపై యూపీ పోలీసులు కేసులు నమోదు చేశారు. కాన్పూర్‌లోని మూడు వేర్వేరు పోలీసు స్టేషన్లలో ఈ కేసులు నమోదు కావడం గమనార్హం.

ఇప్పుడు ఈ అంశం రాజకీయంగా తీవ్ర చర్చకు దారి తీసింది. రాష్ట్ర ప్రభుత్వం తీరుపై స్థానిక ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. యోగి సర్కారు తీరును ప్రతిపక్ష పార్టీ నాయకులు, సామాజిక వేత్తలు తీవ్రంగా విమర్శించారు. మత సామరస్యాన్ని కాపాడాల్సింది పోయి ఒక వర్గాన్ని లక్ష్యంగా చేసుకుంటూ పోలీసు కేసులతో వారిలో భయాన్ని పెంపొందించడం దేనికి సంకేతమని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

అయితే, మతం పేరుతో తాము అవసరంగా టార్గెట్ అవుతున్నామని స్థానికులు ఆరోపించారు. రోడ్ల మీద నమాజ్ చేయడానికి అనుమతుండదన్న విషయం తెలియని కొందరు.. ఈద్గా ప్రాంతాల్లో స్థలం సరిపోకపోవడంతో రోడ్డు మీదకు వచ్చి ప్రార్థనలు చేశారని తెలిపారు. ఇది దురదృష్టకరమైన విషయమనీ ఎపిడెమిక్ యాక్ట్‌లోని సెక్షన్ 2 కింద కేసులు నమోదు చేశారనీ, ఇది ప్రభుత్వ ఆలోచనా తీరును తెలియజేస్తున్నదని అన్నారు. మొరాదాబాద్‌లో తమ ఇండ్లల్లో ప్రార్థనలు చేసుకుంటున్నవారిపై కేసులు నమోదయ్యాయనీ, కొన్ని వర్గాలను లక్ష్యంగా చేసుకొని పోలీసులు వ్యవహరిస్తున్న తీరుకు ఇది నిదర్శనమని స్థానిక ముస్లిం స్కాలర్ ఒకరు తెలిపారు. అమాయకపు ముస్లింలను విచారణ కోసం పోలీసులు తీసుకెళ్తారని కొందరు స్థానికులు భయాందోళనను వ్యక్తం చేశారు.

దేశంలోని ప్రతి ఒక్కరికి మత స్వేచ్ఛ ఉన్నదనీ, అయితే యూపీలోని యోగి సర్కారు మాత్రం ఒక వర్గాన్ని లక్ష్యంగా చేసుకొని వ్యవహరిస్తున్నదని ఇక్కడి ప్రజలు తెలిపారు. యోగి సర్కారు ఆదేశాలతో పని చేస్తున్న పోలీసులు, హిందూత్వ శక్తుల తీరుతో తాము బాధితులుగా మిగులుతున్నామని అన్నారు. అలీగర్, బాఘ్‌పట్‌లలోనూ ఇలాంటి కేసులే నమోదయ్యాయి. రోడ్లపై నమాజ్ చేస్తున్నారని పలువురిపై ఇలాంటి ఎఫ్ఐఆర్ నమోదు కావడం గమనార్హం.

మూడ్రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వానలు

- కొన్ని ప్రాంతాల్లో వడగండ్లు పడే అవకాశం
- పలు జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరిక జారీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో వచ్చే మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి కె.నాగరత్న తెలిపారు. అక్కడక్కడా ఉరుములు, మెరుపులు, ఈదురుగాలుల (గంటకు 30 నుంచి 50 కిలోమీటర్ల వేగం)తో వడగండ్ల వర్షం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే పలు జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికను జారీ చేశారు. ఆ జాబితాలో ఆదిలాబాద్, నిర్మల్, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్‌భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జోగులాంబ గద్వాల, నాగర్‌కర్నూల్, నారాయణ్‌పేట, వనపర్తి జిల్లాలున్నాయి. జీహెచ్ఎంసీ పరిధిలో రాబోయే 48 గంటల పాటు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా ఈదురు గాలులతో కూడిన తేలిక పాటి నుంచి మోస్తరు వర్షం పడే అవకాశముంది. శనివారం రాత్రి పది గంటల వరకు రాష్ట్రంలో 150కిపైగా ప్రాంతాల్లో వర్షపాతం నమోదైంది. శనివారం నాడు ఆదిలాబాద్ జిల్లా జైనథ్‌లో అత్యధికంగా 42.5 సెంటీమీటర్ల వర్షం కురిసింది.

కేసీఆర్ అవినీతి పాలనకు చరమగీతం పాడాలి

- టీజేఎస్ జెండావిష్కరణలో కోదండరాం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేల అవినీతికి అడ్డూ,అదుపు లేకుండా పోయిందని తెలంగాణ జన సమితి అధ్యక్షులు కోదండరాం ఆరోపించారు. ఈ అవినీతి పాలనకు చరమగీతం పాడాలని ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. శనివారం నాంపల్లిలోని టీజేఎస్ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ ఐదోవ ఆవిర్భావ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ జన సమితి కార్యకర్త తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల సాధన కోసం సైనికుడిలా పోరాడాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధి పేరుతో ఆర్భాట ప్రచారాలు చేస్తున్నదే తప్ప రాష్ట్రంలో ఎక్కడా నిర్మాణాత్మక అభివృద్ధి జరగడం లేదన్నారు. దళిత బంధు లబ్ధిదారుల దగ్గర ఎమ్మెల్యేలు రూ. మూడు లక్షల కమీషన్ తీసుకుంటున్నరని స్వయంగా సీఎం కేసీఆర్ ప్రకటించడం సిగ్గు చేటన్నారు. గత ఐదేండ్లుగా ఉద్యమ ఆకాంక్షల సాధన కోసం అలుపెరుగకుండా పోరాడుతున్నారని గుర్తు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి, రైతాంగ సమస్యలు, నిరుద్యోగం, ఫీజురియింబర్స్‌మెంట్, సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో నాణ్యమైన భోజనం కోసం, యూనివర్శిటీల బాగుకోసం ఇలా అనేక సమస్యలపై పోరాటాలు నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైరి రమేష్, టీజేఎస్ రాష్ట్ర యూత్ అధ్యక్షుడు సలీమ్ పాష, ఇతర నాయకులు నర్సయ్య, అరుణ్ కుమార్, రాంచందర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

పంటనష్టంపై రైతులకు భరోసా కల్పించాలి : పాకాల శ్రీహరిరావు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

అకాలవర్షాలకు పంటనష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం భరోసా కల్పించాలని తెలంగాణ రైతురక్షణ సమితి అధ్యక్షులు పాకాల శ్రీహరిరావు డిమాండ్ చేశారు. వివిధ పంటలకు పంట నష్టపరిహారం ఏవిధంగా, ఎంత మొత్తం ఎన్ని రోజుల్లో చెల్లిస్తారో చెప్పాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తడిసి రంగు మారిన, మొలకెత్తిన ధాన్యానికి, మొక్కజొన్న పంటలకు ఎంఎస్‌పీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్షల ఎకరాల్లో పంట నష్టం పెద్ద ఎత్తున జరిగిందని పేర్కొన్నారు. రైతుకు జరిగిన నష్టాన్ని జాతీయ విపత్తుతో సమానంగా పరిగణించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అందించాల్సిన సహకారం కూడా కలుపుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పరిహారంతోపాటు రైతుకు 30 రోజుల్లో పరిహారం అందించే ఏర్పాట్లు చేయాలని కోరారు. రుణ మాఫీ వెంటనే అమలు చేయకపోవడంతో రైతులు ప్రయివేటు అప్పులబారిన పడుతున్నారని చెప్పారు. పంట నష్టపోయిన ప్రాంతాలకు పంట రుణాలు రీషెడ్యూల్ చేయాలని కోరారు.

దళిత బంధుపై బీఆర్ఎస్ బందిపోట్ల దాడి

మానవతారాయ్ ఆగ్రహం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

దళిద బంధుపై బీఆర్ఎస్ బందిపోట్లు దాడి చేస్తున్నారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మానవతారాయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పథకం లబ్ధిదారుల నుంచి లక్షలు వసూలు చేస్తున్నారంటూ సీఎం స్వయంగా అంగీకరించారని గుర్తు చేశారు. తమ ఎమ్మెల్యేలు అవినీతి చేస్తుంటే, గుడ్డిగా కండ్లు మూసుకుని సీఎం కాపాడుతున్నారని ఆరోపించారు. అవినీతి పరుల ఎమ్మెల్యేల జాబితాను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయలో కేసీఆర్, మద్యం కమీషన్లలో కవిత, భూ కుంభ కోణంలో కేటీఆర్ దోచుకుంటే, ఆ పార్టీ ఎమ్మెల్యేలు దొరికిన కాడికి దోచుకుంటున్నారని ఆరోపించారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చారకొండ వెంకటేష్ మాట్లాడుతూ దళితబంధులో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అవినీతికి పాల్పడుతున్నా సీఎం ఎందుకు చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు.

నత్తనడకన కేంద్ర ప్రాజెక్టులు

భారీగా పెరుగుతున్న వ్యయం

న్యూఢిల్లీ: దేశంలో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులలో సగానికి పైగా నత్తనడక నడుస్తున్నాయి. కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ విడుదల చేసిన సమాచారం ప్రకారం ఈ సంవత్సరం మార్చి నాటికి కేంద్ర ప్రాజెక్టులలో 56.7 శాతం ప్రాజెక్టుల నిర్మాణం బాగా ఆలస్యమైంది. గడచిన రెండు దశాబ్దాల కాలంతో పోలిస్తే ఈ జాప్యం ఇప్పుడే అధికంగా ఉంది. ఈ సమాచారాన్ని మౌలిక సదుపాయాలు, ప్రాజెక్టుల పర్యవేక్షణ విభాగం ప్రచురించింది. దీని ప్రకారం దేశంలో రూ. 150 కోట్ల కంటే ఎక్కువ వ్యయమయ్యే 1,449 కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయి. వీటి నిర్మాణం సగటున మూడు సంవత్సరాల కంటే ఎక్కువగా ఆలస్యమవుతోంది.

ఈ జాప్యం కారణంగా ప్రాజెక్టుల ఖర్చు అంచనా వ్యయం కంటే 22.02 శాతం పెరిగింది. ఉదాహరణకు కొంకణ్ రైల్వే ప్రాజెక్ట్ వ్యయాన్ని 3,550 కోట్లుగా అంచనా వేశారు. అయితే ఆ ప్రాజెక్ట్ పూర్తయ్యేసరికి వ్యయం 120 రెట్లు పెరిగిపోయింది. నిర్మాణంలో బాగా ఆలస్యమవుతున్న ప్రాజెక్టులలో భారతీయ రైల్వేలకు చెందినవే ఎక్కువగా ఉన్నాయి. అంచనా వ్యయంతో పోలిస్తే ఈ ప్రాజెక్టుల ఖర్చు రూ. 2.5 ట్రిలియన్లు పెరిగింది. ఆ తర్వాతి స్థానం విద్యుత్ రంగానిది. ఈ రంగంలోని ప్రాజెక్టుల వ్యయం రూ. 0.6 ట్రిలియన్లు పెరిగింది. అలాగే జల వనరుల ప్రాజెక్టుల వ్యయం కూడా రూ. 0.5 ట్రిలియన్లు పెరిగింది. 2018లో కేంద్ర ప్రాజెక్టులలో కేవలం 19.3 శాతం ప్రాజెక్టుల నిర్మాణం మాత్రమే ఆలస్యమైంది. గడచిన ఐదేళ్ల కాలంలో ఈ జాప్యం బాగా పెరిగింది. మన్మోహన్ సింగ్ ప్రభుత్వ హయాంతో పోలిస్తే నరేంద్ర మోడీ ప్రభుత్వ కాలంలోనే ప్రాజెక్టులు ఎక్కువగా నత్తనడక నడుస్తున్నాయి.





ధాన్యం కొనుగోళ్లపై రైతుల ధర్నాలు

లారీలు లేక తూకం ఆపేస్తున్న నిర్వాహకులు

- తరుగు పేర క్వింటాల్‌కు 15 కిలోల కోతపై ఆగ్రహం

నవతెలంగాణ-నాంపల్లి/ బెజ్జంకి

అకాల వర్షాలు.. కేంద్రాల్లో టార్పాలిన్లూ అందుబాటులో లేవు.. వాతావరణంలో మార్పులతో వర్షం ఎప్పుడు వస్తుందోనన్న ఆందోళనతో రైతులు ఉంటే.. తూకాలు వేయకుండా నిర్వాహకులు ఇబ్బందులకు గురిచేస్తున్నారు. దీంతో కడుపు మండిన అన్నదాతలు రోడ్డెక్కారు. లారీలు లేవంటూ తూకం ఆపేయడం.. తరుగు పేర భారీగా కోత విధిస్తుండటాన్ని నిరసిస్తూ నల్లగొండ, సిద్దిపేట జిల్లాల్లో శనివారం ధర్నా చేశారు.

నల్లగొండ జిల్లా నాంపల్లి మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో తూకం ఆపేయడంపై మార్కెట్‌యార్డు ఎదుట నాంపల్లి-హైదరాబాద్ ప్రధానరోడ్డుపై రైతులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. నాలుగైదు రోజులుగా తూకం వేసిన ధాన్యాన్ని తరలించేందుకు లారీలు రాకపోవడంతో గురువారం నుంచి కాంటాలు ఆపేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

లారీలు లేవని ధాన్యం కొనుగోళ్లు జరపకపోవడం అన్యాయమన్నారు. లారీలు పంపించాలని పీఏసీఎస్ చైర్మెన్ గట్టుపల్లి నర్సిరెడ్డి నాలుగైదు రోజులుగా జిల్లా అధికారులతో మాట్లాడుతున్నప్పటికీ ఫలితం లేకపోవడంతో ఆయన కూడా రైతులకు మద్దతుగా రోడ్డుపై బైటాయించి ధర్నాలో పాల్గొన్నారు. విషయం తెలుసుకున్న నాంపల్లి సబ్ ఇన్‌స్పెక్టర్ రావుల నాగరాజు తన సిబ్బందితో ధర్నా ప్రదేశానికి చేరుకొని జిల్లా అధికారులతో మాట్లాడారు. శనివారం మధ్యాహ్నం వరకు లారీలు పంపిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పూలవెంకటయ్య, పీఏసీఎస్ డైరెక్టర్లు వెంకట్‌రెడ్డి, సతీష్, బిరుదోజు యాదమ్మ, గాదేపాక రాజు, పూల యాదగిరి, రైతులు పాల్గొన్నారు.

రైస్ మిల్ యాజమాన్యం తీరుపై ఆగ్రహం

రైస్‌మిల్లు యాజమాన్యంపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం దేవక్కపల్లి గ్రామ రైతులు రాజీవ్ రహదారిపై ధర్నా చేపట్టారు. సుమారు గంటపాటు రహదారిపై భారీగా వాహనాలు నిలిచాయి. దేవక్కపల్లిలోని ఐకేపీ వరి ధాన్యం కొనుగోలు కేంద్రానికి కేటాయించిన తోటపల్లి శివారులోని శ్రీలక్ష్మి రైస్ మిల్ యాజమాన్యం తూకం పేరుతో నిలువు దోపిడీ చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. క్వింటాల్‌కు తరుగు పేరున 15 కిలోల కోత విధించడానికి అంగీకరిస్తేనే ధాన్యం సేకరిస్తామని లేదంటే వెనక్కి పంపిస్తున్నారని రైతులు అన్నారు. రైతులకు అన్యాయం చేస్తున్న రైస్‌మిల్ యాజమాన్యంపై సంబంధిత అధికారులు చట్టపరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ విజయ ప్రకాశ్‌రావు, ఎస్ఐ ప్రవీణ్‌రాజ్ ఘటనాస్థలానికి చేరుకుని సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. బీజేపీ కిసాన్ మోర్చా కార్యదర్శి కరివేద మహిపాల్ రెడ్డి, రైతు బంధు సమితి మండల కన్వీనర్ ఒంటేల సంపత్ రెడ్డి, రావుల రామక్రిష్ణ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేసిరైతాంగాన్ని ఆదుకోవాలి

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి



నవతెలంగాణ-మిర్యాలగూడ

ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలోని అవంతిపురం మార్కెట్ యార్డ్‌లో పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించి ధాన్యాన్ని పరిశీలించారు. రైతులు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా మండలంలో పలు ఐకేపీ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా జూలకంటి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఐకేపీ సెంటర్లలో ధాన్యం కొనుగోళ్ల కాక రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వెంటనే రైతుల సమస్యలను పరిష్కరించాలని, ఐకేపీ సెంటర్లలో నిల్వ ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. నెల రోజుల నుంచి కేంద్రంలో ధాన్యం వద్ద కాపలా కాస్తున్నారని, వాతావరణంలో మార్పుల వల్ల ఎప్పుడు వర్షం వస్తుందోనని ఆందోలన చెందుతున్నారని చెప్పారు. నియోజకవర్గంలో ఎంత పంట వేశారు? ఎంత పంట ఐకేపీ కేంద్రాలకు వస్తుందని ముందస్తు ప్రణాళిక ప్రభుత్వానికి, అధికార యంత్రాంగానికి లేక పోవడం సిగ్గుచేటన్నారు. కొన్ని ఐకేపీ సెంటర్లలో ధాన్యం లోడ్ ఎత్తాలంటే రైతుల నుంచి అదనంగా డబ్బులు అడుగుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయన్నారు. అధికారులు సమస్యను పరిష్కరించాలన్నారు. ఐకేపీ కేంద్రాలకు వచ్చిన ధాన్యంపై కప్పడానికి టార్పాలిన్ కవర్లు కూడా ఇవ్వలేని దుస్థితి ఉందన్నారు. ఇప్పటికైనా యుద్ధ ప్రతిపాదికన ధాన్యాన్ని ఖరీదు చేయకపోతే సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేపడ్తామని హెచ్చరించారు. ఈ పర్యటనలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, జిల్లా కమిటీ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి రవినాయక్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు పిల్లుట్ల సైదులు ఉన్నారు.

తమను రెగ్యులరైజ్ చేయండి

- జూనియర్ పంచాయతీ కార్యదర్శుల దీక్షలు

నవతెలంగాణ- విలేకరులు

జూనియర్ పంచా యతీల కార్యదర్శుల సమ్మె కొనసాగుతోంది. తమను వెంటనే రెగ్యులరైజ్ చేయా లని డిమాండ్ చేశారు. శని వారం పలు జిల్లాల్లో ఎంపీ డీఓ కార్యాలయాల ఎదుట వారి దీక్షలకు ప్రజాసంఘాల నేతలు పలువురు సంఘీభావం తెలిపారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కడ్తాల్‌లో ఎంపీ రాములు, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డికి పంచాయతీ కార్యదర్శులు వినతిపత్రం అందజేశారు. వీరి దీక్షలకు సీఐటీయూ రాష్ట్ర నాయకులు కిల్లె గోపాల్, కేవీపీఎస్ నాగర్ కర్నూల్ జిల్లా కార్యదర్శి పరుశురాములు, బి.ఆంజనేయులు, తదితరులు మద్దతు ప్రకటించారు. ఆమనగల్‌లో చేపట్టిన దీక్షలకు టీపీసీసీ ఉపాధ్యక్షులు డాక్టర్ మల్లు రవి, కాంగ్రెస్ నాయుకులు మద్దతు తెలిపారు. ఖమ్మం జిల్లాలో ముదిగొండలో జూనియర్ పంచాయతీ కార్యదర్శుల దీక్ష శిబిరాన్ని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. సమస్యలు పరిష్కరించే వరకూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

టీఎన్జీవో అధ్యక్షులుగా మామిళ్ల రాజేందర్

- ప్రధాన కార్యదర్శిగా మారం జగదీశ్వర్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర నాన్ గెజిటెడ్ (టీఎన్జీవో) కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా మామిళ్ల రాజేందర్ రెండోసారి, ప్రధాన కార్యదర్శిగా మారం జగదీశ్వర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా జి వెంకటేశం, సహాయ ఎన్నికల అధికారిగా శశికాంత్‌రెడ్డి వ్యవహరించారు. టీఎన్జీవో కేంద్ర సంఘం నాయకులతోపాటు 33 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు హాజరై శనివారం నిర్వహించిన ఈ ఎన్నికల్లో పాల్గొన్నారు. కేంద్ర సంఘం ఎన్నికల్లో కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టీఎన్జీవో అసోసియేట్ అధ్యక్షులుగా కస్తూరి వెంకటేశ్వర్లు, ఎం సత్యనారాయణగౌడ్, కోశాధికారిగా రామినేని శ్రీనివాసరావు, పదిమంది ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా ఎన్నికైన మామిళ్ల రాజేందర్ మాట్లాడుతూ ఉద్యోగులందరూ తనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగుల సమస్యల సాధన కోసం ప్రభుత్వంతో స్నేహపూర్వకంగా ఉంటూనే పరిష్కరించుకుందామని చెప్పారు. త్వరలోనే ఈహెచ్ఎస్ కార్డులు, పీఆర్సీ పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తానని అన్నారు. ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన మారం జగదీశ్వర్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం రాజేందర్ నాయకత్వంలో కలిసి పనిచేస్తానని చెప్పారు.

సుప్రీం కోర్టు తీర్పు చారిత్రాత్మకం.. స్వాగతిస్తున్నాం..

- రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ బోయినపల్లి వినోద్ కుమార్

హైదరాబాద్:విద్వేష పూరిత ప్రసంగాలు చేసి సెక్యుల రిజాన్ని దెబ్బతీస్తే తీవ్ర నేరంగా పరిగణించి అలాంటి వ్యక్తులపై కుల, వర్గం, మతంతో సంబంధం లేకుండా కఠిన చర్యలు తీసుకోవా లన్న సుప్రీంకోర్టు తీర్పు చారిత్రా త్మకమైందని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ బోయినపల్లి వినోద్ కుమార్ పేర్కొన్నారు. ఆ తీర్పు ను స్వాగతిస్తున్నామని తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. దేశంలో సెక్యులరిజాన్ని కాపా డేందుకు సుప్రీంకోర్టు తాజా తీర్పు దోహదపడుతుం దని ఆశాభావం వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని కాపాడే బాధ్యత కోర్టులు తీసుకున్నాయనీ, రాజ్యాంగాన్ని అనుసరించాల్సి న బాధ్యత రాజకీయ పార్టీలపై కూడా ఉంటుం దన్న విషయాన్ని మరువకూడదని సూచించారు. లౌకిక త్వంతో పాటు భారత రాజ్యాంగం ప్రపంచ దేశాలకు ఆదర్శమనీ, ఇటీవల కాలంలో దేశంలో అశాంతిని పురి గొల్పేలా కొంత మంది వ్యక్తులు మాట్లాడుతున్నారని విమర్శించారు. విద్వేష పూరిత ప్రసంగాలపై ఫిర్యాదుతో సంబంధం లేకుండా సుమోటోగా తీసుకుని కేసులు నమోదు చేయా లన్న సుప్రీంకోర్టు తీర్పు అభినందనీయమని పేర్కొన్నారు.

చంద్రబాబుతో పవన్ కల్యాణ్ భేటీ

- ఐక్య కార్యచరణపై గంటకు పైగా చర్చ

హైదరాబాద్ : టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుతో జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ భేటీ అయ్యారు. శనివారం సాయంత్రం హైదరాబాద్‌లోని చంద్రబాబు నివాసానికి వచ్చిన పవన్ కల్యాణ్..సుమారు గంటకు పైగా చంద్రబాబుతో ఏకాంతంగా సమావేశమయ్యారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి, జనసేన పొత్తు ఉంటుందని ప్రచారం జరుగుతున్న తరుణంలో ఇరువురు నేతల భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తాజా రాజకీయ పరిస్థితులు, ప్రభుత్వ విధానాలు, ప్రజా సమస్యలపై వారు చర్చించినట్లు తెలిసింది. వైసిపి అప్రజాస్వామ్యక విధానాలను అవలంభిస్తోందనీ, విపక్ష నాయకులను టార్గెట్ చేసి దాడులు చేసేందుకు కూడా వెనకాడటంలేదని చంద్రబాబు ప్రస్తావించిట్లు సమాచారం. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఇరు పార్టీలు కలిసి ఐక్యంగా ఎలా ముందుకెళ్లాలనే దానిపై ప్రధానంగా చర్చించినట్టు టిడిపి వర్గాల ద్వారా తెలిసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఏక్య పోరాటాలు నిర్వహించి, ఎన్నికల వేళ పొత్తులపై నిర్ణయం తీసుకుందామని ఇరువురు నేతలు అభిప్రాయానికి వచ్చినట్లు తెలిసింది.

దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలి: నాగళ్ల పోచయ్య

- దళిత క్రైస్తవుల ఎస్సీ రిజర్వేషన్ సాధన సమితి ఆవిర్భావం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలని దళిత క్రైస్తవుల ఎస్సీ రిజర్వేషన్ సాధన సమితి (డీసీఎస్ఆర్ఎస్ఎస్) వ్యవస్థాపకులు నాగళ్ల పోచయ్య (ఇశ్రాయేల్) డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్ కూకట్ పల్లి ఎల్లమ్మబండ క్రైస్ట్ బిలీవర్స్ చర్చిలో ఆ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిషప్ సామ్యేల్ ఆధ్వర్యంలో సమితి ఆవిర్భావ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పోచయ్య మాట్లాడుతూ దళితుల మత స్వేచ్ఛను హరించడం భావ్యం కాదన్నారు. ఎస్సీ జాబితాలో చేరుస్తామని హామీ ఇచ్చి, ఆ దిశగా ప్రయత్నం చేయని రాజకీయ పార్టీలకు, నాయకులకు రాబోయే ఎన్నికల్లో బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సమితి మేడ్చల్ జిల్లా ఇన్ ఛార్జి అశోక్ కుమార్ తాటికొండ, 124వ డివిజన్ పాస్టర్స్ ఫెల్లోషిప్ ప్రెసిడెంట్ యేసురాజు, సమితి ఆర్గనైజింగ్ సెక్రెటరీ రొనాల్డ్ పాల్గొన్నారు.